జాతీయ
# స్ఫూర్తి
పక్షపత్రిక
RNI Regn No. 52879/93
2021, ఆగస్టు 1-31

ఏడు ప్రసంగాలు – ఎన్నో ప్రగల్భాలు

తాలిబాన్‌తో భారత్ ఎట్లా వ్యవహరించాలి?

మలాల : 'తాలిబన్లు కాల్చిన ఆ ఒక్క బులెట్.. 9 ఏళ్లయినా మానని గాయం..!'

బహుళ తాత్వికం – తిలక్ కవిత్వం

ఆయన అభ్యుదయ – అనుభూతివాదా ?

నల్ల నేరేడు నేతల ప్రతాప్

ఇది మామూలు గూఢచర్యం కాదు
మన సన్నిహిత అంతరంగాన్ని ఛిద్రం చేస్తున్నారు!

భారతావని జబ్బుపడ్డది

భిన్నత్వంలోనే భారతీయత మూలాలు

సాహితీ వైజ్ఞానికుడు దేవరాజు మహారాజు

వైజ్ఞానిక స్పృహ కోసం ఒక రోజు – 20 ఆగస్టు

నూతన ప్రపంచానికి దారిదీపం క్యూబా

మార్క్స్ ఔచిత్యం

అభ్యుదయ సాహిత్య వేదిక పెనుగొండ వ్యాస సంపుటి 'దీపిక'

21-22

**జాతీయ స్ఫూర్తి పక్షపత్రిక**

2021 ఆగస్టు 1-31
సంపుటి : 29
సంచిక : 21,22

డి.వి.వి.యస్. వర్మ, ప్రధాన సంపాదకులు
సంపాదక వర్గం
డా॥ బి. రమేష్‌చంద్రబాబు
కొప్పర్తి వెంకట రమణమూర్తి
డి. సోమసుందర్
మందలపర్తి కిషోర్

## ఈ సంచికలో...

3 ఏడు ప్రసంగాలు – ఎన్నో ప్రగల్భాలు - ఎ. కృష్ణారావు
5 తాలిబాన్‌తో భారత్ ఎట్లా వ్యవహరించాలి? కె. రామచంద్రమూర్తి
6 మలాల : 'తాలిబన్లు కాల్చిన ఆ ఒక్క బులెట్.. 9 ఏళ్లయినా మానని గాయం..!'
7 బహుళ తాత్వికం – తిలక్ కవిత్వం – కొప్పర్తి వెంకట రమణమూర్తి
12 ఆయన అభ్యుదయ–అనుభూతివాదా?
14 నల్ల నేరేడు నేతల ప్రతాప్
15 ఇది మామూలు గూఢచర్యం కాదు మన సన్నిహిత అంతరంగాన్ని ఛిద్రం చేస్తున్నారు! - అరుంధతి రాయ్
19 భారతావని జబ్బు పడ్డది - పద్మజ షా
22 భిన్నత్వంలోనే భారతీయత మూలాలు - రొమిల్లా థాపర్
24 సాహితీ వైజ్ఞానికుడు దేవరాజు మహారాజు - డా.ప్రసాదమూర్తి
27 వైజ్ఞానిక స్పృహ కోసం ఒక రోజు – 20 ఆగస్టు - డాక్టర్ దేవరాజు మహారాజు
29 నూతన ప్రపంచానికి దారిదీపం క్యూబా - సోనియా సురభి గుప్త
32 మార్క్స్ ఔచిత్యం - వెన్నెలకంటి రామారావు
37 అభ్యుదయ సాహిత్య వేదిక పెనుగొండ వ్యాస సంపుటి 'దీపిక' - తక్కోలు మాచిరెడ్డి

**సంపాదకీయం**

# పారదర్శకత లేని ఎన్నికల బాండ్లు ప్రజాస్వామ్యంలో వక్రమార్గం

ఎన్నికలలో పార్టీల నిధుల పాత్ర బహుముఖంగా విస్తరించింది. అది కేవలం ఓట్ల కొనుగోళ్ళకే పరిమితం కాలేదు. ఓటర్లను ఉక్కిరిబిక్కిరి చేసే విపరీత ప్రచారానికి అది ద్వారాలు తెరిచింది. భారీ బహిరంగ సభలు జనాల తరలింపులు, నిరంతర ప్రచార అడ్వర్‌టైజ్‌మెంట్లు, ఎలక్ట్రానిక్ మీడియాలో నిత్యప్రసారాలు, ఇంటింటి ప్రచారాలు, సామాజిక మాధ్యమాలలో ఏకపక్ష ప్రచార దళాలు, కార్యకర్తల సమీకరణ, నాయకుల రోడ్‌షోల ప్రచార ఆర్భాటాలు ఇలా ఓటర్లను ప్రభావితం చెయ్యడానికి వున్న అన్ని మార్గాలకూ వేల కోట్ల నిధులను పార్టీలు ఖర్చు పెడుతున్నాయి.

2017కు పూర్వం పార్టీ నిధుల సేకరణ మీద కొన్ని ఆంక్షలు వుండేవి. 20 వేల రూపాయలకు మించి ఎవరైనా విరాళం ఇస్తే వారి పేర్లను ఆయా పార్టీలు అధికారికంగా వెల్లడించి తీరాలి. అలాగే కంపెనీలు తమ వార్షిక ఆదాయంలో 5 శాతానికి మించి ఇలాంటి విరాళాలు ఇవ్వడం మీద ఆంక్షలుండేవి. అంటే పార్టీలకు సమకూరే నిధులలో 20 వేలకు మించి వచ్చిన వాటి వివరాలు పారదర్శకంగా ఉండేవి. ఎవరు ఇచ్చారు, ఎంత ఇచ్చారు అన్న వివరాలు అందరికీ అందుబాటులో వుండేవి. ఇప్పుడా పరిస్థితి లేదు.

2017లో బిజెపి ప్రభుత్వం ఈ ఆంక్షలను పూర్తిగా తొలగించింది. ఎన్నికల బాండ్ల పద్ధతిని ప్రవేశపెట్టింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఈ బాండ్లను అమ్ముతుంది. ఎవరైనా, ఎన్ని కోట్ల విలువైన బాండ్లనైనా కొనుగోలు చెయ్యవచ్చు. ఈ బాండ్లను వారు ఏ పార్టీకి ఇవ్వాలనుకుంటే వారికి దఖలు పర్చవచ్చును. ఎవరు ఇచ్చారన్నది ఆ పార్టీలకు కూడా తెలియనక్కరలేదు. ఇలా నల్లధనాన్ని ఎన్నికల బాండ్ల రూపంలో పొందే వీలు బిజెపి ప్రభుత్వం కల్పించింది. ఆశ్రిత వ్యాపారవేత్త నుండి, కార్పొరేట్ల నుండి కోట్లాది రూపాయలు సేకరించే వీలు కలిగించింది.

దీని పర్యవసానంగా బిజెపి వేల కోట్లకు పడగలెత్తింది. ఇలా గుర్తు తెలియని వ్యక్తుల నుండి గుర్తింపు పొందిన జాతీయ పార్టీలకు 2019–20 సంవత్సరంలో 3,377.46 కోట్లు వస్తే అందులో సింహ భాగం 2,640 కోట్లు బిజెపి దక్కించుకుంది. కాంగ్రెస్ పార్టీ కేవలం 526 కోట్లు పొందింది. ఈ అంశాలను ఇటీవల ఎ.డి.ఆర్. స్వచ్ఛంద సంస్థ ఆర్‌టిఐ ద్వారా స్టేట్‌బ్యాంకు నుండి పొందిన సమాచారం ఆధారంగా వెల్లడించింది. ప్రజాస్వామ్యాన్ని పూర్తిగా ధనస్వామ్యంగా మార్చిన ఈ ఎన్నికల బాండ్లు పారదర్శకతను పక్కనపెట్టాయి. ప్రజాస్వామ్యాన్ని వక్రమార్గం పట్టించాయి. ❑

# ఏడు ప్రసంగాలు - ఎన్నో ప్రగల్భాలు

ఎ. కృష్ణారావు
ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి



ప్రధానమంత్రి నరేంద్రమోదీ 2016 ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోటపై నుంచి ప్రసంగిస్తూ దేశరాజధాని ఢిల్లీకి మూడు గంటల దూరంలో ఉన్న నగ్లా ఫటేలా గ్రామానికి విద్యుచ్ఛక్తి రావడానికి ఏడు దశాబ్దాలు పట్టిందని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ఆ గ్రామంలో పిల్లలు మోదీ ప్రసంగాన్ని టీవీలో చూస్తున్న దృశ్యాల్ని అప్పటి విద్యుత్ మంత్రి పీయూష్ గోయెల్ తన ట్వీట్‌లో ప్రదర్శించారు. కాని ఆ గ్రామ సర్పంచ్ ప్రభుత్వ వ్యాఖ్యల్ని బాహాటంగా ఖండించారు. 'మా గ్రామంలో విద్యుత్ లేనే లేదు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పిల్లలు టీవీ చూస్తున్న దృశ్యాలు మా గ్రామానికి చెందినవి కానే కావు..' అని ఆయన మీడియాకు చెప్పారు. గత కొద్ది సంవత్సరాలుగా ప్రధానమంత్రి తన ఎర్రకోట ప్రసంగాల్లో నూటికి నూరు శాతం విద్యుద్దీకరణ గురించి చెప్పుకుంటూనే ఉన్నారు. కాని చాలా గ్రామాల్లో విద్యుత్ లేదని, కనెక్షన్లు లేని మీటర్లు గోడలకు వేలాడుతూనే ఉన్నాయని వార్తలు వస్తూనే ఉన్నాయి. 2016లో ప్రధాని పుణ్యమా అని హత్రాస్ జిల్లాలోని నగ్లా ఫటేలా గ్రామం వార్తల్లోకెక్కింది. 2020లో మొత్తం హత్రాస్ జిల్లాయే వార్తల్లోకెక్కింది. ఈ జిల్లాలోని మరో గ్రామం బూల్‌ఘరీలో ఒక దళిత మహిళపై అగ్రవర్ణాల యువకులు కొందరు అత్యాచారం చేసి గొంతు నులిమి చంపారు. మన దేశ ప్రగతికి కుల, మత తత్వాలు, ప్రాంతీయవాదం, సామాజిక, ఆర్థిక వివక్షలు అడ్డంకులని 2014లో ప్రధాని మోదీ తన తొలి స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ఎంతో ఆవేదనతో ఘోషించినప్పటికీ ఉత్తరప్రదేశ్ ప్రజలు పట్టించుకున్నట్లు లేదు.

2014లోనే 'మేక్ ఇన్ ఇండియా' నినాదాన్ని మోదీ తొలిసారి ఎర్రకోటలో వినిపించారు. 'రండి, దేశంలో ఉత్పత్తి చేయండి..' అని ఆహ్వానం పలికారు. కాని గత ఏడేళ్లుగా దేశంలో ఉత్పాదక రంగం అభివృద్ధి అంతంత మాత్రమే ఉన్నది. ఆర్థిక కార్యకలాపాలు పుంజుకునేలా చేసే ప్రాజెక్టులు, ఆస్తుల కల్పన, ఉపాధి కల్పనలో పెట్టుబడులు గత పదేళ్లలో 34.3 శాతం నుంచి 27.1 శాతానికి తగ్గిపోయాయి. భారీ ఎత్తున ప్యాకేజీలు కల్పిస్తున్నామని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటనల వర్షం కురిపిస్తున్నా, అత్యధిక ఉపకరణాల వ్యయం, తక్కువ డిమాండ్ మూలంగా తాము సగం సామర్థ్యాన్నే ఉపయోగిస్తున్నామని సూక్ష్మ, చిన్న మధ్యతరహా పరిశ్రమల రంగం చెబుతుండగా, కార్పొరేట్లు కూడా తమ సంస్థల్లో అనుకున్నంత పని జరగడం లేదని ఒప్పుకుంటున్నారు. '2014-19లో మనది 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థికవ్యవస్థ. ఇప్పుడు 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ చేయబోతున్నాం..' అని 2019లో స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా మోదీ ప్రకటించారు. కాని మన పెట్టుబడుల రేటు 40 శాతం పెంచి, ఆదాయాలు, ఉపాధి కల్పన, అవకాశాలు పెరిగితే కాని ఆర్థిక వ్యవస్థ ఊపందుకునేలా లేదు.

తన తొలి స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలోనే మోదీ 'సంసద్ ఆదర్శ్ గ్రామ యోజన'ను ప్రకటించారు. ఎంపీలు తమ నియోజకవర్గంలోనే ఏదో ఒక గ్రామాన్ని ఎంచుకుని అభివృద్ధి పరచాలని, దాన్ని ఆదర్శ గ్రామంగా మార్చాలని ఆయన సూచించారు. ఈ పథకం ప్రకటించిన తర్వాత గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ సమీక్షిస్తే ఈ పథకం క్రింద ఏ గ్రామమూ అభివృద్ధి చెందలేదని తేలింది. చాలా మంది బిజెపి ఎంపీలే ప్రధానమంత్రి పిలుపును పట్టించుకోలేదని, తమ ఎంపీ నిధుల్లో నుంచి డబ్బు కేటాయించలేదని స్పష్టమైంది.

వచ్చే ఆగస్టు కల్లా దేశంలో బాలికలు, బాలురకు శౌచాలయ సౌకర్యాలు లేని ఏ స్కూలూ ఉండరాదని కూడా ప్రధాని తన ప్రసంగంలో నిర్దేశించారు. 2020లో కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ నిర్వహించిన సర్వే ప్రకారం దేశంలో 40 శాతం స్కూళ్లలో శౌచాలయాలు లేనే లేవని, కొన్ని చోట్ల సగమే కట్టారని, కొన్ని చోట్ల ఉపయోగించే విధంగా లేవని తేలింది. 70 శాతం స్కూళ్లలో శౌచాలయాల్లో నీటి సదుపాయమే లేదని, 75 శాతం శౌచాలయాలు అపరిశుభ్రంగా ఉన్నాయని కాగ్ తేల్చింది. దేశంలో 15 వేల ప్రభుత్వ స్కూళ్లలో శౌచాలయాలు లేవని, 42 వేల స్కూళ్లలో త్రాగునీటి సదుపాయాలు లేవని 2021 మార్చిలో నాటి విద్యామంత్రి రమేశ్ పోఖ్రియాల్ రాజ్యసభలోనే ప్రకటించారు. గత నెలలో జరిగిన మంత్రివర్గ విస్తరణలో పోఖ్రియాల్‌ను తీసేసి ధర్మేంద్ర ప్రధాన్‌కు ఆ బాధ్యతలు

అప్పుడెప్పారు. నిర్మలా సీతారామన్‌లాగా అంతా అద్భుతంగా ఉందని చెప్పాలి కాని నిజాలు చెపితే తలలు ఎగిరిపోతాయని రమేశ్ పోఖ్రియాల్‌కు అర్థం కాలేదనుకోవాలి.

2015 స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధాని మోదీ 'స్టార్టప్ ఇండియా' పథకాన్ని ఆర్భాటంగా ప్రకటించారు. కానీ తాజాగా పరిస్థితిని సమీక్షిస్తే భారతదేశంలో 90 శాతం స్టార్టప్‌లు ప్రారంభమైన తొలి ఐదు సంవత్సరాల్లోనే విఫలమైనట్లు తెలుస్తోంది. ఇందుకు కారణాలను సమీక్షించి వాటిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం శ్రద్ధ తీసుకున్న దృష్టాంతాలు కనపడడం లేదు. 2022కల్లా భారత దేశంలో ఇళ్లు లేని వారంటూ ఉండరని కూడా మోదీ ఆ సందర్భంగా ప్రకటించారు. కాని 17 కోట్ల మంది నిరాశ్రయులై ఉన్నారని లెక్కలు చెబుతున్నాయి. దేశ రాజధాని ఢిల్లీలోనే వేలాది మంది నైట్ షెల్టర్లలోనూ, పేవ్‌మెంట్ల పైనా నిద్రిస్తున్నారని ప్రధానమంత్రి మోదీ మారువేషం వేసుకుని ఒక రోజు ఢిల్లీ రోడ్లపై తిరిగితే తెలుస్తుంది.

2016 స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో గ్రామీణ రహదారుల కార్యక్రమాన్ని బృహత్తరంగా అమలు చేస్తున్నట్లు మోదీ చెప్పుకున్నారు. కాని 26 నుంచి 30 శాతం గ్రామాలకు పక్కా రోడ్లు లేవని విశ్వసనీయ సమాచారం చెబుతోంది. తాము కాలం చెల్లిన 1200 చట్టాలను రద్దు చేశామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ సగర్వంగా అదే ప్రసంగంలో చెప్పుకున్నారు. కానీ 'మహాత్మాగాంధీ, సర్దార్ పటేల్, బాలగంగాధర్ తిలక్ లాంటి వారిని అరెస్టు చేసేందుకు కారణమైన వలస పాలన కాలం లాంటి ఐపీసీలోని సెక్షన్ 124–ఎ ను ఇంకా కొనసాగించడం అవసరమా?' అని సుప్రీంకోర్టు ఇటీవలే ప్రశ్నించిన విషయం మోదీకి తెలియదనుకోకూడదు. సుప్రీంకోర్టు రద్దు చేసిన ఐటీ చట్టంలోని సెక్షన్ 66– ఎను కూడా పోలీసులు ఉపయోగిస్తున్న విషయాన్ని కూడా ఉన్నత న్యాయస్థానం గుర్తు చేయాల్సి వచ్చింది. కాలం చెల్లిన చట్టాలను రద్దు చేస్తున్నామనే పేరుతో 2016లో ఒక చట్టాన్ని పెద్దగా చర్చ లేకుండా రద్దు చేసి భారత్ పెట్రోలియం కార్పొరేషన్‌లో ప్రభుత్వ వాటాలను అమ్ముకున్నారని ఎంత మందికి తెలుసు?

2017 స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధానమంత్రి ప్రకటించిన 'జెమ్' పోర్టల్ కానీ, 'ప్రధానమంత్రి కృషి సించాయ్ యోజన' కానీ అనుకున్న ఫలితాలు సాధించలేదు. ప్రభుత్వ విభాగాలకు అవసరమైన వస్తువులు, సేవల సేకరణలో అవినీతిని నిరోధించేందుకు ఉద్దేశించిన జెమ్ పోర్టల్ ద్వారా ప్రతి ఏడాది రూ.7 నుంచి రూ.8 లక్షల కోట్ల వస్తు సేవల సేకరణ పారదర్శకంగా జరగాలని భావించారు. కాని అది రూ.లక్ష కోట్ల సేకరణ కూడా అతి కష్టమ్మీద చేయగలుగుతోంది. అదే విధంగా పంటలకు నీరందించేందుకు ఉద్దేశించిన 'కృషి సించాయ్ యోజన'కు అనుకున్న విధంగా నిధులు కేటాయించడం కానీ, లక్ష్యాలను సాధించడం కానీ జరగలేదని గణాంక వివరాలు పరిశీలించిన వారెవరికైనా తెలుస్తుంది. 'ప్రతి ఇంటికీ నీరు' పథకం కూడా ఇదే విధంగా నీరు గారింది. భారతదేశంలో 9 కోట్ల మందికి కనీస తాగునీటి వసతి లేదని ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక చెబుతోంది. ఇదే సంవత్సరంలో ప్రధానమంత్రి ఎర్రకోట నుంచి వ్యవసాయ రంగంలో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం కోసం ప్రధానమంత్రి 'కిసాన్ సంపద యోజన'ను ప్రకటించారు. అయితే ఈ పథకం కింద సమకూర్చిన నిధులను ఆహారోత్పత్తుల పరిశ్రమలు సరిగా ఉపయోగించలేదని, 430 ప్రాజెక్టుల్లో 103 ప్రాజెక్టులను రద్దు చేశారని పార్లమెంటరీ స్థాయీ సంఘం ఇటీవల సమర్పించిన నివేదికలో పేర్కొంది.

దేశంలో పేద ప్రజలెవరూ అనారోగ్యంతో మరణించ కూడదనే ఉద్దేశంతో ప్రధానమంత్రి జన ఆరోగ్య అభియాన్‌ను ప్రారంభించామని మోదీ 2018 స్వాతంత్ర్య దినోత్సవంలో ప్రకటించారు. కరోనా వైరస్ తీవ్రంగా వ్యాప్తి చెందిన సమయంలో ఈ పథకం పేద ప్రజలకు పెద్దగా ప్రయోజనాలను సమకూర్చ లేదని ఆనాటి పరిస్థితులు, గణాంక వివరాలను అధ్యయనం చేస్తే అర్థమవుతుంది. మహిళా అధికారులకు సాయుధ దళాల్లో శాశ్వత కమిషన్ ఏర్పాటు చేస్తున్నట్లు తాను సగర్వంగా ప్రకటిస్తున్నానని మోదీ ఈ సందర్భంగా వెల్లడించారు. కాని అది సరిగా ఆచరణలోకి రాకపోవడంతో 2020లో సుప్రీంకోర్టు కలుగజేసుకుని మహిళా అధికారులందరికీ శాశ్వత కమిషన్ ఏర్పాటు చేయాలని ఆదేశించడంతో సాయుధ దళాల్లో అత్యధిక పాత్ర వారికి లభించేందుకు ఆస్కారం లభించింది.

2019, 2020, 2021... ఈ మూడు సంవత్సరాలలోనూ ప్రధాని మోదీ తన స్వాతంత్ర్యదినోత్సవ ప్రసంగాలలో ఒకే హామీని ప్రకటించారు. దేశ మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూ.100 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టాలని నిర్ణయించినట్లు ఆయన ఈ మూడు సార్లూ దేశ ప్రజలకు తెలిపారు. మోదీ ఏడేళ్ల ప్రసంగాల్లో అనేక హామీలు పునరావృతమయ్యాయి. ప్రతి ఆగస్టు 15న ఎర్రకోట నుంచి గంటకు తక్కువ కాకుండా మోదీ చేస్తున్న ప్రసంగాల్లో ఆయన హావభావాలు తప్ప ప్రజలకు ఒరిగేది ఏమున్నది? ❑

# తాలిబాన్‌తో భారత్ ఎట్లా వ్యవహరించాలి?



కె. రామచంద్రమూర్తి

అఫ్ఘానిస్తాన్‌లో తాలిబాన్ రాజ్యం నెలకొన్న నేపథ్యంలో భారత్ ఏమి చేయాలి? భారత విదేశాంగ విధానంలో రావలసిన మార్పులు ఏమిటి? భారత్‌కు ప్రయోజనకరమైన మార్గం ఏమిటి? ప్రస్తుతం భారత్ పరిస్థితి ఏమిటి? అంతర్గత వ్యవహారాలకూ, విదేశీ వ్యవహారాలకూ ఎంతో కొంత సంబంధం ఉంటుంది. కేంద్రంలో నరేంద్రమోదీ అనుసరిస్తున్న విధానాలకూ, భారత్ విదేశాంగ విధానానికీ మధ్య విడదీయలేని బంధం ఉంటుంది.

## జయశంకర్, దోవల్ నిర్వాకం

ప్రస్తుతం భారత విదేశాంగ విధానాన్ని విదేశాంగమంత్రి జయశంకర్, భద్రతావ్యవహారాల సలహాదారు అనిల్ కుమార్ దోవల్‌లు నిర్దేశిస్తున్నారు. ప్రధానమంత్రికి విదేశీ వ్యవహారాలపైన ఎంత అవగాహన ఉన్నదో తెలియదు. గత ఏడేళ్ళ నరేంద్రమోదీ పాలనలో విదేశీ వ్యవహారాలు దెబ్బ తిన్నాయి. మోదీ పాలనలో భారతదేశం అంతర్జాతీయ ప్రతిష్ఠ పెరిగిందనీ, దేశం పట్ల గౌరవ భావం పెరిగిందనీ ప్రచారం చేసుకోవడానికి బాగానే ఉంటుంది కానీ వాస్తవంగా జరిగింది ప్రచారానికి పూర్తి భిన్నం. మన ఇరుగుపొరుగు దేశాలన్నీ చైనా చెప్పుచేతలలో ఉన్నాయి. మన దేశవాసులే వెళ్ళి స్థిరపడిన శ్రీలంక, హిందూమతానికి చెందినవారే నివసిస్తున్న నేపాల్, మన సహకారంతో పురుడు పోసుకున్న బంగ్లాదేశ్ ఇప్పుడు చైనాకు సన్నిహితంగా ఉన్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే చైనా, భారత్‌లో ఒక దేశాన్ని మిత్రదేశంగా ఎంచుకోమని అడిగితే ఈ దేశాలన్నీ చైనాను ఎంచుకుంటా యనడంలో సందేహం అణుమాత్రం అక్కరలేదు. పాకిస్తాన్‌తో సమస్యలు జటిలమైనాయే కానీ తగ్గలేదు. చైనాతో సంఘర్షణ వాతావరణం నెలకొన్నది. రష్యా క్రమంగా చైనా పంచన చేరింది. ఇందిరాగాంధీ హయాంలో సోవియట్ యూనియన్‌తో ఇరవై సంవత్సరాల స్నేహ ఒడంబడికను కుదుర్చుకున్న ఇండియా ఇప్పుడు రష్యాను మిత్రదేశంగా పిలుచుకునే పరిస్థితి లేదు. సప్త సముద్రాల ఆవల ఉన్న అమెరికాతో, చాలా దూరంగా ఉన్న ఆస్ట్రేలియాతో, సైనికంగా, ఆర్థికంగా పెద్దగా సాయపడలేని స్థితిలో ఉన్న జపాన్‌తో సన్నిహిత సంబంధాలు పెట్టుకున్నాం. క్వాడ్ కూటమిలో చేరాం. దక్షిణ చైనా సముద్ర ప్రాంతానికి మన యుద్ధనౌకను పంపించాం. ఈ కూటమిని నమ్ముకొని ఇరుగుపొరుగు దేశాలతో శత్రుత్వం పెంచుకుంటున్నాం. ఈ కూటమికి నాయకత్వ స్థానం అమెరికాది. అమెరికాను ఎంత వరకూ నమ్మవచ్చు? కష్టసమయాలలో అమెరికా ఆదుకుంటుందా?

## ఇందిరాగాంధీ ఏమన్నారు?

అమెరికాకైనా, మరే దేశానికైనా స్వప్రయోజనాలు ముఖ్యం. ఒకసారి ఇందిరాగాంధీని ఒక విదేశీ విలేఖరి 'మీరే సోవియట్ యూనియన్‌కు అనుకూలమా? అమెరికాకు అనుకూలమా?' అని ప్రశ్నించాడు. ఇందిరాగాంధీ వెంటనే 'ఇండియాకు అనుకూలం' అనే సమాధానం ఇచ్చారు. అదే సరైన వైఖరి. అమెరికా ప్రపంచ పోలీసు పాత్రను విరమించుకోవలసిన సమయం ఆసన్నమైంది. అఫ్ఘానిస్తాన్ నుంచి నిష్క్రమించిన తీరు చాలా అంశాలను స్పష్టం చేస్తున్నది. గత రెండు దశాబ్దాలుగా అమెరికా అఫ్ఘానిస్తాన్‌లో ఒక ట్రిలియన్ డాలర్లు ఖర్చు చేసింది. అఫ్ఘానిస్తాన్ రక్షణ కోసం నాలుగు వేల మంది సైనికులను కోల్పోయింది. అయినా అఫ్ఘానిస్తాన్ ప్రజలహృదయాలను గెలవలేకపోయింది. ఎందుకని? అసలు అమెరికా అఫ్ఘానిస్తాన్‌ను ఆక్రమించుకున్న పద్ధతినే అఫ్ఘాన్ ప్రజలు అంగీకరించలేదు. పాకిస్తాన్‌లో తలదాచుకున్న ఒసామా బిన్ లాడెన్‌ను సంహరించిన తర్వాత అమెరికాకు అఫ్ఘానిస్తాన్ నుంచి ఎంత త్వరగా వెళ్ళిపోతే అంత బాగనే అభిప్రాయం బలపడింది. అందుకనే ప్రెసిడెంట్ ట్రంప్ హయాంలో అఫ్ఘానిస్తాన్ ప్రభుత్వం ప్రమేయం లేకుండానే నేరుగా పాకిస్తాన్ సహకారంతో తాలిబాన్‌తో చర్చ ప్రారంభించింది. అమెరికా ప్రోత్సాహంతో అఫ్ఘానిస్తాన్ అధ్యక్షుడిగా బాధ్యతలు తీసుకున్న అష్రాఫ్ ఘనీకి తెలియకుండా అమెరికా అధికారులు తాలిబాన్‌తో వ్యవహారం చేయడం అమిత్ర చర్య కాదా? వియత్నాం యుద్ధాన్ని విరమించి అమెరికా సైగాన్‌ను వీడి వచ్చినప్పుడు అక్కడ కమ్యూనిస్టు పార్టీ బలమైన స్థితిలో ఉంది. వియత్నాంను ఏకం చేసి సమర్థంగా పరిపాలించి ఆర్థికంగా విజయాలు సాధిస్తున్నది. అటువంటి

☞ మిగతా 11వ పేజీలో

# మలాల : 'తాలిబన్లు కాల్చిన ఆ ఒక్క బులెట్..
# 9 ఏళ్లయినా మానని గాయం..!'

"తాలిబన్లు నాపై కాల్పులు జరిపి 9 ఏళ్లు అయినా.. ఆ ఒక్క బులెట్ గాయం నుంచి నేనింకా కోలుకోలేకపోతున్నా. కానీ, గత నాలుగు దశాబ్దాలుగా అఫ్గాన్ ప్రజలు లక్షల కొద్దీ బులెట్లను ఎదుర్కొంటున్నారు. నేటికీ వారి వేదన అరణ్య రోదనే" అంటూ అఫ్గానిస్థాన్ పౌరుల దుస్థితిపై నోబెల్ శాంతి బహుమతి గ్రహీత మలాలా యూసఫ్‌జాయ్ ఆవేదన వ్యక్తం చేశారు.

తాలిబన్లు అఫ్గాన్‌లో తొలి ప్రావిన్స్‌ను ఆక్రమించుకున్న సమయంలో మలాలాకు సర్జరీ జరిగింది. ఆ ఆపరేషన్ నుంచి ఇటీవలే కోలుకున్న ఆమె.. ప్రస్తుత అఫ్గాన్ పరిస్థితులపై స్పందిస్తూ తాలిబన్ల కారణంగా తాను అనుభవిస్తున్న గాయాలను పంచుకున్నారు. అది మలాలా మాటల్లోనే..



"రెండు వారాల క్రితం అఫ్గాన్‌ను తాలిబన్లు తమ నియంత్రణలోకి తీసుకుంటున్న సమయంలో నాకు బోస్టన్‌లో ఆరో శస్త్రచికిత్స జరిగింది. తాలిబన్ల వల్ల నా శరీరానికి జరిగిన నష్టాన్ని పూడ్చేందుకు డాక్టర్లు ఇంకా ప్రయత్నిస్తూనే ఉన్నారు.

అది 2012 అక్టోబరు. పాకిస్థానీ తాలిబన్లు నా స్కూల్ బస్సులోకి చొరబడి నా ఎడమ కణతిపై తుపాకీతో కాల్చారు. ఆ ఒక్క బుల్లెట్ నా ఎడమ కంటిని, నా మెదడును తినేసింది. నా ముఖ నరాలను దెబ్బతీసింది. చెవిని, దవడను విరగ్గొట్టింది.

సమయానికి నన్ను ఆసుపత్రికి తీసుకెళ్లడంతో పెషావర్ డాక్టర్లు నా ఎడమ కణతి వద్ద పుర్రెలో కొంత భాగాన్ని తొలగించారు. దాన్ని వల్లే నా ప్రాణాలు నిలిచాయి. అయితే ఆ తర్వాత మిగతా అవయవాలు పని చేయకపోవడంతో నన్ను చికిత్స నిమిత్తం మరో దేశానికి తీసుకొచ్చారు.

ఇది జరిగినప్పుడు నేను కోమాలో ఉన్నాను. తాలిబన్లు వచ్చి నన్ను కాల్చినంత వరకే గుర్తుంది. ఆ తర్వాత నేను కళ్లు తెరిచి చూసేసరికి యూకేలోని క్వీన్ ఎలిజబెత్ ఆసుపత్రిలో ఉన్నాను. నేను బతికానంటే నాకే నమ్మబుద్ధి కాలేదు."

"కళ్లు తెరిచిన తర్వాత నా చుట్టూ అంతా ఇంగ్లీష్ మాట్లాడుతున్నారు. నాకు ఏం జరిగింది? మా నాన్న ఎక్కడ ఉన్నారు? నా చికిత్సకు డబ్బులు ఎవరు కడుతున్నారు? ఇలా ఎన్నో ప్రశ్నలు నన్ను సతమతం చేశాయి. కానీ నేను మాట్లాడలేకపోయా. కంటిచూపు కూడా సరిగ్గా లేదు.

కొద్ది రోజుల తర్వాత నన్ను నేను అద్దంలో చూసుకుని షాక్ అయ్యా. ఒక కన్ను నల్లగా, సగం గుండుతో కన్పించా. తాలిబన్లు నాకు గుండు గీయించారని అనుకున్నా. కానీ సర్జరీ కోసం డాక్టర్లు షేవ్ చేశారని చెప్పారు. ఒక రోజు నా పొట్టను తడుముకుంటే గట్టిగా తగిలింది. నా పొట్టకు ఏమైందని నర్సును అడిగాను.

పాకిస్తాన్‌లో ఆపరేషన్ చేసినప్పుడు పుర్రె ఎముకలో కొంత భాగాన్ని తీసి కడుపులో దాచారని, మరో సర్జరీ చేసిన దాన్ని తలలో అమర్చాలని చెప్పారు. అయితే యూకే వైద్యులు నా పుర్రె ఎముక స్థానంలో టైటానియం ప్లేట్‌ను అమర్చారు. కడుపులో ఉన్న ఎముక భాగాన్ని బయటకు తీశారు. ఇప్పటికీ ఆ భాగం మా ఇంట్లో బుక్ షెల్ఫ్‌లో ఉంది"

"కొన్నాళ్లు నా కుటుంబం కూడా యూకేకు వచ్చింది. ఆ తర్వాత నాకు ఫిజికల్ థెరపీ మొదలుపెట్టారు. మెల్లిగా నడవడం, చిన్నగా మాట్లాడటం మొదలుపెట్టా. అదంతా మరో జన్మ ఎత్తినట్లుగా అన్పించేది. బులెట్ గాయం కారణంగా ముఖానికి పాక్షికంగా పక్షవాతం వచ్చింది. దీంతో వైద్యులు మరో ఆపరేషన్ చేశారు. నరానికి సర్జరీ చేసి ముఖాన్ని ఓ రూపు తీసుకొచ్చారు.

ఇప్పటికీ నేను నవ్వితే నా గాయాలు కన్పిస్తాయి. అందుకే నవ్వినప్పుడు నా నోటిని కవర్ చేసుకుంటున్నా. అయితే వీటన్నింటి వల్ల నేను బాధపడలేదు. వాస్తవాన్ని అంగీకరించా. ఆత్మవిశ్వాసంతో ఉన్నా.

అద్దంలో నా ముఖం చూసుకోకుండా నేను బాగున్నాను అనుకునేదాన్ని. 2018, 2019లో మరో రెండు సర్జరీలు చేశారు. అయితే చివరిసారి చేసినప్పుడు నా చెంప, దవడ భాగం ఉబ్బిపోయాయి. దీంతో మరో ఆపరేషన్ చేయాలన్నారు"

☞ మిగతా 13వ పేజీలో

# బహుళ తాత్వికం - తిలక్ కవిత్వం



కొప్పర్తి వెంకట రమణమూర్తి

ఒక కవి జన్మించి వందేళ్లు కావడం కన్నా మరణించి యాభైఏళ్లు దాటడం ఆ కవిని పునర్మూల్యాంకనం చెయ్యడానికి మంచి ఉపకరణం అవుతుంది. కవి మరణించడంతో అతని లేదా ఆమె కవిత్వ సృజన మొత్తంగా దృశ్యమానమూ తుల్యమానమూ అవుతుంది. దాని తాజాదనమూ ప్రభావమూ ప్రాథమ్యాలూ నిగ్గుదేలుతూ ఉంటాయి. కాలం ఎప్పుడూ సాపేక్షమే. కవిత్వమూ అంతే. రోజులు గడిచే కొద్దీ కవీ కవిత్వమూ కాల పరీక్షను ఎదుర్కొంటారు. ఒకానొక వర్తమానంలో కొన్ని సిద్ధాంతాలూ, ధోరణులు వాదనలూ సాహిత్యాన్ని బలంగా ప్రభావితం చేస్తాయి. అవి ఎంత బలంగా ఉంటాయంటే వాటికి ఎదురువెళ్లడం యుగధర్మాన్ని ప్రతిఘటించడమే అవుతుంది. అంతటి ప్రతికూల పరిస్థితులలో కూడా వాటికి భిన్నమైన ఆలోచనలు పొడచూపుతుంటాయి. వాటిని గుర్తించడానికీ, ప్రేమించడానికీ, ప్రకటించడానికి సమాజం భయపడుతుంది. ఈ ఆలోచనలు చిన్నప్పుడు కథలో చదువుకున్నట్టుగా తుఫాను సమయంలో తలలు వంచి వాతావరణం తెరిపిన పడ్డాక తలలెత్తే చిన్నచిన్న మొక్కలు. ఇవి క్రమంగా ఎదిగి అస్తిత్వాన్ని ప్రకటిస్తాయి. అట్లాగే ఎన్ని విప్లవాత్మక మార్పులు సంభవించినా గతంతో పూర్తిగా తెగదెంపులు చేసుకోలేని లక్షణం ఒకటి సమాజంలో ఉంటుంది. రాయి ఆదిమ మానవుడి ఆయుధం. అయితే అణ్వాయుధాలు వచ్చిన కాలంలోనైనా కుక్క వెంటపడ్డప్పుడు కంటికి కనిపించిన బెడ్డముక్కే ఆయుధమౌతుంది. ఎన్ని గ్రైండింగ్ మెషీన్లు వచ్చినా రుచి తెలిసిన గృహిణి ఎక్కడో ఒకచోట సన్నికల్లు మీద పచ్చడి నూరుతూనే ఉంటుంది. దీన్నే అవిచ్ఛిన్నత అన్నారు. వర్తమాన నూతన భావనలు గతాన్ని ప్రభావితం చేసిన కొన్ని సార్వత్రిక మానవీయ భావనల్ని తనతో కలుపుకున్నపుడూ, మానవజాతి విముక్తికి ఏ ఒక్క సిద్ధాంతమో పరిష్కారం చూపలేదని భావించినపుడూ, అఖండసత్యం అంటూ లేదనీ ఉన్నవన్నీ పాక్షిక సత్యాలేననీ అర్థమైనపుడూ ఆలోచనాపరుడు లేదా కళాకారుడు విభిన్నమైనవీ లేదా వ్యతిరిక్తమైనవీ అనుకున్న భావనల్ని సంలీనపరుస్తాడు. దాన్నే బహుళ తాత్వికత అనవచ్చు. యాభై ఐదేళ్ల క్రితం మరణించి ఈ సంవత్సరం శతజయంతి జరుపు కుంటున్న దేవరకొండ బాలగంగాధర తిలక్(1,ఆగస్టు 1921– 31, జులై 2021) కవిత్వం అటువంటి బహుళతాత్వికతకు ఉత్తమ ఉదాహరణ అనిపిస్తుంది.

శ్రీశ్రీ యుగంలో కవిత్వ వ్యక్తిత్వాన్నీ నిలుపుకున్న ఒకరిద్దరిలో తిలక్ ఒకడు. శ్రీశ్రీ అతన్ని వయస్సు సగం తీరక ముందే, నభం సగం చేరక ముందే అస్తమించిన ప్రజాకవీ, ప్రభారవీ అన్నాడు. సమకాలిక సమస్యలకు స్వచ్ఛస్ఫాటిక ఫలకం అని కూడా అన్నాడు. అభ్యుదయ భావాలకు రమ్యమైన శైలిని సమకూర్చడంలో తిలక్ కృతకృత్యుడయ్యాడన్నారు కుందుర్తి. కుందుర్తి వేసిన బాటలో చాలా మంది ప్రయాణించి తిలక్‌ని భావాభ్యుదయ కవి అనీ, మానవతావాద కవి అనీ అన్నారు. రాచమల్లు రామచంద్రారెడ్డి తిలక్ నెహ్రూ మీద రాసిన ఎలిజీలో తన లక్షణాలే నెహ్రూకు ఆపాదించినట్లు చెబుతూ తిలక్ ఏమరుపాటున అభ్యుదయం మాట్లాడినా అతను తనలో తానొక ఏకాంత సౌందర్యం రచించుకున్న స్వాప్నికుడని అన్నారు. అయితే వీళ్లందరూ తిలక్ సమకాలికులు. తిలక్ కవిత్వం రాస్తున్న కాలంలో జీవించి, ఆయన మరణించిన కాలపు సమీప వర్తమానంలో స్పందించిన వాళ్లు. వీళ్లు తిలక్‌ను అంచనా కట్టే నాటికి తిలక్ మీద ఎవరెవరి ప్రభావాలు ఉన్నాయో గ్రహింపుకొచ్చే వీలుంది కానీ కాలం మీద తిలక్ చూపగల ప్రభావం వారి చర్చలో లేదు. తిలక్ మరణించిన అర్థశతాబ్దం తర్వాత వెనక్కి తిరిగి చూస్తే ఆయన నడచిన దారులు వేసిన బాటలు ఇప్పుడు తెలుగు కవిత్వానికి రహదారులయ్యాయని అర్థమౌతుంది. అప్పుడు నిరాదరణకు నిర్లక్ష్యానికి నిందకూ గురైన భావనలు కొన్ని ఇప్పుడు ఆదరింపబడి ఆమోదింపబడుతున్నాయని కూడా అర్థమౌతుంది. ఉదాహరణకు రా.రా. దుర్లక్షణంగా భావించిన ఏకాంత సౌందర్య రచన, స్వాప్నికతలు కవిత్వం కోల్పోవడానికి వీలులేని మౌలిక లక్షణాలని అంగీకారమైంది. రా.రా. తిలక్‌లో నిరసించిన ప్రబంధ కవిత్వ భాష కూడా కవి తన భాషాసామర్థ్యం కోసం అధ్యయనం చేయాల్సిన అంశమే అయ్యింది. మొత్తం మీద కొంచెం తెరిపార చూస్తే తెలుగు కవిత్వం మీద ఇప్పుడు శ్రీశ్రీ కాలం నాటి ఏకైక సిద్ధాంత ప్రభావం కన్నా తిలక్‌లోని బహుళ తాత్విత ఛాయలే ఒకింత ఎక్కువ ఉన్నట్టనిపిస్తుంది.

తిలక్‌లో బహుళతాత్విక ఛాయల్ని గుర్తించడంతో పాటు శ్రీశ్రీ యుగం విస్మరించిన కొన్ని సార్వత్రిక భావనల్ని తిలక్ కవిత్వీకరించడం వల్ల ఆయన ఇప్పుడు మరింత relevantగా ఉన్నాడని చెప్పడం ఈ వ్యాసం ఉద్దేశ్యం.

ఇంతా చేస్తే శ్రీశ్రీ కన్నా తిలక్ పదకొండేళ్లే చిన్నవాడు. శ్రీశ్రీ డెబ్బై మూడేళ్లు బతికి ముప్పై ఎనిమిదేళ్ల క్రితం మరణిస్తే తిలక్ నలభై ఐదేళ్లే బతికి యాభై ఐదేళ్ల క్రితం మరణించాడు. మరణంలో శ్రీశ్రీ కన్నా తిలక్ పెద్దవాడు. తిలక్ మరణించాక గడచిన కాలం కూడా జీవించిన కాలం కన్నా పెద్దది. మహాప్రస్థాన గీతాల్ని శ్రీశ్రీ మార్క్సిజం ప్రభావంతో రాసినా రాయకపోయినా అవి తెలుగు కవిత్వం మీద చూపిన ప్రభావం అపారం. శ్రీశ్రీ నిబద్ధుడు కాకముందు రాసిన సారవంతమైన కవిత్వం అతన్నీ తెలుగు కవిత్వాన్నీ 1970 దాకా నడిపిస్తే అక్కణ్ణుంచీ విప్లవ భావజాలమే అతన్నీ అతని కవిత్వాన్నీ నడిపించింది. తిలక్ 1966లో మరణించగా 1968లో అమృతం కురిసిన రాత్రి తొలి కూర్పు వచ్చింది. 1971లో సాహిత్య అకాడమి బహుమతి పొందింది. అది 1999 లోపు పది ముద్రణలు పొందింది. అంటే సగటున మూడేళ్లకొకటి. నిర్దిష్టమైన గణాంకాలు లేవు గానీ ఆ తర్వాత ఇంకా ఎక్కువ ముద్రణలే పొందింది. ఇది తిలక్ కవిత్వం పట్ల పెరుగుతున్న ఇష్టానికి ఒక కొలమానం.

శ్రీశ్రీ తిలక్‌ల వంటి ఇద్దరు ప్రతిభావంతుల ప్రభావాలను అంచనా వేస్తున్నప్పుడు వారి క్రొనాలజీని పరిగణనలోకి తీసుకోవాలి. తిలక్ కంటే ముందు తరానికి చెందిన శ్రీశ్రీ ప్రభావం తిలక్ మీద తిలక్ కాలపు కవిత్వం మీద ఉంది. అయితే తిలక్ శ్రీశ్రీ తరువాతి కాలానికి చెంది ప్రతిభావంతుడైన కవి అని గుర్తించినపుడు అతను కవిత్వం మీద చూపిన ప్రభావరీత్యా అతన్ని శ్రీశ్రీ కన్నా వెనుక ఉంచడమో తక్కువ చెయ్యడమో సరికాదు. శ్రీశ్రీ ప్రభావంతో ఆయనలాగే కవిత్వం రాసిన వాళ్లు ఒక్కరు కూడా మిగలకుండా కొట్టుకుపోయారు. తిలక్ మిగిలాడు. శ్రీశ్రీ విప్లవమార్గం పట్టినపుడు దాని మీద ఆయన కవిత్వ ప్రభావం స్వల్పం. తిలక్‌ను చూస్తున్న కోణంలోంచే ఆయన తరవాత కాలానికి చెందిన చెరబండరాజునూ, శివసాగర్ చూసినపుడు విప్లవ కవిత్వం మీద శ్రీశ్రీ ప్రభావం కన్నా వీరిద్దరి ప్రభావమే ఎక్కువని అర్థమౌతుంది. కాబట్టి 1930లలో ప్రారంభమైన శ్రీశ్రీ శతాబ్దం 1980కి ముగిసింది.

తెలుగు కవిత్వంలో 1960 తర్వాత కవులుగా నిలదొక్కున్న అజంతా, బైరాగి, ఇస్మాయిల్, వేగుంట మొదలుకొని అస్తిత్వవాద కవుల దాకా అందరూ శ్రీశ్రీ ప్రభావం నుంచి బయటపడో లేదా లేకుండానేనో నిలదొక్కుకున్నవాళ్లే. అందులో మొదటివాడు తిలక్. తిలక్ ప్రభావం ప్రధానంగా శ్రీశ్రీ కాలం నాటి పరిమిత వస్తు దృష్టి నుంచి కవిత్వాన్ని విముక్తం చెయ్యడంలో దానికి విస్తృతి నివ్వడంలో ఉంది. అంటే తిలక్ బహుళతాత్వికతలో ఉంది. అది ఇట్లా సాగింది. తిలక్ కవిత్వంలో అగాథ బాధాపాథః పతంగాలతో పాటు గాజు కెరటాల వెన్నెల సముద్రాలూ, త్యాగశక్తి, ప్రేమరక్తి, శాంతిసూక్తి ఉన్నాయి. చీకటి నవ్విన చిన్ని వెలుతురుంది. అప్పుడు ఆల్ఫ్ మీద మంచు దుఃఖంలా కరిగింది. వెన్నెల బిందువు కొబ్బరిమొవ్వులోకి వినపడీ వినపడని చప్పుడుతో జారిపడింది. నీరంధ్ర వర్షాన వంతెన కింద నిండు చూలాలు ప్రసవించి మూర్ఛిల్లింది. గొంగళీపురుగులు సగంసగం తిన్న కలల్ని నెమరేస్తో బజ్జున్నాయి. ఏకాకి నౌక నిర్లిప్తంగా తీరం వదలి సముద్రంలోకి వెళిపోయింది. సూర్యుణ్ణి తల మీద పువ్వుగా ధరించింది వసుధైక గీతం. దీపాల మధ్య చీకటి దివ్యంగా మెరిసిపోయింది. గజానికొక గాంధారి కొడుకు పుట్టాడు. జీవితపు ప్రిజం వేర్వేరు కోణాల్ని ప్రతిబింబించింది. సువర్ణం కన్నా అగ్రవర్ణం లేదని అందరూ అంగీకరించారు. పంచశీలలో చైనా అనే సీల ఊడిపోయింది. మతావేశం పొదుగుకున్న జాతి కోతి అయ్యింది. రహస్య సృష్టి సానువుల నుండి కాంతి జలపాతం జారిపడింది. అంతరాంతర జ్యోతిస్సీమలు బహిర్గతమయ్యాయి. ఇంటికున్న కిటికీలన్నీ తెరుచుకున్నాయి. ఆమె లేకపోయినా ఇంటి ముందు జూకామల్లె తీగలో అల్లుకున్న ఆమె పాట మిగిలి ఉంది. వైవిధ్య భరితమైన ఈ తీరే తిలక్ బహుళత్వపు మూలం.

తెలుగులో 1980 తర్వాత వచ్చిన కవిత్వం శ్రీశ్రీని దాటి కొత్త పుంతలు తొక్కినపుడు అందులో ఎక్కువ ప్రతిఫలించింది తిలక్ ఈ భావనలే ! అంతకు ముందే అనుభూతి కవిత్వం పేరిట ప్రారంభమైన స్వచ్ఛ కవిత్వంలో తిలక్ నీడలు ఉన్నాయి. ఆ తర్వాత వచ్చిన అస్తిత్వవాద కవిత్వాలు మార్క్సిస్టు సిద్ధాంతంతో విభేదించడంలో ‘ కాదు ధనిక వాదం, సామ్యవాదం’ అన్న తిలక్ మార్గం ఉంది. 1980 తర్వాత కలంపట్టిన కవులు ప్రధానంగా స్త్రీవాద, దళిత, మైనారిటీ, ప్రాంతీయవాద కవిత్వాన్నే రాసినప్పటికీ వారంతా ఆ సైద్ధాంతిక చట్రానికి పరిమితం కాకుండా విస్తారమైన జీవనానుభవాన్ని కవిత్వం చెయ్యడంలో తిలక్ ఉన్నాడు. ఇవాళ తెలుగులో ఏ వాదానికి చెందిన కవి అయినా ఎంతో కొంత అంతర్ముఖుడు కాగలుగుతున్నాడంటే, , తన భావజాలానికి వెలుపల రాయడానికి వెరవడం లేదంటే అది తిలక్ ఇచ్చిన ధైర్యమే ! గురజాడ తర్వాత శ్రీశ్రీ కవిత్వాన్ని

ప్రజాస్వామికం చేశాడనడం నిజం. అది అత్యధిక సంఖ్యలో ఉన్న పేదవాళ్లని చేర్చడంతో వచ్చిన ప్రజాస్వామ్యం. తిలక్ ఆ వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తూనే కవిత్వంలో వేర్వేరు మానవానుభవాలకూ, భావ ధారలకూ, సిద్ధాంతాలకు చోటు కల్పించడం ద్వారా బహుళ తత్వం కలిగిన ప్రజాస్వామ్యానికి పాదులు వేశాడు.

తిలక్ కలం నుంచి వచ్చిన తొలి కవితాపంక్తి అనదగ్గ 'నా కవిత్వం కాదొక తత్వం'లోనే బహుళత్వానికి పునాది పడింది. శ్రీశ్రీ ప్రభావానికి లోనై అభ్యుదయ కవిత్వం రాస్తున్న కాలంలోనే

'భారతదేశాన్ని కాదనలేను
రష్యా దేశాన్ని కొలవలేను
నిజం ఎక్కడో అక్కడ నా ప్రాణం ఉంది
హృదయం ఎక్కడో అక్కడ ఉదయం ఉంది' అన్నాడు.

'ఒక సత్యంతో మరో సత్యాన్ని ఖూనీ చెయ్యకు
పరదేశస్తుతిలో స్వకీయ సంస్కృతి విస్మరించకు
ఇంకా కరిగి నీరైపోలేదు హిమాలయ శిఖరాలు
ఇంకా మరచిపోలేదు మహాత్ముని ప్రవచనాలు
సమ్యక్ సమ్మేళనం లేని తౌర్యత్రికం కఠోరమౌతుంది
కరుణ లేని కవివాక్కు సంకుచితమౌతుంది'

తిలక్ బహుళతాత్వికతను చాలా వరకు ప్రతిబింబిస్తున్న వాక్యాలివి. రష్యాను వ్యతిరేకించడం, మేధలో కాక హృదయంలో ఉదయం ఉందనడం, పరమ సత్యం సాపేక్షం అనడం, తను పుట్టిన సంస్కృతిలోనూ, దాని పథనిర్దేశకులైన బుద్ధుడు, గాంధీలలో విశ్వాసం ఉంచడం, సమ్యక్ సమ్మేళనమే సులభమార్గం అనడం తిలక్‌మార్గాన్ని స్పష్టం చెస్తున్నాయి. ఇక ఆఖరుగా కరుణను కవిత్వానికి అంతిమ లక్ష్యంగా చెయ్యడంతో అన్ని రకాల హింసను విధ్వంసాలనూ కవిత్వం ఆవరణ నుంచి నెట్టివేశాడు తిలక్.

సంస్కృతిని అంగీకరించడం తిరోగమనం కాదన్నాడు తిలక్. సందర్భం వచ్చినపుడల్లా విశ్వనాథను ఖండించాడు.

'వెలుగును వెనక్కు నెట్టుతూ రేపటి రోజుకి
పదివేల సంవత్సరాలనాటి పాతముఖాన్ని అతికించేందుకు
ఒక 'హాహా హూహూవూ' ప్రయత్నిస్తోన్న ప్రాతః కాలాన'
అనీ

'విశ్వనాథ వారు వెనక్కి వెనక్కి నడవగా
వేదకాలం యింకా వెనక్కివెనక్కి పోయిందట' అనీ

....మూలమూల ముడుచుకు కూర్చున్నదాన్ని
మనువుచేసుకోవాలన్న ఉబలాటంతో
మంచీ చెడ్డా మరచిపోయాడు
మర్యాదల్ని అతిక్రమించాడు
మరి పనికిరాడు' అనీ

అనేశాడు. అంటే తిలక్ చూసిన దేశీయ సంస్కృతి విశ్వనాథ నిలబెట్టాలనుకున్న సంస్కృతి వేర్వేరని స్పష్టమైంది.

రష్యాను వ్యతిరేకించిన తిలక్ నెహ్రూ మరణిస్తే విచలితుడయ్యాడు.

'చారిత్రక దృక్పథం అతని శక్తి, సమ్యక్ సిద్ధాంత రథ్యమీద రథాన్ని నడిపిస్తాడు' అనడానికి ముందు భూత భవిష్యత్ వర్తమానాలను ముడివేసే అతని నాయకత్వాన్ని శ్లాఘించాడు. నెహ్రూను అభిమానించడం ప్రజాస్వామిక సామ్యవాదాన్ని అభిమానించడమే కదా !

ఇక సత్యసౌందర్యాన్వేషణలో తిలక్ చేసిన శిఖరారోహణ షేక్స్‌పియర్, డాంటే, కాళిదాసూ, శంకరుడూ, మార్క్స్, మహాత్ముడు, బుద్ధుడు, పికాసో, సార్త్రేల మీదుగా సాగింది. బహుళ తాత్వికతకు ఇది పరాకాష్ఠ. తిలక్ మార్గంలో 'మురికి కాల్వమీద ముసలితనం మీద మృషాజగతి మీద మహోదయం వికసించదు వసంత హసించదు'

తిలక్ గణంలో

'సంప్రదాయ భీరువుకి అస్వతంత్ర వితంతువుకీ వసంతం లేదు. సాహసి కానివాడు జీవన సమరానికీ స్వర్గానికీ పనికిరాడు.'

తిలక్ యుద్ధం, కరువు వంటి సార్వకాలిక సమస్యలను విస్మరించలేదు. తన సమకాలీన కవుల కంటేనే కాదు, తన కంటే ముందు కాలపు కవుల కంటే కూడా ఎక్కువ యుద్ధ వ్యతిరేక కవిత్వం రాశాడు. కారణాలకూ అవసరాలకూ అతీతంగా యుద్ధాన్ని అనాగరిక సంభవంగా గుర్తించాడు తిలక్. ఎందుకు జరిగింది యుద్ధం అనే ప్రశ్న కన్నా ఏం చేసింది యుద్ధం అనే పర్యవసానాన్ని కవిత్వీకరించాడు. సైనికుడి ఉత్తరం, వెళ్లిపొండి వెళ్లిపొండి, అమ్మా నాన్నెక్కడికెళ్లాడు కవితలు యుద్ధప్రకటన చెయ్యబోయే ప్రతి దేశాధినేత చదవాల్సినవి.

'శాంతి కోసం యుద్ధాన్ని ప్రజ్వలింప జేస్తారు
సుఖం కోసం ఆ రక్త విప్లవాన్ని తరింప చేస్తారు
శ్మశానభూమిని వికసిస్తుంది మీరు నాటిన పూలచెట్టు
కానీ ఎవరు తుడుస్తారు తల్లీ నీ కన్నీటిబొట్టు'

అన్నాడు తిలక్. 'ఒక సత్యంతో వేరొక సత్యాన్ని' అంతమొందించడాన్ని నిరసించిన తిలక్ శాంతిని వెదుక్కుంటూ

శాశ్వత 'ప్రకటన' జారీ చేశాడు. ఇక నుంచైనా చైనా బుద్ధిగా నడుచుకోవాలని చెప్పిన తిలక్‌నూ, చైనా పాకిస్తాన్‌ల మైత్రిని పాముా తోడేలు స్నేహంతో పోల్చిన తిలక్‌నూ మనం మళ్లీ చదువుకోవాలి. కరోనా ముందు వరకూ యుద్ధానికి ఉవ్విళ్లూరిన మన ప్రభుత్వాలకు తిలక్ కవిత్వం హెచ్చరిక. రకరకాల సిద్ధాంతాలు ప్రవచించిన సంఘర్షణల గురించి కన్నా తిలక్ యుద్ధం లాంటి శాశ్వత ఉపద్రవాల గురించి మాట్లాడాడు. యుద్ధ ప్రమాదం తిలక్ కవిత్వాన్ని సజీవం చేస్తూ ఉంటుంది. ఇప్పుడది సజీవంగానే ఉంది.

'భూలోకం' పేరుతో తిలక్ 1940 ల బెంగాల్ క్షామంలో మానవ హననం గురించి రాస్తే ఇప్పటి కరోన తాండవం కళ్లకు కడుతుంది.

దారిపొడుగు జనశవాలు
జారిపడే చేయికాలు
ఏ లోకం తల్లీ
కనిపించదు అబ్బీ – యిట
తెరలోపలి కాలనేమి
మృతువనే మైదానం
శత్రువనే అజ్ఞానం
ఇది యుద్ధం అబ్బీ –ఇపు
డింట యింట ఆక్రోశం.... అంటాడు.

'వంగదేశ క్షామం ఇది
పరప్రభుత్వ దానం ఇది' అని తిలక్ బ్రిటీష్ ప్రభుత్వాన్ని ఉద్దేశించి రాస్తే

కరోనా కళ్లముందు కనిపించి
'మన ప్రభుత్వ దానం ఇది' అని మాత్రమే చదువుకుంటాం.
'కనిపించదు అబ్బీ – యిట
తెరలోపలి కాలనేమి'

అన్న తిలక్ వాక్యాలు పదేపదే వెంటాడి రకరకాల అర్థాలను స్ఫురింపజేస్తాయి.

అంతేనా,

'ఏ దేశసంస్కృతి అయినా ఏనాడూ కాదొక స్థిరబిందువు
నైక నదీనదాలు అదృశ్యంగా కలసిన అంతస్సింధువు'

అన్న తిలక్ ఇవాల్టి సాంస్కృతిక జాతీయవాదాన్ని కూడా పూర్వ పక్షం చేశాడు. ఈ కవితను ఆయన ఎత్తుకున్న 'మన సంస్కృతి నశించిపోతుందని' విచారపడిన సందర్భమే విస్తరించి మెజారిటీ సాంస్కృతిక వాదంగా పరిణమించింది.

'ఎటొచ్చీ విధవలకీ వ్యాకరణానికీ మనుస్మృతికీ గౌరవం లేదని వీరికి దిగులు

అందరూ లోకంలో శప్తులూ పాపులూ
మనం మాత్రం భగవదంశ సంభూతులమని వీరి నమ్మిక
సూర్యుడూ చంద్రుడూ దేవతలూ దేవుళ్లూ
కేవలం వీరికే తమ వోటిచ్చినట్లు వీరి అహమిక'

అన్న తిలక్ 'ఇది జాతికీ ప్రగతికీ కనబడని విపత్తు' అని అప్పుడే ప్రకటించాడు. ఆ విపత్తు ఇప్పుడు రానే వచ్చింది.

రెండు మూడు దశాబ్దాల క్రితం పూల కుర్రాడు, గూర్ఖా, ఐస్‌పార్లర్‌లో బాలకార్మికుడు, ఉప్పుబండి లాగేవాడు మొదలైన వృత్తులూ పనులూ చేసుకునే వారి మీద పుంఖానుపుంఖంగా కవిత్వం వచ్చినపుడు అందరి దృష్టి ఒక్కసారి తిలక్ రాసిన 'తపాల బంట్రోతు' మీదకు మళ్లింది. తీరా చూస్తే దాదాపు అన్ని కవితల్లోనూ

'ఇన్ని ఇళ్లు తిరిగినా
నీ గుండె బరువు దింపుకోవడానికి ఒక్క గడప లేదు
ఇన్ని కళ్లు పిలిచినా
ఒక్క నయనం నీ కోటు దాటి లోపలకు చూడదు'

అన్న తిలక్ భావ సారమే వేర్వేరు రూపాల్లో ఆయా కవితల్లో ప్రతిఫలించినట్లు స్పష్టమైంది. ఈ సందర్భంగా 1980 తర్వాత కవులుగా నిలదొక్కుకున్న వారిలో చాలామంది అమృతం కురిసిన రాత్రిని మేం ఇష్టంగా చదువుకున్నాం' అని చెప్పడం గుర్తుకు తెచ్చుకోవచ్చు.

'హార్లెంస్‌లో శవం' కవితను తిలక్ ఏడాది క్రితం రాసినట్టుంటుంది. జార్జి ఫ్లాయిడ్ మెడ మీద మోకాలు పెట్టి ప్రాణం పోయేదాకా తొక్కిపెట్టిన అమెరికన్ జాత్యహంకారం అంతకు ముందు అనేక సార్లు సుడులు విచ్చిందని మనకు తెలుసు. 1964 జులైలో హార్లెంస్ నగరంలో బలైన జార్జి ఫ్లాయిడ్ పేరు జేంస్ పోవెల్. తొమ్మిదో తరగతి చదువుతున్న పదిహేను సంవత్సరాల కుర్రాడు. ఆడుకుంటున్న చోట తనకే మాత్రం సంబంధం లేకుండా ప్రారంభమైన జాతి వివక్ష గొడవలోకి చొరవగా ప్రవేశించి ఒక్కడుగా దూసుకెళ్లడానికి ప్రయత్నిస్తూ న్నపుడు, కేవలం చిన్న హెచ్చరికతో నిలువరించబడే అవకాశం పుష్కలంగా ఉన్న చోట థామస్ గిల్లిగన్ అనే పోలీస్ అధికారిచే నిర్దాక్షిణ్యంగా కాల్చివేయబడ్డాడు. ఫలితంగా న్యూయార్క్ నగరంతో సహా చుట్టుప్రక్క ప్రాంతాలను అతలాకుతలం చేసిన ఉద్యమం

నడిచింది. తెలుగు కవులెవరైనా దీన్ని పట్టించుకున్నారో లేదో గానీ తిలక్ దృష్టి నుంచి ఇది తప్పించుకోలేదు.

'తన రంగు నలుపైనందుకు
తన అభిమానాన్ని చంపుకోనందుకు
తన పౌరుషం చూపించినందుకు
తనూ మనిషినేనని నిలబడినందుకు'
అహంకృతితో ఎక్కుపెట్టిన తుపాకీ దెబ్బకు
కూలిపోయాడన్నాడు
'బ్రతికిన పోవెల్ భాష తెలియని వాడా
చచ్చిన వాని శవం పలకరిస్తే వినలేవా'
అని ప్రశ్నించాడు
'దేశదేశాల మనుషుల్లారా
చచ్చిన పోవెల్ మీ తమ్ముడు, మీ మేనల్లుడు,
మీ లోపలి మానవుడు'.... అని అంటూ
'ప్రతి ఒకడూ దీనికి బాధ్యుడు
చరిత్ర పగనెవడూ తప్పించుకోలేడు'

అంటూ గొప్ప భవిష్యదర్శనంతో ముగించాడు. తిలక్ ఆర్థిక అసమానతల వెల్లువలో పడి సామాజిక అసమానతల్ని విస్మరించలేదు.

మార్క్స్‌నీ మహాత్ముణ్ణీ, బుద్ధుణ్ణీ శంకరుణ్ణీ, అంగీకరించిన తిలక్‌లో సమన్వయ దృక్పథం ఉంది. విశ్వతత్వం ఉంది. మనిషి మౌలికత మీద తాత్విక దృక్పథం ఉంది. ప్రేమ, కరుణ వంటి మానవీయ గుణాల మీద నమ్మకం ఉంది. సమత్వం కోసం ఆరాటం ఉంది. అహింసను వదులుకోలేని నాగరికత ఉంది. పుట్టిన దేశాన్నీ సంస్కృతినీ వదుకోలేని బెంగ ఉంది. మనుస్మృతి మీద వ్యతిరేకత ఉంది. గతంతో అనుసంధానమై ఉన్న అవిచ్ఛిన్నత ఉంది. అన్ని రకాల భావజాలాల వైపరీత్యాల మీద, మానసిక జాఢ్యాల మీద నిరసన ఉంది. తెలుగులో ఇప్పుడిప్పుడే సంతరించు కుంటున్న బహుళతాత్విక దృక్పథ మూలాలు తిలక్‌లో ఉన్నాయి. యుద్ధభయం, సామూహిక మరణాలు, సాంస్కృతిక జాతీయ వాదం, జాతివివక్ష ఆయన్ని సమకాలీనం చేస్తున్నాయి. ❑

(కవిసంధ్య 28 మార్చి 2021 న నిర్వహించిన తిలక్ శత జయంతి అంతర్జాల సదస్సులో చేసిన కీలకోపన్యాస ప్రసంగ పాఠం)

## తాలిబాన్‌తో భారత్ ఎట్లా వ్యవహరించాలి ?

**(5వ పేజీ తరువాయి)**

పరిస్థితి అఫ్ఘానిస్తాన్‌లో లేదు. సైగాన్ నుంచి నిష్క్రమించినప్పటి కంటే అవమానకరమైన పరిస్థితిలో అమెరికా కాబూల్ నుంచి బయటపడింది. నిష్క్రమణ తేదీలను మార్చడానికి అమెరికా అధ్యక్షుడు బైడెన్ సిద్ధంగా లేరు. పైగా అమెరికా సేనలను ఉపసంహరించుకోవడం సరైన చర్యేననీ, అఫ్ఘాన్ సైన్యం పోరాడ లేదనీ, తమకున్న పోరాట పటిమను ప్రదర్శించకుండానే లొంగిపోయారనీ, తప్పు తమది కాదనీ బైడెన్ మంగళవారంనాడు జాతిని ఉద్దేశించి చేసిన ప్రసంగంలో సమర్థించుకున్నారు. 1990లలో రష్యా కాబూల్ నుంచి ఉపసంహరించుకున్నప్పటి కంటే అన్యాయంగా, అసమర్థంగా, గందరగోళంగా అమెరికా ఉపసంహరించుకున్నది. తాలిబాన్ కాబూల్ చేరుకోవడానికి కొన్ని వారాలు పదుతుందని అమెరికా గూఢచర్య సంస్థలూ, బ్రిటిష్ ఇంటెలిజెన్స్ సంస్థలూ, భారత వేగులూ నిర్ధారించడంలో ఎక్కడో ఏదో పెద్ద లోపం జరిగింది. అఫ్ఘాన్ ప్రజల అంతరంగాన్ని తెలుసుకోవడంలో అందరూ విఫలమైనారు.

## మొన్నటి వరకూ అమెరికా ఆక్రమణలోనే అఫ్ఘానిస్తాన్

అఫ్ఘానిస్తాన్‌ను ఆక్రమించిన దేశంగానే అమెరికా మిగిలిపోయింది. అమెరికా సేనలు ఉన్నంత వరకూ అమెరికాను అభిమానిస్తున్నట్టే అఫ్ఘాన్ ప్రజలు కనిపించారు. కానీ వాస్తవంగా అమెరికా అయినా, రష్యా అయినా, బ్రిటన్ అయినా తమ భూభాగం ఆక్రమించి, అక్కడ తిష్ఠవేసి, తమను పరిపాలిస్తామంటే అఫ్ఘాన్‌లు అంగీకరించరు. వారికి ఆత్మగౌరవం ఎక్కువ. పేదరికం ఉండవచ్చు. అనేక సమస్యలు సతమతం చేస్తూ ఉండవచ్చు. కానీ విదేశీ జోక్యాన్ని మాత్రం వారు అంగీకరించరు. వారి నైజం తెలియకుండా అమెరికా ఇరవై ఏళ్ళు అక్కడ కాలయాపన చేసింది. నిధులు ఖర్చు చేసింది. ఎంత చేసినా అమెరికన్ల కంటే తాలిబాన్‌నే అఫ్ఘాన్‌లు ఆమోదిస్తారని ఇటీవలి పరిణామాలు చాటి చెబుతున్నాయి. అందుకే అఫ్ఘానిస్తాన్‌ను పదిహేను రోజులలోనే తాలిబాన్ గెలుచుకోగలిగారు. అమెరికా శిక్షణ ఇచ్చి ఆయుధాలు సమకూర్చిన అఫ్ఘాన్ సైన్యం కూడా తాలిబాన్‌లో కలిసిపోయింది కానీ తాలిబాన్‌తో తలబడి అమీతుమీ తేల్చుకోవడానికి సిద్ధపడ లేదు. అఫ్ఘాన్ ప్రజల మనస్తత్వాన్ని సవ్యంగా అర్థం చేసుకోవడంలో అన్ని దేశాలూ విఫలమైనాయని చెప్పుకోవాలి. ❑



# ఆయన అభ్యుదయ - అనుభూతివాదా ?

**మందలపర్తి కిషోర్**

"నా అక్షరాలు వెన్నెలలో ఆడుకునే ఆడపిల్లలు అన్న కవి అనుభూతివాది కాక మరేమవుతాడు? నా అక్షరాలు ప్రజా శక్తుల వహించే విజయ ఐరావతాలు అన్న కవి అభ్యుదయవాది కాక మరేమవుతాడు? ఈ రెండు మాటలూ అన్న కవి ఒక్కరే అయితే, అతగాడు అభ్యుదయ అనుభూతివాది కాక ఇంకేమవుతాడు??

దేవరకొండ బాలగంగాధర తిలక్ ఇరవయ్యేళ్ళ వయసులో, 1941లో రాసిన ఓ కవితను కోట్ చేస్తూ - ఇలా అడిగేవాళ్ళు నలభయ్యాభై ఏళ్ళ కిందట చాలా మంది వుండేవారు. అప్పట్లోనే, ఇలియట్ నుంచి ఇస్మాయిల్ వరకూ ఆంధ్రాంగ్ల సౌందర్య వాదులను ఎడాపెడా కోట్ చేస్తూ, శ్రీకాంత శర్మ - గోదావరిశర్మ తదితరులు కొందరు "అనుభూతివాదం" అధికార ప్రతినిధులుగా వ్యవహరించేవారు. అభ్యుదయ-విప్లవవాదులు సరేసరి, వీధివీధినా ఉండేవారు! ఆ రోజుల్లో చురుగ్గా పనిచేస్తూండిన అభ్యుదయ విప్లవ రచయితల సంఘాలమీద కంటెంప్ట్‌తో వాళ్ళందరినీ కట్టగట్టి ''సామాజిక స్పృహాగాళ్ళు''గా తీసి పారేశారు. ఈ అనుభూతివాదులు. "పువ్వు మీద వాలే తేనెటీగని నేను- పుండు మీద వాలే ఈగవు నువ్వు" అంటూ సామాజిక స్పృహ ఉన్న వాళ్ళకీ తమకూ పొసగదని రాశారు అనుభూతివాదులు. అలంకారాల అత్తరు పులి మినపట్టు చొక్కాల్లాంటి వాళ్ళ కవితలూ వ్యాసాలూ ఉపన్యాసాలు సైతం, ఏ సామాజిక స్పృహ లేనట్టయితే, పాఠకులదాకా చేరలేవనే స్పృహ వారికి లేదు. అలా ఒంటి మీద స్పృహే లేని అనుభూతి వాదుల వ్యాఖ్యల్ని, సామాజిక స్పృహ పుష్కలంగా ఉన్నవాళ్లు సహజంగానే పెద్దగా పట్టించుకోలేదు. కారణమేదయినా, అనుభూతివాదం, పాపం గట్టిగా పదేళ్ళ కాలం కూడా బతికి బట్టకట్టలేక పోయింది! దానిమాటెలా వున్నా, ఈ ఈగ తేనెటీగ సిద్ధాంతం ప్రచారంలోకి వచ్చాకా తిలక్‌ని "అనుభూతివాదిగా అపార్థం చేసుకోవడం మాత్రం తగ్గింది! ఎందుకంటే, ఆయన పాతికేళ్ళ పాటు రాసిన కవిత్వం చూస్తే ఓ క్షణం ఈగగానూ, మరుక్షణం తేనెటీగగానూ కనిపించడం అందరి అనుభవం. ఇక "తిలక్ కథలు" చదివితే - ముఖ్యంగా "దేవుణ్ణి చూసిన వాడు", "దొంగ" లాంటి కథానికలూ, "నల్లజర్ల రోడ్డు" లాంటి పెద్ద కథలూ చూస్తే- ఆయన మౌలికంగా ఈగేనేమో అనే అనుమానం రాకుండా వుండదు!

ఇంతకు ముందు చాలాసార్లు అనుకున్నట్లుగా, 1920 దశకంలో పుట్టి-1940 దశకంలో వికసించిన రచయితల తరం నిజానికి ఓ అసామాన్య తరం! భావ కవిత్వం సామాన్య పాఠకుల మెదళ్ళ మొదళ్ళలో పాదుకోవడాన్ని ఈ తరం కళ్ళారా చూసింది. రెండు ప్రపంచయుద్ధాలనూ, ఆర్థికమాంద్యాన్నీ, స్వాతంత్ర్య సమరంగా రూపుదిద్దుకున్న జాతీయ పోరాటాన్నీ, సమాజంలోని అన్ని వర్గాలకూ ఆమోదయోగ్యులనిపించిన "మహా పురుషుల"నూ, సంపాదకీయాల్లో నిప్పులు కక్కిన పాపానికి నడిరోడ్ల మీద పోలీసుల చేతుల్లో చావుదెబ్బలు తిన్న సంపాదకులనూ, అప్పుడప్పుడే యూరప్‌లో విచ్చుకుంటున్న విచ్చుకత్తులను వేడిగా వాడిగా దిగుమతి చేసే పత్రికలనూ చూసిన తరమది. అంతగా, 360 డిగ్రీల పరిధిలో, జీవితాన్ని దర్శించగలిగే అవకాశం అన్ని తరాలకూ, అస్తమానం దక్కదు! ఆ తరంలో ఈ ప్రత్యేక సౌకర్యాన్ని సంపూర్ణంగా విని యోగించుకున్న రచయితలూ వున్నారు. తమకు తాము అయోమయంలో పడి, ఇతరుల్ని గందరగోళ పెట్టినవాళ్ళూ వున్నారు. ఇంగ్లీష్‌లో 'మెథడ్ ఇన్ మ్యాడ్నెస్' అనే ఆలంకారిక ప్రయోగం ఒకటుంది- దానికి దగ్గరగా వుండే రీతిలో అనేక చారిత్రక సందర్భాల్లో పీతనడకలు నడిచినా, చివరికి దారిలోకి వచ్చినవాళ్ళూ వున్నారు. తిలక్ మాత్రం, భావకవిత్వం వారసుడిగా అభ్యుదయ సాహిత్యంలోకి అడుగుపెట్టినవాడు ఎలా ప్రవర్తించాలో అచ్చం అలాగే వ్యవహరించారు. కవిత్వంలోనయినా, హెచ్చు తగ్గులు కనబడవచ్చు కానీ, 'తిలక్ కథలు' ఆయన స్పష్టతకి కాగడాపడతాయనేది అందరికీ తెలిసిన విషయమే! తిలక్‌ను కవిగానూ-కథకుడిగానూ ముక్కలుగా కత్తిరించి విశ్లేషించడం భావ్యమూ కాదు- న్యాయమూ కాదు! "మణిప్రవాళం" కథలో కవిత్వం పొంగి పొర్లినట్టే, "అదృష్టాధ్వగమనం", "తపాలా బంట్రోతు"లాంటి కవితల్లో కథాత్మకత కవాడా నిండి వుంది. అవీ-ఇవీ రాసిన రచయిత ఒకరేననే విషయం గుర్తుంచుకుంటే, అందులో ఆశ్చర్యపోవలసిందేమీ లేదని బోధపడుతుంది. (అధ్యయన సౌలభ్యం కోసం, కథల్ని కాసేపు అలా పెడదాం! పైపెచ్చు, తిలక్ వీరాభిమానుల్లో కవిత్వాభిమానులదే ఆధిక్యం

అని నాదో నమ్మకం!) "భారతదేశాన్ని కాదనలేను, రష్యాదేశాన్ని కొలవలే" నని 1955లో అన్న కవి గారే, "నా దేశాన్ని గూర్చి పాడలేను, నీ ఆదేశాన్ని మన్నించలే"నని కూడా మరుసటి సంవత్సరమే అన్నాడు మరి! ముందన్నదే 'కవివాక్కు కానీ, తర్వాతి 'ఆర్తగీతం' కవివాక్కు కాదనడంలో అర్థమెలాగూ లేదు– కనీసం తర్కమయినా ఉన్నట్టుగా కనిపించాలిగా!

తిలక్ కవిత్వం గురించి మాటాడిన వాళ్ళందరూ తప్పకుండా ప్రస్తావించే విషయాలు రెండున్నాయి. మొదటిది శైలీ సౌకుమార్యం కాగా రెండోది తీవ్రమయిన భావావేశం. వాటిని చూసి ఆయన్ని "అనుభూతివాది"గా పొరబడినవాళ్ళలో కొందరు అభ్యుదయ సాహితీ విమర్శకులు కూడా వుండడం దురదృష్టకరం. ఇక్కడ మనం చెప్పుకున్న రెండు లక్షణాలూ కవిత్వాన్ని సుసంపన్నం చేసే సాహిత్య ద్రవ్యాలే. అభ్యుదయ కవిత్వమయినా, అభివృద్ధి నిరోధక కవిత్వమయినా బాగా రాయగలిగే వాళ్ళ కవిత్వంలో ఈ రెండు లక్షణాలూ కనిపించి తీరుతాయి. వాటిని చూసి ఫలానా కవి ఫలానా వాదానికి చెందినవాడని నిర్ధరించడం కన్నా భావ దారిద్ర్యాన్ని ఊహించలేం! తిలక్ కన్నా దాదాపు నూరేళ్ళ ముందటి అమెరికన్ కవయిత్రి ఎమిలీ డికిన్సన్ భావప్రకటన రీతిలోని విశిష్టతను ఎందరో ప్రస్తావించారు. ఆమె రాసిన అనేక ఖండకావ్యాలకు ఆత్మకథాత్మకమయిన కోణం ఒకటుందంటారు. దాని మాట ఎలా వున్నా, డికిన్సన్ సున్నితమయిన భావప్రకటన రీతికి పండితులూ పాఠకులూ జోతలెత్తారు. అంతటి ఆదరణ తెలుగు పాఠకుల నుంచి అందుకున్న వాడు తిలక్ ఒక్కడేనేమో!

విశాలాంధ్ర ప్రచురణాలయం వేసిన "అమృతం కురిసిన రాత్రి" కవితా సంపుటి తిలక్‌ను మహాకవిగా సుప్రతిష్ఠించింది. ఆ పుస్తకంలోని ముప్పాతికకు మించిన కవితల్లోనూ రకరకాలు లేకపోలేదు– "న్యూ సిలబస్" లాంటివి కవితల్లా కనిపిస్తాయి కానీ, నిజానికవి టూకీగా చేసిన సంపాదకీయ వ్యాఖ్యలు మాత్రమే. ఇక, ఈ సంపుటిలో పదో పరకో అసంపూర్ణ, అముద్రిత రచనలు – సంఖ్యాబలాన్ని మాత్రమే పెంచగలిగినవి కూడా కనిపిస్తాయి. తిలక్ చేసిన ప్రయోగాల్లో వచనగేయం ప్రాశస్త్యం గురించి 1968లోనే కుందుర్తి ప్రముఖంగా ప్రస్తావించారు. వృత్తాలు, గేయాలు రాసినప్పటికీ, తిలక్ వచన కవిత ప్రక్రియలోనే ప్రావీణ్యం ప్రదర్శించారు. ఆయన సమకాలికుల్లో పెద్దలూ పిన్నల్లో ఏ ఒక్కరూ – ఈ ప్రక్రియ విషయంలో తిలక్‌కు సరిసాటి అనిపించుకోలేకపోయారనేది వాస్తవం. బతికింది నాలుగున్నర దశాబ్దాలు; సాహిత్య సేద్యం చేసింది పట్టుమని పాతికేళ్ళు! కవిగానూ, కథకుడిగానూ గత యాభయ్యేళ్ళుగా బతికేవున్న అమరుడు తిలక్! సంస్కృతం, తెలుగు, ఇంగ్లీష్ భాషలని క్లాసిక్‌ను మథించినందువల్లనే తిలక్ మాటకు అంతటి సాంద్రత సాధ్యమయిందనే మాట కొంత వరకూ నిజమే కానీ, అంతకు మించిన కారణాలు వేరే వున్నాయని గుర్తించాలి మనం ఇప్పటికైనా! కేవలం శైలి, ఆలంకారికత, అనుభూతి సౌకుమార్యం – వెరసి శిల్పం, అభ్యుదయ భావనాబలం కారణంగానే ఆయనకి ఈ అమృతత్వం సిద్ధించిందనుకోవడం అమాయకత్వం మాత్రమే! మారే కాలంతో పాటు మారగలిగిన సంస్కారం, అలా మారలేనివాళ్ళ పట్ల ధిక్కారం, మారినట్లు నటించే వాళ్ళ పట్ల వెటకారం – ఇవీ తిలక్‌ను అంతెత్తున కూర్చోపెట్టే లక్షణాలు. ఇవి ఇరవయ్యో శతాబ్దం నడిమధ్యకు చేరుతున్న దశలో సాహిత్య పరిణామ క్రమంలో భాగంగా రూపుదిద్దుకున్న విలువలు. ముఖ్యంగా, ఇరవయ్యో శతాబ్ది ఇరవై దశాబ్దిలో రాణించిన కవులందరిలోనూ ఈ విలువలు అంతో ఇంతో వున్నవే. తిలక్‌లో అవి పుష్కలంగా వున్నందు వల్లనే ఆయన తన తరానికి ప్రతినిధిగా అప్పటికీ, ఇప్పటికీ నిలబడి వున్నాడు! ❑

## మలాల : తాలిబన్లు కాల్చిన ఆ ఒక్క బుల్లెట్...

**(6వ పేజీ తరువాయి)**

"ఆగస్టు 9న ఆసుపత్రికి వెళ్లేందుకు బయల్దేరుతుంటే తాలిబన్ల వార్త తెలిసింది. కొద్ది రోజుల తర్వాత ఒక్కో ప్రావిన్స్ తాలిబన్ల వశమైందని తెలిసింది. నేను కోలుకోగానే మొదట చేసిన పని.. దేశాధినేతలు, మహిళా హక్కుల కార్యకర్తలకు ఫోన్ చేయడం.

బాలికా విద్యపై అతివాదులు నిషేధం విధించడానికి వ్యతిరేకంగా నేను పోరాడుతున్నానని తెలిసి నాపై తాలిబన్లు కాల్పులు జరిపారు. ఆనాడు ఆ ఘటనను పాకిస్థాన్ జర్నలిస్టులు, కొన్ని అంతర్జాతీయ మీడియా సంస్థలు నా గురించి తెలుసుకుని కథనాలు రాశాయి. వాటి వల్లే అంతర్జాతీయ సమాజం స్పందించింది. నాకు ఎంతో మంది అండగా నిలిచారు. వారి వల్లే నాకు విదేశాల్లో చికిత్స అందింది.

లేదంటే "15 ఏళ్ల బాలికపై కాల్పులు" హెడ్‌లైన్‌తో నా కథ స్థానికంగానే ముగిసేది. నేను బతికుండేదాన్నే కాదు. ఇప్పుడు అఫ్గాన్ పరిస్థితి కూడా అలాగే ఉంది. ముష్కరుల తుపాకీ గుండ్ల నుంచి వారిని కాపాడేందుకు అంతర్జాతీయ సమాజం కలిసి రావాలి" అంటూ మలాలా పోడియంలో రాసుకొచ్చారు. ❑



# నల్ల నేరేడు నేతల ప్రతాప్

**కొప్పర్తి వెంకట రమణమూర్తి**

ప్రతాప్ గురించి ఏమైనా రాయమని వాళ్లబ్బాయి సత్యాన్వేషి, ప్రతాప్ శిష్యుడు (నా శిష్యుడు కూడా) నవీన్ పది పదిహేను రోజులుగా అడుగుతున్నారు. ఆ మాటకొస్తే 'జాతీయ స్ఫూర్తి' గత సంచికలోనే నేను ప్రతాప్ మీద సంస్మరణ వ్యాసం రాయవలసి ఉంది. రాయలేదు. రాయడం నా వల్ల కాలేదు. ప్రతాప్ లేడనే సత్యం ఇంకా మింగుడుపడడం లేదు.

మాది పాతికేళ్ల స్నేహం. తొలి పరిచయం సరిగ్గా గుర్తులేదు కానీ, తను జర్నలిస్టుగా ఉన్నప్పుడు మొదలైందనుకుంటాను. తన 'పాల కంకి' (నానీలు) ఆవిష్కరణ సభలో నేను మాట్లాడ్డం నాకున్న మొదటి జ్ఞాపకం. అది తణుకు కోర్టు ఆవరణలో ఉన్న ఒక చిన్న హాలులో జరిగింది. అద్దేపల్లి రామమోహనరావు గారూ, నేనూ మాట్లాడాం. సోమేపల్లి వెంకట సుబ్బయ్య గారు కూడా వేదిక మీద ఉన్న గుర్తు. అది మొదలు మా స్నేహం నిరాటంకంగా సాగింది. ప్రతాప్ నా కంటే ఏడెనిమిదేళ్లు చిన్నవాడు. నేను తనను స్నేహితుడిగా సహచరుడిగా చూశాను కానీ, తను నన్ను గురువుగానే సంభావించాడు. తనకు నచ్చని సిద్ధాంతం పట్ల ఎంత ధిక్కారంతో ఉండేవాడో వ్యక్తిగా అంత వినయంగా ఉండేవాడు.

ఆ తర్వాత కొన్ని రోజులకు లైబ్రరీ దగ్గర ఒక మునిమాపు వేళ కలిసినపుడు మసక చీకట్లో ఒక కవిత వినిపించాడు. అది తన తొలి వచన కవిత. ఇంకా మగ్గవలసిన కవిత. ఆ సంగతే మాట్లాడుకున్నాం. ఆ రోజు కొంత నిర్మొహమాటంగానే మాట్లాడాను నేను. అంతే. మళ్లీ కనిపించలేదు. కనిపించినా కవిత్వచర్చ లేదు. ఒకటి రెండు సంవత్సరాల తర్వాత హఠాత్తుగా 'అన్నం గిన్నె' కవిత్వ సంకలనం manuscript తో ప్రత్యక్షమై ముందు మాట రాయాలన్నాడు. ఇంత కవిత్వం ఎప్పుడు రాశాడా అని ఆశ్చర్యపోయాను. ఎలా ఉండబోతోందా అనే సంశయం తోనే చదవడం మొదలుపెట్టాను. 'అంబేద్కర్ వాద కవిత్వం' అనే ఉపశీర్షిక చూసే సరికి శరీరంలోకి ఒక విద్యుత్ ప్రవేశించినట్లయింది. ఎందుకంటే అప్పటికి తెలుగులో దళిత కవిత్వం ఉంది కానీ, అంబేద్కర్ వాద కవిత్వం లేదు. చదువుతూ పోయే సరికి ప్రతాప్‌లో జరిగిన metamorphosis తేటతెల్లమైంది. అది ఒకనాటి దళిత మహాసభ కార్యకర్త, కవిగా పరిణామం చెంది రాసిన కవిత్వం. తెలుగు వచన కవిత్వంలో తొలిసారి అంబేద్కర్‌ని నిలబెట్టి గెలిపించిన కవిత్వం. అంతకు ముందు వరకు కవులు దళిత సమస్యను పలు కోణాల్లో కవిత్వీకరించారే తప్ప దానికి పరిష్కారం ఒక్క అంబేద్కరేనని మొదటిసారి చెప్పినవాడు నా మిత్రుడు నేతల ప్రతాప్ కుమార్ మాత్రమే. అందుకే ప్రతాప్ కవిత్వం దళిత కవిత్వానికి కొనసాగింపు కాదనీ, అది ఒక 'చేర్పు' అని ముందు మాటలో రాశాను.

ప్రతాప్‌లో ఒక ప్రత్యేక లక్షణం ఉంది. సాధారణంగా కవులు తాము రాస్తున్న అంశాలను ఇతరులతో చర్చిస్తుంటారు. ప్రతాప్ అట్లా చేయడు. హఠాత్తుగా కొత్త పుస్తకంతో కనపడి ఆశ్చర్యపరుస్తాడు. అయితే అప్పటికే ఆ కవితల్ని దళిత సైద్ధాంతిక సాహిత్య పత్రికల్లో ప్రచురించి ఉంటాడు. ప్రతి సారీ అంతే. ఖచ్చితమైన సాహిత్య రాజకీయ దృక్పథం ఉన్నపుడు, ఆత్మవిశ్వాసం పొంగి పొరలుతున్నపుడూ అట్లానే జరుగుతుంది. ఆలోచన ప్రధానంగా గల కవిత్వం రాసినందువల్ల, ఆ ఆలోచనలో స్పష్టత, నిర్దిష్టత ఉండడం వల్ల ఏ కవితనైనా అలవోకగా రాయగలిగేవాడు. కొన్ని కవితల్ని అరుదుగా చేతిరాతగా ఉన్నపుడే చూపిస్తే వాటిని, శుద్ధప్రతులనుకునేవాణ్ణి. కానీ అవన్నీ తొలిప్రతులు. వాటిని చిత్తుప్రతులనడానికి వీల్లేదు. ఒకటి రెండు కొట్టివేతలతో శుద్ధప్రతుల మాదిరిగానే ఉండేవి. ఏవిటీ అని మనం ఆశ్చర్యపోతే ఇందులో ఆశ్చర్యం ఏముంది అన్నట్లుండేవాడు.

తను కవిత్వం రాసి పుస్తకం వెయ్యడం, ఆ ఆవిష్కరణ సభలో నేను మాట్లాడడం తణుకులో రివాజుగా మారింది. ఆ సభల్లో పాల్గొనడం వల్ల తణుకు దళితమిత్రులతో నా సాహచర్యం పెరిగింది. జిల్లాలో ఇతర ప్రాంతాల్లో జరిగిన ఆవిష్కరణలకు కూడా తీసుకెళ్లేవాడు. అట్లా కొన్ని చిన్న చిన్న ఊళ్ల దళిత వాడల్లో మాట్లాడే అవకాశం నాకు కలిగింది. అప్పటి వరకు పుస్తకాలకు పరిమితమైన దళిత స్థితిగతుల నా ఉపరితల జ్ఞానం

☞ మిగతా 26వ పేజీలో

# ఇది మామూలు గూఢచర్యం కాదు
# మన సన్నిహిత అంతరంగాన్ని ఛిద్రం చేస్తున్నారు!

**అరుంధతి రాయ్**
నవలా రచయిత
రాజకీయ కార్యకర్త



భారతదేశంలో మృత్యుభీకర వేసవి అతి వేగంగా గూఢచార వేసవిగా రూపు మార్చుకుంటున్నట్టున్నది.

దాదాపు నలభై లక్షల మంది ప్రాణాలు బలి తీసుకుని కరోనా వైరస్ రెండో అల వెనుకపట్టు పట్టింది. అధికారికంగా మరణాల సంఖ్య అందులో పదో వంతు, నాలుగు లక్షలు మాత్రమే. నరేంద్ర మోడీ దుర్మార్గ రాజ్యంలో శ్మశానాలలో పొగలు ఆరిపోతుండగా, సమాధుల మీద మట్టి చదును అవుతుండగా, మన వీధుల్లో బ్రహ్మాండమైన ప్రకటనలు పుట్టుకొచ్చి "మోడీజీ, ధన్యవాదాలు" అని ప్రకటించాయి. "ఉచిత వ్యాక్సిన్" వాగ్దానాలకు ప్రజలు ముందస్తుగానే తెలుపుకుంటున్న కృతజ్ఞతలట అవి. ఇంతకూ ఆ ఉచిత వ్యాక్సిన్ చాలావరకు దొరకడమే లేదు. మొత్తం జనాభాలో ఇంకా 93 శాతానికి పూర్తి వ్యాక్సిన్ అందవలసే ఉంది. వాస్తవ మరణాల సంఖ్యను నమోదు చేయదలచుకునే ప్రయత్నం ఏదైనా మోడీ ప్రభుత్వ దృష్టిలో భారతదేశానికి వ్యతిరేకంగా కుట్రే. అంటే విమానాల్లోంచి తీసిన ఫొటోల్లో మీరు చూసిన సామూహిక సమాధుల్లోకి భారతదేశపు అంతర్జాతీయ ప్రతిష్టను భంగపరచే ఏకైక ఉద్దేశంతోనే లక్షలాది మంది కేవలం పాత్రధారులుగా తమంతట తామే దిగిపోయారన్న మాట. శవాలుగా మారువేషాలు వేసుకుని నదుల్లో తేలియాడారన్నమాట. లేదా నగరాల రహదారుల పక్కన తమంతట తామే దహనమై పోయారన్న మాట.

ఇప్పుడు పదిహేడు వార్తాసంస్థలకు చెందిన అంతర్జాతీయ పరిశోధక జర్నలిస్టుల బృందం మీద భారత ప్రభుత్వమూ, దాని ఒడిలోని ప్రచార మాధ్యమాలూ అదే నేరారోపణను చేస్తున్నాయి. ఆ వార్తాసంస్థలు ఫర్బిడెన్ స్టోరీస్, ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ సంస్థలతో కలిసి, భారీ అంతర్జాతీయ గూఢచర్యానికి సంబంధించిన ఒక అసాధారణ వార్తా కథనాన్ని వెల్లడించాయి. ఆ నివేదికల్లో భారతదేశం పేరు కూడ ఉంది. ఇజ్రాయెలీ గూఢచార సాంకేతిక పరిజ్ఞాన సంస్థ ఎన్ఎస్ఒ గ్రూప్ తయారుచేసిన పెగాసస్ స్పైవేర్‌ను మరికొన్ని దేశాల ప్రభుత్వాలు కూడ కొన్నాయని ఆ జాబితాలో ఉంది. ఈ వార్త బైటపడగానే, మానవహక్కుల విషయంలో మంచి చరిత్ర ఉన్న ప్రభుత్వాలకు మాత్రమే తాము తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని అమ్ముతామని, తీవ్రవాదుల, నేరస్తుల ఆనుపానులు కనిపెట్టే జాతీయ భద్రతా అవసరాల కోసం వాడే ప్రభుత్వాలకే అమ్ముతామని ఎన్ఎస్ఒ ప్రకటించింది.

ఇలా ఎన్ఎస్ఒ చేసిన మానవహక్కుల పరీక్షల్లో నెగ్గిన దేశాల జాబితా ఒకసారి చూడండి. రువాండా, సౌదీ అరేబియా, బహ్రెయిన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, మెక్సికో. మరి "తీవ్రవాదులు" "నేరస్తులు" అనే మాటలను నిర్వచించినదెవరు? అంగీకరించినదెవరు? ఎన్ఎస్ఒ, దాని వినియోగదారులూ మాత్రమేనా?

ఒక్కొక్క ఫోన్ మీద ఆ స్పైవేర్ వాడడానికి వేలాది డాలర్లు ఖర్చవుతుందనే విపరీతమైన వ్యయాన్ని అలా ఉంచి, మొత్తం సాంకేతిక పరిజ్ఞానం ఖరీదు మీద 17 శాతం వార్షిక నిర్వహణ వ్యయం వసూలు చేస్తుంది ఎన్ఎస్ఒ. ఒక దేశపు ప్రభుత్వం పక్షాన ఆ దేశపు పౌరుల వ్యక్తిగత వ్యవహారాల్లోకి జొరబడే ఈ గూఢచర్య కార్యకలాపాన్ని ఒక విదేశీ సంస్థ అమ్ముతుందంటే, నిర్వహిస్తుందంటే అది పూర్తిగా దేశద్రోహకరమైన విషయం.

జర్నలిస్టుల పరిశోధక బృందం అప్పటికే బైటపడిన 50,000 ఫోన్ నంబర్ల జాబితాను పరీక్షించింది. ఆ జాబితాలో వెయ్యికి పైగా నంబర్లు భారతదేశంలో ఎన్ఎస్ఒ వినియోగదారు వాడినట్టు విశ్లేషణలో తేలింది. వీటిలో ఒక ఫోన్‌లోకి జొరబడడంలో విజయం సాధించారా లేదా, లేక జొరబడడానికి ప్రయత్నం జరిగిందా అనేది ఆ ఫోన్‌ను ఫోరెన్సిక్ పరీక్షకు గురి చేసినప్పుడు మాత్రమే బైటపడుతుంది. భారతదేశంలో ఇప్పటి వరకూ పరీక్షకు గురిచేసిన ఫోన్లలో చాల వరకు పెగాసస్ స్పైవేర్ దాడికి గురయ్యాయని తేలింది. బైటపడిన జాబితాలో ప్రతిపక్ష రాజకీయ నాయకులు, అసమ్మతి జర్నలిస్టులు, కార్యకర్తలు, న్యాయవాదులు, మేధావులు, వ్యాపారవేత్తలు, ప్రభుత్వ మాట వినని భారత ఎన్నికల కమిషన్ అధికారి, సీనియర్ ఇంటెలిజెన్స్ అధికారి, కాబినెట్ మంత్రులు, వారి కుటుంబ సభ్యులు, విదేశీ దౌత్యవేత్తలు, చివరికి పాకిస్తాన్ ప్రధానమంత్రి ఇమ్రాన్ ఖాన్‌ల ఫోన్ నంబర్లు కూడ ఉన్నాయి.

భారత ప్రభుత్వ అధికార ప్రతినిధులు ఈ జాబితా బూటకం అని ఖండించారు. ఎంతో నైపుణ్యం గల, సకల విషయాలూ తెలిసిన కాల్పనిక రచయిత కూడ ఇంత కచ్చితమైన, విశ్వసనీయమైన జాబితా తయారు చేయజాలరని భారత రాజకీయాలను సన్నిహితంగా పరిశీలించే వారెవరైనా చెప్పగలరు. అధికారపార్టీకి ఆసక్తి ఉండే వ్యక్తుల పేర్లతో, తన రాజకీయ ప్రణాళికకు వ్యతిరేకమైనవారని అధికార పార్టీ భావించే వారి పేర్లతో ఇంత సమగ్రమైన జాబితా మరొకటి ఉండదు. నిజానికి ఈ జాబితా సంభ్రమపరిచేంత సూక్ష్మ వివరాలతో ఉంది. కథల లోపల కథలెన్నో ఉన్నాయి. కొన్ని అనూహ్యమైన పేర్లు కూడ ఈ జాబితాలో ఉన్నాయి. కొన్ని ఊహించదగిన పేర్లు లేవు.

లక్ష్యంగా పెట్టుకున్న ఒక ఫోన్‌కు ఒక మిస్డ్ కాల్ ఇవ్వడం ద్వారా ఆ ఫోన్‌లోకి పెగాసస్‌ను ప్రవేశపెట్టవచ్చునని అంటున్నారు. ఒక్కసారి అది ఊహించి చూడండి. మిస్డ్ కాల్ అనే క్షిపణి మీద అదృశ్యంగా ఉండే పేలుడు పదార్థాన్ని నేరుగా మీ ఫోన్ లోపలికి జొరబెట్టేస్తారన్నమాట. అంటే దాన్ని పోలిన ఖండాంతర అణ్వాయుధ క్షిపణి మరొకటి లేదన్నమాట. అది ప్రజాస్వామ్య దేశాలను కుప్పకూల్చివేయగలదు. సమాజాలను చిన్నాభిన్నం చేయగలదు. ఇదంతా కూడ సాధారణమైన అధికారయంత్రాంగపు ఆలస్యం ఏమీ లేకుండానే. వారంట్లు ఉండవు, ఆయుధ ఒప్పందాలుండవు. పర్యవేక్షక బృందాలుండవు. ఎటువంటి నియంత్రణా ఉండదు. సాంకేతిక పరిజ్ఞానానికి విలువల తటస్థత ఉంటుందని అంటారు గదూ. అది ఎవరి తప్పూ కాదు.

భారత ప్రభుత్వానికీ ఎన్ఎస్ఓకూ ఈ స్నేహపూర్వక కలయిక ఇజ్రాయెల్‌లో 2017లో జరిగినట్టుంది. మోడీ, నెతన్యాహు కలుసుకున్న ఆ అపూర్వ సందర్భాన్ని భారత ప్రచార మాధ్యమాలు 'భ్రాతృప్రేమ' అని అభివర్ణించాయి. వాళ్లిద్దరూ దోర్ సముద్ర తీరంలో, తమ పాంట్లు పైకి మడుచుకుని నీటిలో కలిసి తిరిగారు. ఆ తడి తడి ఇసుక మీద వాళ్లు వదిలినవి తమ పాదముద్రలు మాత్రమే కాదు, అంతకన్న ఎక్కువే. సరిగ్గా ఆ సమయం నుంచే భారతదేశపు ఫోన్ నంబర్లు ఈ స్పైవేర్ జాబితాలో కనబడడం మొదలైంది.

ఆ సంవత్సరమే భారత జాతీయ భద్రతా మండలి బడ్జెట్ పది రెట్లు పెరిగింది. పెరిగిన కేటాయింపులలో అత్యధిక భాగం సైబర్ సెక్యూరిటీ పద్దు కిందనే ఉండింది. మోడీ ప్రధానమంత్రిగా రెండోసారి ఎన్నికైన తర్వాత, 2019 ఆగస్టులో భారతదేశపు అత్యంత క్రూరమైన తీవ్రవాద వ్యతిరేక చట్టం – చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధ చట్టం (యుఎపిఎ) పరిధిలోకి సంస్థలను మాత్రమే గాక వ్యక్తులను కూడ తెచ్చారు. అప్పటికే వేలాది మంది ఈ చట్టం కింద బెయిల్ కూడ లేకుండా జైళ్లలో మగ్గిపోతున్నారు. సంస్థలతో పాటు వ్యక్తులను ఎందుకు తెచ్చారో తెలుసునా? సంస్థలకు స్మార్ట్ ఫోన్లు ఉండవు గదా! సైద్ధాంతికమైనదే అయినప్పటికీ, ఇది ఒక ముఖ్యమైన వివరం. కాని ఈ వివరమే చట్టపరిధిని విస్తరిస్తుంది, మార్కెట్‌ను కూడ విస్తరిస్తుంది.

పార్లమెంటులో ఈ సవరణ మీద చర్చ సందర్భంలో హోం మంత్రి అమిత్ షా ఒక మాటన్నారు: "అయ్యా, తీవ్రవాదాన్ని పెంచేవి తుపాకులు కావు. తీవ్రవాదానికి మూలం దాన్ని వ్యాపింపజేసే ప్రచారంలోనే ఉంది. ఆ వ్యక్తులందరినీ తీవ్రవాదులుగా ప్రకటించడానికి, పార్లమెంటు సభ్యులలో ఏ ఒక్కరికీ ఎటువంటి అభ్యంతరం ఉండదనుకుంటాను."

ఇప్పుడు పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో పెగాసస్ కుంభకోణం పెద్ద గందరగోళాన్ని సృష్టించింది. హోంమంత్రి దిగిపోవాలని ప్రతిపక్షాలు పట్టుబట్టాయి. మందబలం సమృద్ధిగా ఉన్న మోడీ అధికారపక్షం, రైల్వేలు, సమాచార సంబంధాలు, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖల మంత్రిగా కొత్తగా పదవీస్వీకారం చేసిన అశ్విని వైష్ణవ్‌కు పార్లమెంటులో ప్రభుత్వాన్ని సమర్థించే బాధ్యత అప్పగించింది. అయితే ఆయనకు అవమానకరంగా, ఆయన నంబర్ కూడ బైటపడిన జాబితాలో ఉంది.

ప్రభుత్వం ఇచ్చిన అనేక ప్రకటనల్లోని డొంకతిరుగుడునూ, మాయచేసే అధికారిక పదాడంబరాన్నీ పక్కన పెడితే, పెగాసస్ కొనడం, వాడడం అసలు జరగనే లేదని ప్రభుత్వం స్పష్టంగా చెప్పలేదు. తాము భారత ప్రభుత్వానికి అమ్మలేదని ఎన్ఎస్ఓ కూడ చెప్పలేదు. స్పైవేర్ దుర్వినియోగం జరుగుతున్నదనే ఆరోపణలపై ఇజ్రాయెల్, ఫ్రాన్స్ ప్రభుత్వాలు విచారణకు ఆదేశించాయి. భారతదేశంలో కూడ దీనికి వెచ్చించిన డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందనే పొగను పట్టుకుని ముందుకు వెళ్తే కచ్చితంగా నిప్పు దగ్గరికి చేరగలుగుతాం. కాని ఆ నిప్పు అక్కడి నుంచి మనను ఎక్కడికి తీసుకు వెళ్తుంది?

ఒకసారి ఇది ఆలోచించండి: పదహారు మంది కార్యకర్తలు, న్యాయవాదులు, కార్మికనాయకులు, ప్రొఫెసర్లు, మేధావులు ఉన్నారు. వారిలో ఎక్కువమంది దళితులు. వారందరినీ భీమా కోరేగాం కేసుగా సుప్రసిద్ధమైన కేసులో సంవత్సరాలుగా నిర్బంధించి ఉంచారు. దళితులకూ, ఆధిపత్య కుల బృందాలకూ మధ్య 2018 జనవరి 1న జరిగిన హింసను రెచ్చగొట్టారనే

ఊహాతీతమైన వారి మీద ఆరోపణ చేశారు. ఆ రోజున వేలాది మంది దళితులు భీమా కోరేగాం యుద్ధపు 200వ సంస్మరణ దినాన్ని జరుపుకోవడానికి అక్కడ సమావేశమయ్యారు. (ఆ యుద్ధంలో దళిత సైనికులు బ్రిటిష్ వారి తరఫున పోరాడి నిరంకుశ బ్రాహ్మణ పాలన నెరపిన పీష్వాలను ఓడించారు.) ఈ పదహారు మంది భీమా కోరేగాం నిందితులలో ఎనిమిది మంది ఫోన్ నంబర్లు, వారి సన్నిహిత కుటుంబ సభ్యుల ఫోన్ నంబర్లు బైటపడిన స్పైవేర్ జాబితాలో ఉన్నాయి. ఆ ఫోన్లన్నిటిలోకీ పెగాసస్ ప్రవేశించిందా, కొన్నిటిలోకే ప్రవేశించిందా, ప్రవేశించడానికి ప్రయత్నించిందా వివరాలు తెలుసుకోవాలంటే ఆ ఫోన్లను ఫోరెన్సిక్ పరీక్షలకు గురి చెయ్యాలి. కాని ఆ ఫోన్లన్నీ వాళ్లను అరెస్టు చేసినప్పుడు జప్తు చేశారు, పోలీసుల దగ్గరే ఉన్నాయి.

తనకు శత్రువులుగా భావించినవాళ్ల మీద ఉచ్చులు పన్నడానికి మోడీ ప్రభుత్వం ఎంతెంత దారుణమైన పనులకు పాల్పడుతున్నదో తెలుసుకోవడంలో మాలో కొందరం పండితులమే అయిపోయాం. ఆ దారుణమైన పనులు కేవలం గూఢచర్యానికి మించినవి. భీమా కోరేగాం నిందితులలో రోనా విల్సన్, సురేంద్ర గాడ్లింగ్‌ల కంప్యూటర్ల ఎలక్ట్రానిక్ కాపీల మీద విశ్లేషణ చేసిన మసాచుసెట్స్‌లోని డిజిటల్ ఫోరెన్సిక్స్ సంస్థ ఆర్సెనాల్ కంప్యూటింగ్ ఇటీవలనే తన నివేదిక ప్రకటించింది. ఆ ఇద్దరి కంప్యూటర్లలో కూడ ఒక గుర్తు తెలియని ఆగంతుకుడు జొరబడ్డాడని, వారి హార్డ్‌డ్రైవ్‌లలో అదృశ్యంగా ఉన్న ఫోల్డర్లలో ప్రమాదకరమైన డాక్యుమెంట్లు ప్రవేశపెట్టాడని ఆ పరిశోధకులు గుర్తించారు. ఆ డాక్యుమెంట్లలో ఒకటి, కాస్త మసాలా కలపడం కోసం, మోడీని చంపడానికి కుట్ర పన్నారని చూపే నమ్మశక్యం కాని ఉత్తరం.

ఆర్సెనాల్ నివేదిక అత్యంత తీవ్రమైన పర్యవసానాలు భారత న్యాయవ్యవస్థకు గాని, భారత ప్రధాన స్రవంతి ప్రచార సాధనాలకు గాని పట్టనే పట్టలేదు. న్యాయ సాధనలో తాము చేయవలసిన పని ఉందని వాళ్లు అనుకోనేలేదు. అందుకు పూర్తి వ్యతిరేకంగా పని చేశారు. వారు ఆ నివేదిక వల్ల జరగగల పరిణామాలను అడ్డుకుంటూ, దాన్ని మూసివేయడానికి ప్రయత్నిస్తూ ఉండగా, భీమా కోరేగాం కేసు నిందితుడు, 84 సంవత్సరాల జెసూయిట్ ప్రీస్ట్ ఫాదర్ స్టాన్ స్వామి జైలులో కరోనా వైరస్ సోకి చనిపోయారు. ఆయన ఎన్నో దశాబ్దాల పాటు జార్ఖండ్ రాష్ట్రంలో ఆదివాసుల మధ్యన, వారి ఆవాసాలనూ, భూములనూ స్వాధీనం చేసుకోదలచిన కార్పొరేట్ల కు వ్యతిరేకంగా పోరాడారు. అరెస్టయ్యే సమయానికి ఆయన పార్కిన్సన్ వ్యాధితో, కాన్సర్‌తో బాధ పడుతున్నారు.

మరి, మనం పెగాసస్ పట్ల ఏం చేయవలసి ఉంది? పాలితుల మీద పాలకులు తరతరాలుగా సాగిస్తున్న గూఢచర్యానికి ఇది ఒక కొత్త సాంకేతిక విధాన రూపం మాత్రమే అని నిరాశతో దాన్ని కొట్టివేయడం తీవ్రమైన తప్పిదం. ఇది సాధారణ గూఢచర్యం కాదు. మన మొబైల్ ఫోన్లు మన అత్యంత సన్నిహిత ఆంతరంగిక వస్తువులు. అవి ఒక రకంగా మన మెదడుకూ శరీరానికీ కొనసాగింపుగా మారిపోయాయి. మొబైల్ ఫోన్ల ద్వారా చట్టవ్యతిరేక గూఢచర్యం భారతదేశంలో కొత్తేమీ కాదు. కశ్మీరీలలో ప్రతి ఒక్కరికీ దాని గురించి తెలుసు. భారతదేశంలోని కార్యకర్తలలో కూడ చాల మందికి అది తెలుసు. కాని, మన ఫోన్లలోకి జొరబడే, దాని మీద ఆధిపత్యం వహించే చట్టబద్ధ హక్కును ప్రభుత్వాలకూ, కార్పొరేషన్లకూ ఇవ్వడమంటే స్వచ్ఛందంగా మనమే మన మీద ఉల్లంఘనలు జరగడానికి అవకాశం ఇవ్వడమే.

ఈ స్పైవేర్ వల్ల ఉండగల ప్రమాదం ఇంతకు ముందరి గూఢచార, నిఘా రూపాలన్నిటి ప్రమాదం కన్న ఎక్కువ చొరబాటు స్వభావం కలిగినదని పెగాసస్ ప్రాజెక్ట్ బైటపెట్టింది. ఇప్పటికే గూగుల్, అమెజాన్, ఫేస్ బుక్ ఆల్గారిథంల పడుగూ పేకా అల్లిన సాలెగూళ్లలో కోట్లాది మంది తమ జీవితాలు గడుపుతున్నారు. తమ కోరికలను బహిరంగ పరుస్తున్నారు. కాని పెగాసస్ వాటికన్న ఎక్కువ చొరబడుతుంది. అది కేవలం మీ జేబులో ఒక గూఢచారి ఉండడం లాంటిది మాత్రమే కాదు. అది మీరు ప్రాణాధికంగా ప్రేమించేవారే మీ మీద గూఢచర్యం చెయ్యడం లాంటిది. అంతకన్న ఘోరంగా మీ మెదడే, లేదా మీ మెదడులోని చొరబడడానికి వీలులేని మూలమూలలే మీ మీద నిఘా పెట్టడం లాంటిది.

పెగాసస్ వంటి స్పైవేర్ కేవలం అది ప్రవేశించిన ఫోన్ వినియోగదారును మాత్రమే కాదు, ఆ వినియోగదారు సమస్త సామాజిక బృందాన్నీ, రాజకీయ, సామాజిక, ఆర్థిక జీవితంలోని మిత్రులనూ, కుటుంబాలనూ, సహచరులనూ అందరినీ ప్రమాదంలో పడేస్తుంది.

ఇటువంటి విస్తృతమైన ప్రజా నిఘా గురించి ప్రపంచంలో మరెవరి కన్నా ఎక్కువ కాలంగా, ఎక్కువ లోతుగా ఆలోచించిన వ్యక్తి బహుశా అమెరికా జాతీయ భద్రతా ఏజెన్సీ మాజీ విశ్లేషకుడు, అసమ్మతివాది ఎడ్వర్డ్ స్నోడెన్ అయి ఉంటాడు. గార్డియన్ పత్రికకు

ఇటీవల ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో ఆయన ఇలా హెచ్చరించాడు: "ఈ సాంకేతిక పరిజ్ఞానం అమ్మకాలను ఆపడానికి మీరు ఏమీ చేయకపోతే, అది కేవలం 50,000 లక్ష్యాల దగ్గరే ఆగిపోదు. అది త్వరలోనే అయిదు కోట్ల లక్ష్యాలను చేరుతుంది. మనమెవరమూ ఊహించలేనంత వేగంతో విస్తరిస్తుంది" అన్నాడు. ఆయన మాటలు మనం శ్రద్ధగా వినాలి. ఆయన ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని లోపలి నుంచి చూశాడు, ఇది ఎలా అభివృద్ధి చెందుతున్నదో చూశాడు.

దాదాపు ఏడేళ్ల కింద, డిసెంబర్ 2014లో నేను మాస్కోలో స్నోడెన్‌ను కలిశాను. అప్పటికే ఆయన తన ప్రభుత్వం తన సొంత పౌరుల మీద సాగిస్తున్న గూఢచర్యాన్ని అసహ్యించుకుని, ఆ విషయాలు బైటపెట్టాలని నిర్ణయించుకుని ఏడాదిన్నర అయింది. మే 2013లో అనూహ్యంగా తప్పించుకుని, ఒక కాందిశీకుడిలా జీవించడానికి అలవాటు పడుతున్నాడు. పెంటగన్ పేపర్స్‌కు చెందిన డానియెల్ ఎల్స్ బెర్గ్, జాన్ కుసాక్‌కు చెందిన జాన్ కుసాక్, నేను స్నోడెన్‌ను కలవడానికే మాస్కో వెళ్లాం. రష్యన్ చలికాలపు మంచు గాలులు కిటికీ అద్దాలను బాదుతుండగా ఒక హోటల్ గదిలో మూడు రోజుల పాటు మేం నిఘా గురించీ, గూఢచర్యం గురించీ ఎడతెగని సంభాషణలు జరిపాం. ఇది ఎంతదూరం పోతుంది? ఇది మనను ఎక్కడికి తీసుకుపోతుంది? చివరికి మనం ఏమవుతాం?

పెగాసస్ ప్రాజెక్టు వార్తలు వెలువడగానే నేను నా పాత కాగితాలు తవ్వి తీసి, మా సంభాషణలను నమోదు చేసిన ట్రాన్స్క్రిప్ట్ చూశాను. అది కొన్ని వందల పేజీలుంది. అది చదువుతుంటే నా వెంట్రుకలు నిక్కబొడుచుకున్నాయి. అప్పటికి ముప్పై ఏళ్ల వయసులో ఉన్న స్నోడెన్, ఒక విషాద ప్రవక్త లాగా చెప్పాడు: "ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని వెనక్కి తిప్పడం కుదరదు. అది ఎక్కడికీ పోదు.... అది ఇంకా చౌకగా దొరుకుతుంది, ఇంకా శక్తిమంతంగా తయారవుతుంది. ఇంకా ఎక్కువగా అందుబాటులోకి వస్తుంది. మనం ఏదో ఒకటి చేయకపోతే, నిద్రలో నడిచినట్టుగా మనం నేరుగా సంపూర్ణ గూఢచర్య రాజ్యంలోకి నడిచి వెళ్లిపోతాం. అక్కడ ఉండేది రెండు రకాల అపార శక్తులున్న సర్వశక్తిమంతమైన రాజ్యం. దానికి బలప్రయోగం చేయడానికి అనంతమైన సామర్థ్యం ఉంటుంది. దానికి తన సామర్థ్యాన్ని ఏ లక్ష్యానికి గురిపెట్టాలో తెలుసుకునే అనంతమైన శక్తి ఉంటుంది. ఆ సామర్థ్యమూ ఆ శక్తీ రెండూ కలిసి ఉండడం అత్యంత ప్రమాదకరం.... అదే భవిష్యత్ దిశ" అన్నాడాయన.

మరో మాటల్లో చెప్పాలంటే, ప్రజల గురించి తెలియ వలసిన సమస్తమూ తెలిసిన రాజ్యం చేత పాలించబడే దిశగా, మరొక వంక, ఆ రాజ్యం గురించి ప్రజలకు అంతకంతకూ తక్కువ తెలిసే దిశగా మనం పయనిస్తున్నాం. ఆ అసమతుల్యత ఒకే ఒక్క గమ్యానికి దారితీస్తుంది. అది దుష్టత్వం. ప్రజాస్వామ్యఅంతం.

స్నోడెన్ చెప్పినది సరైనదే. ఈ సాంకేతిక విధానాన్ని వెనక్కి తిప్పలేం. కాని దాన్ని ఇలా నియంత్రణ లేని, చట్టబద్ధమైన పరిశ్రమ లాగా, విపరీతమైన లాభాలు చేసుకుంటూ, ఖండాంతర స్వేచ్ఛా విపణి మహా రహదారుల మీద మూడు పూలు ఆరు కాయలుగా వర్ధిల్లుతూ తిరగనివ్వవలసిన అవసరమేమీ లేదు. దాన్ని చట్టాల గొలుసులతో కట్టి వేయవచ్చు. దాన్ని రహస్య జీవితంలోకి నెట్టేయవచ్చు. అలా సాంకేతిక విధానం ఉంటే ఉంటుందేమో. పరిశ్రమ ఉండనవసరం లేదు.

అంటే మనం ఎక్కడికి చేరినట్టు? చెప్పాలంటే, పాత కాలపు, మంచి రాజకీయాల ప్రపంచంలోకి చేరుతాం. కేవలం రాజకీయ కార్యాచరణ మాత్రమే ఈ ప్రమాదాన్ని అడ్డుకోగలదు. ఎందుకంటే ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని చట్టబద్ధంగా కాకపోతే, చట్టవ్యతిరేకంగానైనా వినియోగించినప్పుడు, అది మన కాలానికి చెందిన సంక్లిష్ట వలయం లోపలే మనుగడలో ఉంటుంది. ఆ వలయం జాతీయవాదం, పెట్టుబడిదారీ విధానం, సామ్రాజ్య వాదం, వలసవాదం, జాతి దురహంకారవాదం, కుల దురహంకార వాదం, పురుషాధిపత్యం అనే వలయం. అదే మన యుద్ధ రంగం. సాంకేతిక పరిజ్ఞాన అభివృద్ధి ఎలాగైనా ఉండనీండి.

మన మొబైల్ ఫోన్లు అనే మన సన్నిహిత ఆంతరంగిక శత్రువు చేత అదుపు చేయబడని, వాటి ఆధిపత్యం కింద ఉండని ఒక ప్రపంచంలోకి మనం తిరిగి ప్రయాణించవలసి ఉంది. మనం ఊపిరి సలపనివ్వని డిజిటల్ గూఢచర్య ప్రపంచానికి బైట మన జీవితాలను, పోరాటాలను, సామాజిక ఉద్యమాలను పునర్నిర్మించుకునే ప్రయత్నం చేయవలసి ఉంది. మనకు వ్యతిరేకంగా డిజిటల్ గూఢచర్యాన్ని ఉపయోగిస్తున్న పాలనలను మనం కూలదోయవలసి ఉంది. అధికార పగ్గాల మీద వాళ్ల పట్టును తొలగించడానికి మనం చేయగలిగినంతా చేయవలసి ఉంది. వాళ్లు తెగగొట్టిన వాటన్నిటినీ అతికించడానికి, వాళ్లు దొంగిలించిన దాన్నంతా వెనక్కి రాబట్టుకోవడానికి మనం చేయగలిగినదంతా చేయవలసి ఉన్నది. ❑

*(రెండు శతాబ్దాలుగా నడుస్తున్న ప్రతిష్ఠాత్మక బ్రిటిష్ దినపత్రిక ది గార్డియన్, 27 జూలై 2021 సంచికలో అచ్చయిన వ్యాసానికి తెలుగు: ఎన్ వేణుగోపాల్)*

# భారతావని జబ్బుపడ్డది



**పద్మజ షా**
జర్నలిస్టు

(పద్మజ షా గారు జర్నలిస్టు. హైదరాబాద్ నివాసి. ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో కాలమిస్టు. ఈ ఆర్టికల్ మొదట ఆంగ్లంలో ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రికలో అచ్చయింది. తెలుగు అనువాదం మాతృక మహిళా మాస పత్రికలో అచ్చయింది. అనువాదం చేసింది నేనే గనుక బ్లాగ్‌లో ప్రచురిస్తున్నాను. – వి.శేఖర్)

ప్రఖ్యాత మనస్తత్వ శాస్త్రవేత్త ఫ్రాయిడ్ ఇలా అంటాడు: “మనం జబ్బు పడకుండా ఉండాలంటే చివరి ప్రయత్నంగా మనం ప్రేమించడం మొదలు పెట్టాలి. ప్రేమించ లేకపోతే కనక... మనం జబ్బు పడక తప్పదు.” మనిషిని వివేకవంతునిగా ఉంచటంలో అత్యంత అవసరమైన మానవ స్వాభావిక ప్రవృత్తి ప్రేమ. కులం, వర్గం, మతం, జాతి లేదా తెగ.. ఇత్యాదిగా గల సకల కృత్రిమ విభజనలను ప్రేమ అధిగమిస్తుంది. అది ఒకరి ఆదేశాల్ని అనుసరించి ప్రదర్శితం అయ్యేది కాదు; అది జరగాలని మీరు స్వయంగా ఆదేశిస్తే, జరుగుతుంది; దాని అవసరం లేదని మీరు భావిస్తే అది సంభవించదు.

కులం పేరుతో, రోమియో వ్యతిరేక దళాల పేరుతో లేదా లవ్ జిహాద్ పేరుతో ప్రేమలో ఉన్న యువతీ యువకులపై దాడులు జరగడం అంతకంతకూ పెరుగుతుండడం బట్టి, కండలు పెంచినప్పటికీ అస్వస్థంగా ఉన్న సమాజం మన చుట్టూ వ్యాపించి ఉన్నదని స్పష్టం అవుతోంది. ఈ రోగ పీడిత సమాజానికి ప్రేమ అంటే ఒక చెడ్డ పదం – అదొక చెడ్డ భావోద్వేగం. ప్రేమ అంటే, ఒకరి మానవత్వం తన అసలు స్వభావంతో ఆవిష్కృతం కావటం అని అర్థం చేసుకోగల సామర్థ్యం దానికి లేదు.

ప్రేమ రహిత అస్వస్థ సమాజం ఒక రోమియో వ్యక్త పరిచే ప్రేమ పొంగును నాశనం చేసేస్తుంది. అతని ప్రేమకు జూలియట్ తన ప్రేమ ద్వారా ప్రతిస్పందించడం వారి ఆగ్రహానికి కారణం అవుతుంది. రోమియో అండ్ జూలియట్ కథను షేక్‌స్పియర్ 1590లలో రచించాడు. తెలంగాణలో మంథనికి చెందిన మన యువకుడు మధుకర్ లేదా తమిళనాడులో కుమారలింగం గ్రామానికి చెందిన వి శంకర్.., ఈ ఇద్దరు ఉన్నత కులానికి చెందిన యువతులతో ప్రేమలో పడినందుకు క్రూరంగా హత్యకు గురయ్యారు. వారు ఇద్దరిలో ఎవ్వరూ యువతులను వెంటబడి వేధించలేదు. వారి ప్రేమలకు యువతులు ఇద్దరూ సానుకూలంగానే స్పందించారు.

“మన భారతీయులం ప్రేమ వల్ల చాలా అవమానానికి గురవుతాం, కానీ హింస విషయానికి వచ్చేసరికి చెలరేగిపోతాం. టెలివిజన్, సినిమాలు లాంటి ప్రజా సాంస్కృతిక మాధ్యమాలు హింసను ఉత్సవరీతిలో వినియోగించుకునేందుకు నిరాటంకంగా అనుమతి ఉంటుంది. కానీ ప్రేమ వ్యక్తీకరణను మాత్రం కోపంతో తిరస్కరిస్తాం; అసంతృప్తితో రగిలిపోతాం.” 1960లలో సినిమా సెన్సార్‌షిప్ విషయంలో ఒక నివేదిక వెలువరిస్తూ ఖోస్లా కమిటీ ఈ మాటలు చెప్పింది. అప్పటి నుండి ఇప్పటి వరకు పరిస్థితిలో వచ్చిన మార్పు ఏమీ లేదు.

ప్రధానంగా స్వజాతి వివాహాల వలనా, పురుషులు స్త్రీలు మధ్య వయసు తేడా విషయమై ఖచ్చితమైన నిబంధనలు ఉండటం వలనా భారతదేశంలోని వివాహ సాంప్రదాయాలలో ప్రేమ ఎన్నడూ ఒక అంశంగా లేదు. వివాహంలో లైంగిక సంపర్కం అంటే అది కేవలం పునరుత్పత్తి విధిని నిర్వర్తించటం మాత్రమే; దానిని ‘ప్రేమ’తో ముడిపెట్టాలన్న సందిగ్ధతకు అక్కడ తావు లేదు. కొన్ని జంటలు ఈ పరిస్థితిని అధిగమించి వివాహం అనంతరం ప్రేమను సంపాదించడంలో విజయవంతం అవుతారా, వారు ఆశీర్వదించబడ్డవారు! కానీ నిజంగా అయితే అక్కడ ప్రేమను ఆశించలేము.

కొత్త పెళ్లి కూతుళ్లు అనేక సార్లు తమ జీవిత భాగస్వాములు తమ పట్ల ఉదాసీనంగా ఉండటం గురించి తల్లిదండ్రులకు

ఫిర్యాదు చేస్తుంటారు. త్వరగా ఒక బిడ్డను కనెయ్యమని తల్లులు వారికి తరచుగా సలహా ఇస్తుంటారు. బిడ్డను కని పడేయటం ద్వారా ఆ కుటుంబంలో తన స్థానాన్ని సుస్థిరం చేసుకోవచ్చని వారి అంచనా. అంతటితో సరి! తన బిడ్డ ద్వారా (అత్తగారి) కుటుంబంలో నివాసానికి చట్టబద్ధ హక్కును సాధించడం అన్న మాట! ఆ తర్వాత అంతా సర్దుకుంటుందని నమ్మాలి. కానీ అనేక కేసుల్లో బిడ్డ పుట్టినా పరిస్థితిలో ఏ మార్పు ఉండదు. ఆ తర్వాత మహిళకు క్షణం తీరిక లేకుండా పోతుంది. తన లోపల నిండా నిండి ఉన్న అనంతమైన ఖాళీతనం గురించి కాస్తంత కూడా ఆలోచించలేని పని ఒత్తిడి ఆమెను చుట్టి వేస్తుంది.

కులము, సమాజం, మతం లాంటివి ముఖ్యమైన చోట కూడా ఈ తరహా సంబంధాలే వివాహాలకు పునాదిగా ఉంటాయి. తాను ఏ సమూహంలో అయితే మసులుతుందో ఆ సమూహం నిర్దేశించిన విధంగా పెళ్లి కూతురు కుటుంబంలో, సమాజంలో తన స్థానాన్ని అర్థం చేసుకుని ఆ విధంగా నడచుకుని తీరాలి. కొత్తగా ఎటువంటి భావజాలాన్ని వెంటబెట్టుకుని రావలసిన అవసరం లేదు. అది వృధా శ్రమ మాత్రమే. మొదటి రోజునుండే కుటుంబంలో ఇమిడిపోయే విధంగా ఆమె ‘‘సంసార పక్షంగా, క్రమశిక్షణతో పెంచబడినదిగా” ఉండాలి. ప్రేమ ఎన్నడైనా ఆమె ముఖంలోకి తేరిపార జూస్తే అలాంటి దాన్ని గుర్తించడానికి ససేమిరా వీలు లేదు.

యువ పెళ్లికూతురు వంట వండడంలో నిష్ణాతులై ఉండటానికి ఎంచక్కా అనుమతి ఉంటుంది. భర్త కోసం కుటుంబం కోసం ఆమె వంట కళలో పొద్దస్తమానం మునిగి తేలుతుంటే దానిని చూసి తరించడానికి సమాజం సిద్ధంగా ఉంటుంది. ఆమెకు గొప్ప గృహిణి అన్న గుర్తింపును గ్యారంటీ చేస్తుంది. పెళ్లి కూతురు నిరంతరాయంగా కుటుంబంలో సమగ్ర భాగమై కలిసిపోతూ ఉండాలి. పెద్దలు కుదిర్చిన వివాహాల్లో స్త్రీ పురుషుల మధ్య వయసు తేడాను గట్టిగా నిర్దేశించడానికి ప్రాథమిక కారణం ఏమిటంటే ముదిమి వయసులో పురుషుడికి సేవలు చేసేందుకు స్త్రీ తగినంత పుష్టిగా ఉండాలని ఆశించడమే. వివాహం అన్నది ప్రాథమికంగా ఇల్లు చూసుకోవడానికి చేయబడ్డ వెట్టిచాకిరీ ఏర్పాటు మాత్రమే. యువకులు తమకు నచ్చిన విధంగా భాగస్వాములను ఎంపిక చేసుకోవడంలో ఎదుర్కొనే అదుర్దాకు పునాది కూడా ఇదే. స్వతంత్రంగా వ్యవహరించే మహిళ తనకు అప్పగించబడిన పాత్రను పోషిస్తుందా లేదా అన్నదే వారి ఆదుర్దా. పెద్దలు కుదిర్చిన వివాహాల్లో కూడా విద్యావంతులైన పెళ్లి కూతుళ్లు కొందరు తమ కొత్త కుటుంబాల అంచనాలను నీరు గార్చడం ఆశా సౌధాలను నిలువునా కూల్చివేయడం పూర్తిగా వేరే సంగతి.

పునరుత్పత్తి, పోషణ కార్యక్రమంలోనూ, వంశవృక్షాన్ని నిరంతరాయంగా పరిరక్షించడంలోనూ భార్యలు పూర్తిగా మునిగిపోయి ఉంటే పురుషులకు ఎటువంటి సామాజిక అపప్రథ ఎదుర్కొనవలసిన అవసరం లేకుండానే తమ ఆనందాలను ఇంకెక్కడో వెతుక్కోవటానికి స్వేచ్ఛ లభించడం మనం చూస్తున్నాం. దేవదాసీలు, జోగినులు లాంటి వ్యవస్థలు దేవతలు, దేవుళ్ల ప్రత్యక్ష పర్యవేక్షణలో మత పెద్దల పూర్తి ఆమోదంతో ఎవరికి చెందని స్త్రీలను కళాత్మకంగా దోచుకునే దుర్మార్గాలు. అలాగే ప్రతి మహిళని వారి కుటుంబాలకు ఆవల పీక్కుని తినే క్రూర సాహసకృత్యాలు పురుషులకు సమాజంలో అందుబాటులో ఉన్నాయి. వారి వేట విజయవంతం అయితే సాధారణంగా అది మళ్ళీ మహిళ తప్పే అవుతుంది.

సాంప్రదాయక ఆలోచనాపరులకు ఈ ప్రేమ అనే అంశం చాలా ప్రమాదకరమైన భావోద్వేగం. అది మరొక జీవిలోని సుఖంతో సంబంధం కలిగి ఉంటుంది; వారికి చిరపరిచితమైన తమకు ఆమోదనీయమైన సామాజిక సంబంధాలకు ఆవల మాత్రమే అది వృద్ధి పొందుతుంది. కనుక సంతోషాతిశయంతో ప్రేమలో జీవించే జంటను చూసినప్పుడల్లా వారి సాంప్రదాయక మెదడు కోపంతో రెచ్చిపోతుంది. ఎందుకంటే తమ నిషిద్ధ ప్రపంచంలో ఎప్పుడోకప్పుడు వారు అనుభవించిన ఏ కాస్త ప్రేమ అయినా జారత్వంతో ముడిపడి ఉంటుంది గనుక. మీరు పెళ్లాడిన ‘మంచి క్రమశిక్షణతో పెరిగిన’ అమ్మాయి ప్రేమకు సంబంధించిన ఎటువంటి జ్ఞానాన్ని కలిగి ఉండకూడదు. ఒక మహిళలోని ఆ జ్ఞానం పురుషుడి ఆధిపత్యానికి సవాలుగా పరిణమించే స్వతంత్రతా చైతన్యాన్ని ప్రతిబింబిస్తుంది మరి!

ఒకరి ఉనికికి ప్రమాదంగా మారగల కారణంతో కాకుండా మరే ఇతర కారణంతో అయినా మన సొంత రకం జీవిని

చంపడం అన్నది స్వజాతి విధేయతా సూత్రాలకు విరుద్ధం. మానవులుగా మనం మరొకరిని చంపటానికి తప్పనిసరిగా సంశయించాలి. కానీ భారత దేశంలో ఇతర నమ్మకాలకు, ఇతర కులాలకు లేదా ఇతర భాషలకు చెందిన వారిని "కుటుంబ గౌరవాన్ని కాపాడుకునే" పేరుతో చంపి పారేసే ఘటనలు, చిత్రహింసలు పెట్టే ఘటనలు ప్రతి రోజూ జరిగిపోతున్నాయి.

వివిధ ప్రజా సమూహాల మధ్య తేడాలు సృష్టించడానికి మానవ నాగరికత రంగు, భాష, దేవుళ్లు లేదా నడవడికలను బాగా దుర్వినియోగపరిచింది. ఇలాంటి బూటకపు జీవవిభిన్నతను సృష్టించే క్రమంలో మన సొంత (మానవ) జాతీయుల మధ్య ఉండవలసిన ప్రాథమిక విధేయతను ధ్వంసం చేసుకుని అగౌరవ పరిచే కృత్రిమవిభజనలను, విభిన్నతలను మనం సృష్టించుకున్నాం.

కుల వ్యవస్థ అటువంటి బూటకపు జీవ విభిన్నతకు ఒక తుచ్ఛమైన ఉదాహరణ. మానవులు వివిధ జాతులు, తెగలు, రంగుల విభేదాలకు అతీతంగా ఉమ్మడిగా నివసిస్తూ పునరుత్పత్తి చేసుకోగలరు. ఎందుకంటే మనం అంతా మానవులమే గనుక. మన వృత్తులు లేదా నమ్మకాలు ఏకమైనప్పటికీ మనం అందరం అంతిమంగా మానవ కుటుంబానికి చెందిన వాళ్లం. సామాజికంగా సాంస్కృతికంగా (కృత్రిమంగా) తయారు చేయబడిన మరియు రుద్దబడిన అటువంటి బూటకపు జీవ విభిన్నతలు ప్రజలు తామున్న దోపిడీ మూసలను, వివక్షలనూ బద్దలు కొట్టుకుని బైట పడకుండా నిరోధిస్తాయి.

భారతదేశ యువత ఇలాంటి విభజనల ఉడుం పట్టు నుండి బైట పడుతూ మరింత మానవీయంగా తయారవుతున్నారు. సామాజిక నిబంధనల సరిహద్దులను అధిగమిస్తూ నచ్చిన వ్యక్తిని ప్రేమిస్తున్న వాస్తవమే అందుకు ప్రబల సూచిక. ప్రేమించగల సామర్థ్యమే తనకు తాను వారిని మరింత వివేకవంతులుగా మరింత సహానుభూతిపరులుగా తయారు చేయడం, ఒక ఆరోగ్యవంతమైన లక్షణం కూడా. తద్వారా వారు పాత నిర్మాణాలను, సాంప్రదాయాలను సంపదలు పోగేయడానికి వంశ వృక్షంలోని జన్యు వారసత్వంతో కూడిన కఠిన వ్యవస్థ ద్వారా ఆ సంపదలు తామే అనుభవించగల హక్కు సంక్రమింప జేసుకోవటానికే ఈ నిర్మాణాలు సాంప్రదాయాలు రూపొందించ బడ్డాయి. పరిరక్షించుకోవాలని తపిస్తున్న శక్తుల సామాజిక, రాజకీయ ఆటలకు అతీతమైన దృక్పథాన్ని నిర్మించుకుంటున్నారు.

ఈ ప్రాథమిక లక్ష్యాన్ని సమర్థించుకునేందుకు కుటుంబ గౌరవం మరియు వారసత్వ స్వచ్ఛతల పేరుతో ఒక విస్తృతమైన సాంస్కృతిక మాయా నాటకాన్ని దాని చుట్టూ నిర్మిస్తున్నారు. ప్రతి ఒక్కరూ మరియు ప్రతి ఒక్కటీ –స్త్రీలు, పిల్లలు, దేవుళ్లు, నమ్మకం, మతాచారాలు– ఈ ప్రబల, ప్రాథమిక లక్ష్యానికి లోబడి ఉండేవే. ధనిక కులాలు మరియు వర్గాల శక్తివంతమైన సాంస్కృతిక సర్వాధిపత్యం మిగిలిన సమాజంపైన తన మాయా వలను విసిరింది. పేదలు, భ్రష్టులు సైతం వారి సాంస్కృతిక మాయాజాలాన్ని మరింత స్థిర చిత్తంతో అనుసరించి అమలు చేయటానికి సిద్ధపడుతున్నారు.

ప్రపంచ నాయకత్వానికై అర్రులు చాస్తున్న 21వ శతాబ్దపు ఇండియా ఇది. ప్రేమించడం ఎలాగో మర్చిపోయిన ఇండియా ఇది. ప్రధానంగా ఉన్నత తరగతి / ఉన్నత కుల ఆధిపత్యాన్ని కాపాడుకునే లక్ష్యంతో "రోమియో–వ్యతిరేక దళాలు" మరియు "లవ్–జిహాదిస్టు వ్యతిరేకులు" యువకులపై ఒత్తిడులు తెచ్చి తిరిగి తమ వర్గ, కుల, సమాజ, కుటుంబ పరిధుల్లోకి తెచ్చుకుంటు న్నారు. కేవలం ముక్కలు చెక్కలు అయిన అటువంటి నేల పైనే 'ప్రజల మధ్య విభజన చిచ్చు పెట్టి లబ్ది పొందే' రాజకీయాలు వృద్ధి చెందగలవు.

మన చుట్టూ ఉన్న ప్రేమను నాశనం చేయటానికి స్వయం–ప్రకటిత ధర్మ పరాయణ కాపలాదారుల హింసను మౌనంగా చూస్తూ ఉండటం ద్వారా మనమే పరోక్షంగా ఆమోదిస్తున్నామా? లేక మన చిన్న సామ్రాజ్యాలు నిరంతరాయంగా కొనసాగేలా చూస్తున్న శక్తుల పదాతి సైనికులుగా పని చేస్తున్న కాపలాదారులను మన చేతికి మట్టి అంటకుండా ఉండే లక్ష్యంతో మనం మౌనంగా ఉన్నామా? ఇక్కడ ఒక చచ్చిపోయిన కొడుకు అక్కడ ఒక చచ్చిపోయిన కూతురు జబ్బున పడ్డ అగ్ర రాజ్యం చెల్లించవలసిన ఒక చిన్న మూల్యమా? ❑

# భిన్నత్వంలోనే భారతీయత మూలాలు



అనువాదం : కొండూరి వీరయ్య

- రొమిల్లా థాపర్

నిజమైన భారతీయత మూలాలు క్రీస్తు పూర్వం నాటి నుండీ ఉనికిలో ఉన్న సాంస్కృతిక భిన్నత్వంలోనే ఉన్నాయి. కానీ, ఇప్పుడు మనముందున్న పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నాయన్న వాస్తవాన్ని మనం గుర్తించాలి. సహేతుకమైన ఆధారాల తార్కిక, శాస్త్రీయ విశ్లేషణ మదింపు ద్వారా మాత్రమే ఏ దేశపు గతాన్నైనా తవ్వి తీయటం, అధ్యయనం చేయటం సాధ్యమవుతుంది. గతం గురించి తలెత్తే ప్రశ్నలకు ఒకే రకమైనవో ఒక్క ప్రశ్నకు ఒక్క సమాధానంగానో నిర్ధారించుకోలేని ప్రశ్నలు. సమకాలీన చారిత్రక పరిశోధకులు ఆర్య జాతి ఉనికి గురించిన చర్చను పదేపదే ముందుకు తెస్తున్నందున ఈ ప్రశ్నకున్న మూలాలు, నేటి ఏ సందర్భంలో ఈ ప్రశ్న మరోసారి ప్రాధాన్యత పొందిందో లోతుగా పరిశీలించాలి. ప్రస్తుతం రెండు పరస్పర భిన్నమైన కోణాల్లో భిన్న లక్ష్యాలు సాధించే ఉద్దేశ్యంతో ఈ చర్చను ముందుకు తెస్తున్న విషయం పట్ల అప్రమత్తంగా ఉండాలి. 19వ శతాబ్దంలో సంస్కృత భాషలో ఉన్న భారతీయ రచనలను అధ్యయనం చేస్తున్న యూరోపియన్ మేధావులకు సంస్కృతభాషకు యూరోపియన్ భాషలకు మధ్య సారూప్యత ఉన్నట్లు కనిపించింది. సంస్కృతం మధ్య ఆసియా ప్రాంతంలో పుట్టి భారతదేశానికి ప్రయాణించి ఇక్కడ స్థిరపడిపోయింది. తొలినాటి భారతీయ ఆర్యులకు, యూరోపియన్ ఆర్యులకు మధ్య జన్యుపరమైన సంబంధం ఉండవచ్చన్న అభిప్రాయం చలామణిలో ఉండేది. ఆర్య అన్న పదం భాషకు సంకేతంగా మారిందే తప్ప జాతికి కాదు.

క్రీస్తు పూర్వం రెండో సహస్రాబ్ది తొలినాళ్లలో పచ్చికబయళ్ల కోసం కానీ లేదా పర్యావరణ కారణాల రీత్యా గానీ మధ్య ఆసియా ప్రాంతం నుండి మొదలైన వలసలు రెండు స్రవంతులుగా ప్రయాణించాయి. ఓ స్రవంతి ఇరాన్ వైపు వలస వెళ్తే మరో భాగం పశ్చిమ భారతం వైపు వలస వచ్చారు. ఈ వలసల గురించి ఇరాన్ భాషలో వెలువడిన గ్రంథం అవస్తలో వివరంగా ప్రస్తావించారు. ఇరానియన్ ఆర్యులు, ఇండో ఆర్యుల మధ్య భాషాపరమైన సామ్యం ఉండేది. రెండు బృందాల అక్షరమాల దగ్గర దగ్గరగా ఉండేది. వలసపాలన నాటి మేధావులు పూర్వకాలం నాటి వేద సంస్కృతి పశువుల కాపర్లతో స్థిరీకరించబడిన ఆర్య సంస్కృతి ఒక్కటేనని భావించారు. మాక్స్ ముల్లర్ కూడా ఇదే వాదనను ముందుకు తెచ్చాడు. కల్నల్ ఆల్కాట్ వంటి వారు కూడా వేదాలతో మొదలు పెట్టి హిందూయిజం వరకూ అనూచానంగా సంబంధం ఉందని వాదించారు. ఇందులో భాగంగానే ఆర్యసమాజ్ వంటి సంస్థల ద్వారా ఆర్యుల సంస్కృతిని ప్రచారం చేయటానికి కృషి జరిగింది. అయితే 1920 దశకం నాటి తవ్వకాల్లో ఆర్యుల నాగరికతకు సుమారు వేయి సంవత్సరాల పూర్వమే భారతగడ్డపై ఉనికిలో ఉన్న సింధు నాగరికత వెలుగులోకి రావటం భారతదేశం అంటే ఆర్యావర్తమేనన్న వాదనకు సవాలు విసిరింది.

1920 నాటి పురావస్తు ఆవిష్కరణల ప్రాధాన్యతను మరుగు పరుస్తూ ఆర్యులే భారతీయ మూలవాసులు అన్న వాదనను నిరూపించే ప్రయత్నమే 1930 దశకంలో హిందూత్వ చరిత్రకు తొలిపునాదులు వేసింది. భారతీయతకు, హిందూత్వానికి ఇండో ఆర్యన్ నాగరికతే పునాదన్న వాదనతో పాటు భారత దేశ చరిత్ర హిందూ, ముస్లిం ధార్మిక స్రవంతుల మధ్య జరిగిన ఘర్షణ చరిత్రే అన్న వాదన కూడా ఈ పునాదులు బలోపేతం కావటానికి దారి తీసింది. గత యాభై ఏండ్లుగా ఈ రెండు సిద్ధాంతాల డొల్లతనాన్ని చరిత్ర పరిశోధకులు రుజువు చేస్తూనే ఉన్నారు. అందువల్లనే హిందూత్వవాదులు నిర్మించబూనుకున్న భారతదేశ చరిత్రకు, చరిత్ర పరిశోధకులు నిర్మించిన భారతదేశ చరిత్రకు మధ్య పొసగని వైరుధ్యం నెలకొంది. వైదిక రచనలు ఈ అధ్యయనానికి కేంద్రంగా ఉన్నాయి. అయితే కాలక్రమంలో అనేక నూతన ఆధారాలు, చరిత్ర పరిశోధనా పద్ధతులు అందుబాటులోకి రావటంతో మొత్తం చరిత్ర పరిశోధన తీరుతెన్నులు కొత్త పుంతలు తొక్కాయి. గతంలో ఏమి జరిగి ఉండొచ్చు అన్న ప్రశ్నకు వినూత్న సమాధానాలు ముందుకొచ్చాయి.

భౌగోళిక శాస్త్రం, పురావస్తు పరిశోధనలు, భాషా శాస్త్రం, జన్యునిర్మాణ శాస్త్రం వంటి రంగాల్లో సాగుతున్న ఆధునిక పరిశోధనలు, ఆవిష్కరణలు ప్రాచీన భారత చరిత్ర గురించిన హిందూత్వ ప్రాజెక్టును నిరంతరం సవాలు చేస్తున్నాయి. భౌగోళిక విస్తృతి రీత్యా చూస్తే వైదిక నాగరికత కంటే హరప్ప నాగరికత విశాల భూభాగంలో విస్తరించి ఉంది. హరప్ప కాలం నాటి నివాసాలు, నిర్మాణాలు ఉత్తరాన పామీర్ ముడి మొదలు దక్షిణ భారతం వరకూ, ఓమాన్, బలూచిస్తాన్ వరకూ విస్తరించిందని ఈ పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. హరప్ప వాసులు మెసొపటేమియా వాసులకు రాగి వంటి ఖనిజ వనరులు రవాణా చేసినట్లు ఆధారాలున్నాయి. కానీ వేద సంస్కృతికి నేటి ఆఫ్గనిస్తాన్ – పంజాబ్ మొదలు తూర్పున ఉన్న గంగానదీ పరివాహక ప్రాంతానికి సాగిన వలసలను మాత్రమే ప్రస్తావిస్తుంది. అంటే రుగ్వేద రచయితలకు డోవాబ్ ప్రాంతానికి అవతల ఉన్న ఇరాన్ ఇరాక్ ఓమాన్ ప్రాంతాల గురించి తెలీదు. కానీ అంతకు పూర్వమే ఉనికిలో ఉన్న హరప్ప నాగరికులకు ఈ ప్రాంతంతో ఆర్థిక సాంస్కృతిక లావాదేవీలున్నాయి.

చరిత్ర పరిశోధన మూలవనరుగా భాషా శాస్త్రం పోషించిన పాత్ర తెలుసుకోవటానికి వేదాల్లో ప్రయోగించిన భాష, వర్ణించిన క్రతువులను పరిశోధకులు పరిశీలించారు. భాష, పద ప్రయోగం, వ్యాకరణాల గురించి కూడా అధ్యయనం జరుగుతోంది. వైదిక సంస్కృతం పవిత్రమైన భాషగా గుర్తింపు పొందటంతో 20వ శతాబ్దం ఆరంభం వరకూ భాషా శాస్త్ర ప్రమాణాలకు సంస్కృతం దూరంగా ఉంది. కానీ 20వ శతాబ్ది ఆరంభం నుండీ ఈ ప్రమాణాలు సంస్కృతానికి కూడా వర్తింప చేయటంతో వేదకాలం నాటి సంస్కృతం కూడా సమకాలీన భాషల్లాగానే ఉనికిలోకి వచ్చిన సాధారణ భాష అని తేలిపోయింది. ద్రవిడ భాషలు అధ్యయనం చేసినా సంస్కృతం గురించి కూడా అవగతమవు తుంది.

వేదాల్లో ద్రవిడ భాషకు సంబంధించిన పద ప్రయోగం కూడా కనిపిస్తుంది. ఈ వివరాలన్నీ పరిశీలిస్తే ఇతర సంస్కృతి, జీవన శైలిలను ప్రస్తావించటానికి దస్య, అసుర వంటి పదాలు, దాసవర్ణాలు వంటి పద ప్రయోగం చేశారు. దాసులు దేవుడిని పూజించరు. ఇండో ఆర్యన్ భాషను పలికేటప్పుడు అపశృతులు ఉంటాయి. కాలక్రమంలో దస్యుల్లో సంపన్నులను ఆర్యుల్లో విలీనం చేసుకోవటం మొదలైంది. దీనికి సంబంధించిన అనేక ఉదాహరణలు ఐతరేయ బ్రాహ్మణ గ్రంథంలో కనిపిస్తాయి.

ఇదే తరహాలో పురావస్తు శాస్త్ర పరిశోధనలు కూడా అనేక విషయాలను ముందుకు తెస్తున్నాయి. హిందూత్వ వాదులు చెప్తున్నట్టు భారతదేశం కేవలం హిందూయిజం, హిందూ సంస్కృతి మాత్రమే భారతదేశపు గతం కాదనీ, భారతదేశంలో భాష, సంస్కృతి, జీవనశైలి, ఆహార వ్యవహారాలు వంటి విషయాల్లో వైవిధ్యం, బహుళత్వం, భిన్నత్వం క్రీస్తు పూర్వం మూడో శతాబ్ది నాటికే ఉనికిలో ఉన్నాయని రుజువు చేసే పరిశోధనా ఫలితాలు విస్తృతంగా అందుబాటులోకి వస్తున్నాయి. వీటన్నింటి సారాంశం ఆర్యులు భారతీయులు కాదన్నదే. కానీ ఆర్యులు భారతీయులు కాకపోతే హిందూత్వ ప్రాజెక్టు పునాదుల్లోనే కకావికలమవుతుంది. పైన ప్రస్తావించిన చారిత్రక పరిశోధనలు, శాస్త్ర సాంకేతిక విశ్లేషణలు, జన్యు అధ్యయనాలు ఆర్యులు బయటి ప్రాంతం నుండి వలస వచ్చారని నిస్సందేహంగా రుజువు చేస్తున్నాయి. ఏ దేశపు గతమైనా సరళ రేఖ కాదు. ఏకైక సాంస్కృతిక జీవనం కాబోదు. భిన్న సంస్కృతులు, జీవన శైలులు, క్రతవులు, ఇరుగుపొరుగు ప్రాంతాల (దేశాల)తో ఆర్థిక సాంస్కృతిక వాణిజ్య లావాదేవీల కలబోతలోనే గతం నిండి ఉంటుంది. కానీ ఈ కీలక వాస్తవిక పునాదిని గుర్తించ నిరాకరిస్తోంది హిందూత్వ. హిందూత్వ రాజకీయ కార్యక్రమానికి అనుకూలమైన విషయాలను చరిత్ర పేరుతో సోషల్ మీడియా మొదలు టీవీ సీరియళ్ల వరకూ, పాఠశాల బోధనాంశాల వరకూ ఇష్టం వచ్చినట్లు ఊహాజనిత విషయాలతో నింపటానికి ప్రయత్నం జరుగుతున్నది. దీన్ని ప్రశ్నించకుండా నిజమైన చరిత్రను భావితరాలకు అందించలేము. ఈ అడ్డగోలు వాదనలను ప్రశ్నించటం దేశద్రోహం కానేకాదు. ఈ దేశాన్ని లౌకిక ప్రజాతంత్ర సమాజంగా కాపాడుకోవాలంటే రంగురంగుల పోస్టులు, పోస్టర్లు, పొతాల మరుగున పడిన నిజమైన చరిత్రను తవ్వి తీయటమే చరిత్ర పరిశోధన లక్ష్యంగా ఉండాలి. ❑

(ప్రఖ్యాత చరిత్ర కారుడు ఇర్ఫాన్ హబీబ్ 90వ జన్మదినోత్సవం సందర్భంగా రొమిల్లా థాపర్ ప్రసంగ పాఠం)



# సాహితీ వైజ్ఞానికుడు దేవరాజు మహారాజు

డా.ప్రసాదమూర్తి

దేవరాజు మహారాజు రేపు తెలంగాణ సారస్వత పరిషత్తు ఇచ్చే దేవులపల్లి రామానుజరావు పురస్కారాన్ని అందుకుంటు న్నారు. రుషి వంటి రాజు ఈయన. తన వయసుకు మించి పుస్తకాలను ఎప్పుడూ రాసుకుంటూ సమాజాభ్యుదయమే తన అభ్యుదయంగా భావించేవారు. తెలంగాణ రత్నాలలో ఈయనొక రత్నం. ఈ సందర్భంగా నేను రాసిన వ్యాసం ఆదివారం ఆంధ్రజ్యోతి ఎడిట్ పేజిలో వచ్చింది. చూడగలరు. ప్రచురించిన ఎడిటర్ శ్రీనివాస్ గారికి ధన్యవాదాలు.

"ఇన్ని వేల సమాధుల్లో
ఏ ఒక్కటి తెరిచినా
ఒక రచయిత తన ఆలోచనలతో
సజీవంగా బయటకు వస్తాడు
మూయగానే
గతంలోకి, తన నిర్ణీత కాలంలోకి
చటుక్కున పోయి నిల్చుంటాడు
నిశ్శబ్దంలో సమాధుల మధ్య
కూర్చున్నట్టుంది,
ఈ లైబ్రరీ లో
పుస్తకాల మధ్య కూర్చుంటే.."

ఇలా సజీవ పుస్తకాల మధ్య కూర్చుని తన లోకంలో తానే ఉంటూ, తన అన్వేషణ తానే సాగిస్తూ ఒక రాజు గారు రుషిలాంటి జీవితం గడుపుతున్నారు. పలకరిస్తే చిరునవ్వుతో స్వాగతిస్తారు. కదిపితే తన లోపలి సాహిత్య సామాజిక శాస్త్రీయ దృక్పథాల సుగంధాలతో మనల్ని ముంచెత్తుతారు. సన్మానాలంటే చూద్దాంలే అంటారు. అవార్డుల గురించి మాట్లాడితే మనకెందుకులే అంటారు. సర్కారు సభలు అంటే దూరంగా ఉంటారు. ఏలికలతో వచ్చే లాభాల కంటే మోయాల్సిన భారాలే కష్టమని స్పష్టంగా చెబుతారు. ఆయనే దేవరాజు మహారాజు గారు. తెలంగాణ వీణలో రత్నాలుగా ఒదిగిన ఎందరో సాహితీవేత్తలు, మేధావులు, సామాజిక వైజ్ఞానికవేత్తలలో ఈయన కూడా ఒక మరపురాని రత్నమే. చదువుకున్నది జీవశాస్త్రమే గాని దానితోపాటు మానవ జీవన శాస్త్రాన్ని కూడా అధ్యయనం చేయడం తన జీవితంలో ఒక భాగంగా చేసుకున్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 30 సంవత్సరాల పైగా ప్రొఫెసర్‌గా, వృక్ష పరాన్నజీవులపై పరిశోధనలు చేస్తూ, విద్యార్థులతో పరిశోధనలు చేయిస్తూ, అదే సమయంలో సమాజంలో కూడా పరాన్న ఘరానా జీవులను కూడా అధ్యయనం చేశారు. తనకు తెలిసిన, తాను చదివిన శాస్త్ర జ్ఞానాన్ని సమాజ శాస్త్రానికి అన్వయించి, దానికి సాహిత్యపరిమళాన్ని మేళవించి ఒక అపురూప విజ్ఞాన సర్వస్వంగా తనను తాను మలచుకున్న ప్రొఫెసర్ గారు మన దేవరాజు మహారాజు. ఆయనను చూస్తే ఎవరికైనా మనసు నిర్మలమవు తుంది. ఆయన ఫ్రెంచి గడ్డం లోపల నుంచి సన్నగా నవ్వినపుడు ఆ నవ్వు మీద ఆయన కళ్ళల్లోని తాత్వికమైన కాంతి పడినప్పుడు ఎదుటి వారి హృదయం ఒక మార్మికమైన తాదాత్మ్యతకు గురవుతుంది. ఆయనతో రాజకీయాలు సంభాషించినప్పుడు దేశ, ప్రపంచ రాజకీయాల పట్ల ఆయనకున్న లోతైన అవగాహన తెలుసుకుని మనము నివ్వెరపోతాం. పాలకులే మూఢనమ్మకాల అంధవిశ్వాసాల వాహకాలయినప్పుడు జ్ఞానవంతుడు మౌనంగా ఉండకూడదని ఆయన మనకు మౌనంగానే చెప్తారు. శాస్త్ర విజ్ఞానాన్ని మానవ సమూహాల్లో విస్తృతంగా ప్రచారం చెయ్యక పోతే మనిషి అంధ యుగాల వైపు తిరోగామిస్తాడని ఆయన అంటారు. అందుకే మూఢనమ్మకాలను, అశాస్త్రీయ విధానాల అపసవ్య పోకడలు అన్నింటినీ ఖండిస్తూ ఆయన రాసిన వందలాది వ్యాసాలు ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో విస్తృతంగా ప్రచారంలో ఉన్నాయి. ఇంత చేసి ఎక్కడా ఏ హడావుడీ హంగామా వుండదు. చేయాల్సిన పనిని నిశ్శబ్దంగా చేసుకుంటూ పోవడమే మన పని అని ఆయన నిశ్శబ్దంగానే చెప్తారు. ఆయన దగ్గర కూర్చుని సినిమాల గురించి మాట్లాడితే, ఒక దాశరథి గురించో.. ఒక సాహిర్ లూధ్యాన్వి గురించో.. ఒక కబీరు గురించో.. ఒక లతా మంగేష్కర్ గురించో.. ఒక సత్యజిత్‌రే గురించో మనం ప్రస్తావన తీసుకు వస్తే, ఇక ఆయనే ఆకాశమంత వెండితెరగా మారిపోయి విశ్వ సినిమా రహస్యాలన్నీ మనకు చూపిస్తారు. ఒక పాట గురించి ముచ్చటిస్తే, హిందీ, తెలుగు పాటలు చరిత్రంతా మన ముందు తెరిచి ఉంచుతారు. ఆయన సహచరి కృష్ణకుమారి మంచి గాయని. ఆమె కోసం పాటలు రాసి, వాటి మర్మాలు చెప్తారు.

ఎప్పుడైనా ఒక కవిత్వం గురించో ఒక కథ గురించో ఆయనతో సంభాషణకు దిగితే, తెలుగు, హిందీ, ఉర్దూ, ఇంగ్లీషు భాషా సాహిత్యాలలో ఉన్న గొప్ప గొప్ప కాంతి గోళాలను మన ముందు తిప్పి వాటి చుట్టూ మనల్ని తిప్పుతారు. అందుకే ఆయన కవిత్వంలో చెప్పాలనుకున్నది కవిత్వంలోనే చెప్పారు. కథలో చెప్పాలనుకున్నది కథల్లో చెప్పారు. భారతీయ భాషల నుంచి ఇంగ్లీషు నుంచి కొన్ని అపురూపమైన పుస్తకాలను మన తెలుగు వారి కోసం చక్కగా అనువదించారు. నాటకాల రూపంలో నాటికల రూపంలో వ్యాసాల రూపంలో ఎక్కడెక్కడ ఏయే రూపంలో మన తెలుగు వారిని వెలుగు లోకాల వైపు నడిపించ డానికి వీలవుతుందో ఆ రూపాలనన్నింటినీ ఆయన మన ముందుంచారు. దాదాపు 80కి పైగా పుస్తకాలు రచించారు. కథలు, కవిత్వాలు, సాహిత్య విశ్లేషణ, శాస్త్రీయ సామాజిక అంశాలపై విశ్లేషణ పుంఖానుపుంఖాలుగా మన ముందుంచారు. అయినా ఎక్కడా ఆయనలో నామమాత్రం కూడా పేరు కోసం, కీర్తి ప్రతిష్ఠల కోసం, భుజకీర్తులూ పదవుల కోసం ఆత్రం కనిపించదు. బహుశా అందుకే ఇంత కృషి చేయగలిగారేమో.

పాత వరంగల్ జిల్లా కోడూరు గ్రామంలో ఆయన 70 సంవత్సరాల క్రితం ఫిబ్రవరి 21, 1951లో జన్మించారు. గడచిన ఫిబ్రవరి నెలలో ఆయన సప్తతి అంగరంగ వైభవంగా జరగాల్సి ఉంది. కానీ ఎవరికీ తెలియకుండానే ఫిబ్రవరి 21వ తేదీ కాలగర్భంలో కలిసిపోయింది. 2011లో 'ఆవరణం' సాహితీ వజ్రోత్సవ సంచిక వచ్చింది. 80 మంది ప్రముఖులు రాజు గారి గురించి రాసిన వ్యాసాలతో వచ్చిన సంచిక అది. ఆయన రిటైరై పదేళ్లయినా ఈ క్షణం వరకు ఆయన తన విశ్రాంత జీవితాన్ని విశ్రాంతిగా గడపలేదు. ఈ పదేళ్ల కాలంలో సృష్టించిన వైజ్ఞానిక వ్యాసాల సృష్టి, సాహిత్య కృషి అనన్యసామాన్యమైనదిగా చెప్పాలి. ఆయన వ్యాసం లేని రోజు ఉండదు. ఏదో ఒక పత్రికలో ఏదో ఒక వెబ్‌సైట్లో రోజూ దేవరాజు గారి ఆలోచనలతో నిండిన, మానవ సందేశంతో కూడిన వ్యాసం ఉండాల్సిందే. ఈ పదేళ్లలో ఆయన సాహిత్య కృషి ఎంత పెరిగిందో ఆయన చుట్టూ ఏదో తెలియని నిశ్శబ్దం కూడా అంతే కనిపిస్తుంది. బహుశా ఏ ఆర్భాటాలకు, ప్రలోభాలకు లొంగని తత్వమే కారణం కావచ్చు. దాదాపు 15 కవితా సంపుటాలను ఆయన ప్రచురించారు. ఎనిమిది పైగా కథల సంపుటాలు వెలువరించారు. ఆయన మొదటి కవితా సంపుటి 'గుడిసె గుండె' తెలంగాణ ప్రజల భాషలో తొలి కవితా సంపుటిగా పలువురు పేర్కొంటారు. ఈ విషయాన్ని సాహిత్య అకాడెమీ వారు కూడా ప్రస్తావించారు.

మీ పెద్ద పెద్దోల్లంతా
నా లెక్కనే ఏషాలు గడ్తరని
నా లెక్కనే పల్కులు పలుక్తరని
నాకేమెర్క గులాపోన్ని
నన్ను బట్టుక తంతరు?
మా కుల వృత్తయ్యా ఇది
మేం బయిరూపులోల్లం

ఇలా ఎప్పుడో 1974లోనే ఆయన రాసిన 'గుడిసె గుండె' అనే కవితా సంపుటిలో తెలంగాణ జనసామాన్య భాషను తన కవిత్వ భాషగా ఆవిష్కరించారు. 'గాయపడ్డ ఉదయం', 'నీకూ నాకూ మధ్య ఓ రంగుల నది', 'రాజముద్ర',' కాలాన్ని వెనకేసిన మనిషి' మొదలైన కవితా సంపుటాలలో దేవరాజు గారు, కవిత్వ వ్యక్తీకరణలో తన మంచు కడిగిన ముత్యంలాంటి ఆత్మను నిక్షిప్తం చేశారు. అలాగే ఆయన 1977లో వెలువరించిన 'కడుపుకోత' కథాసంపుటి కూడా తెలంగాణ ప్రజల భాషలో వచ్చిన తొలి కథా సంపుటిగా చాలా మంది పేర్కొంటారు.

ప్రయో'జన' పేరు మీద ఆయన వెలువరించిన భారతీయ సమాంతర సినిమా పరిశీలనలు, సినిమా ప్రేమికులు సినిమా రంగ ప్రముఖులు తప్పనిసరిగా చదవాల్సినవి. ఇక ఆయన పాపులర్ సైన్స్ ను తెలుగు లోకంలోకి తీసుకు వెళ్ళిన తీరుతెన్నులు తెలుగునాట మరో మేధావి ఎవరూ చేయలేదు అంటే అతిశయోక్తి కానే కాదు. సైన్సును పురాణాల్లో చూపిస్తూ ఊరేగే ఉత్సవ విగ్రహాల రాజకీయాల సంరంభం నడుమ ఆయన ప్రజలను నిజమైన శాస్త్రీయ పథం వైపు నడిపించడానికి నడుం కట్టిన తీరు అసామాన్యమైనది. 1991 నుంచి దేవరాజు గారి సైన్సు ప్రచార సమరం సాగుతూనే వుంది. ఎన్నో పాపులర్ ప్రచురణ సంస్థలు ఆ పుస్తకాలను ముద్రించడానికి పోటీ పడ్డాయి. 'భారతీయ వైజ్ఞానిక వికాసం', 'మూఢనమ్మకాలు– సైన్స్' , 'విజ్ఞాన పథంలో విజయ ఘట్టాలు', 'మా'నవ'వాదం– జీవన నినాదం', 'జీవ పరిశ్రమలు' మొదలైన ఎన్నో పుస్తకాలతో దేవరాజు గారు తెలుగు జాతిని చైతన్యం చేసే పని పెట్టుకున్నారు. సైన్సు పరిజ్ఞానాన్ని కూడా సొంత లాభానికి కుదించి పబ్బం గడుపు కోవాలనుకొనే వారికి ఈ పుస్తకాలు సింహ స్వప్నాలు. ఇక ఆయన రాసిన సాహిత్య వ్యాసాలు తెలుగు సాహిత్య విద్యార్థులకు పాఠాలుగా నిలుస్తాయి. 'ఆధునిక యుగంలో జానపద సాహిత్యం', సాహితీవేత్తల పరిచయాలను చేస్తూ రాసిన' స్మృతి సుగంధం', 'స్త్రీ దరహాసం దోచిన ఇతిహాసం', 'తొలితరం స్త్రీవాదుల జీవిత

కథలు', 'ఆత్మ నుంచి అక్షరానికి', 'స్త్రీ అక్షరాలు శిలాక్షరాలు', 'భారతీయ రచయిత్రుల విజయకేతనం' మొదలైన వ్యాస సంపుటాలు ఆయన సాహిత్య అధ్యయనానికే కాక సాహిత్యంలో అనేక అస్తిత్వ ఉద్యమాల పట్ల ఆయనకున్న ప్రగాఢ సానుభూతిని కూడా వ్యక్తం చేస్తాయి. ఆయన రాసిన బాలసాహిత్యం కూడా తక్కువేమీ కాదు. ఇక అనువాదాలు కోకొల్లలు. హరివంశ రాయ్ బచ్చన్ 'మధుశాల'ను ఆయన తెలుగులో గేయ రూపంలో చేసిన అనువాదం చాలా గొప్పది. దేనికీ దేబిరించింది లేదు. కొన్ని అవార్డులు ఆయన్ని వరించి తప్పనిసరిగా తీసుకోవాలని మొహమాటం పెట్టినప్పుడు ఆయన కాదనలేదు. 94 లో దాశరథి దంపతుల సత్కారం లాంటివి, కొన్ని జీవన సాఫల్య పురస్కారాలు ఆయన అందుకున్నారు. మౌనం ఆయన ఆత్మ స్వభావం. జ్ఞానార్జన ఆయన సహజ లక్షణం. నిరంతరాయంగా నిశ్శబ్దంగా పని చేసుకుంటూ పోవడమే ఆయన ప్రవృత్తి.

ఇలా మౌనంగా తను నమ్మిన సిద్ధాంతాలను, శాస్త్రీయ విజ్ఞానాన్ని, సామాజిక చైతన్యాన్ని సాహిత్య స్పృహతో రంగరించి ఆయన నిరంతరం అనుక్షణం అక్షరమై తనను తాను ఆవిష్కరించు కున్నారు. విశ్వమే ఆయన గురువు, విశ్వమే ఆయన విద్యార్థి. ఇప్పుడు నడుస్తున్న చరిత్ర అంతా సోత్కర్షలు, ఆర్భాటాలు, శిష్యగణాల బృందగానాల చరిత్ర. కాబట్టి ఇలాంటి వారు అందరికీ కనిపించడం కొంచెం అరుదైన విషయమే అయినా తప్పదు కొన్ని కళ్ళు చూస్తాయి. కొన్ని చెవులు వింటాయి. అదిగో అలాంటి వారి కోసమే మహారాజు లాంటి వారు మౌనంగా తమ పని తాము చేసుకుంటూ పోతారు. ఇలాంటి సాహితీ వైజ్ఞానికులు నూటికో కోటికో వుంటారు. మన తెలుగు భాషలో ఇలాంటి ప్రొఫెసర్ గారు ఉండడం అది తెలుగువారు చేసుకున్న మహాభాగ్యం. ఎన్నో గౌరవాలు దక్కాల్సిన హక్కు ఉన్న కవి, రచయిత, మేధావి, సైన్స్ ప్రచారకుడు, విజ్ఞాన ఖని, నడిచే విశ్వవిద్యాలయం లాంటి రాజు గారికి ఇప్పుడు తెలంగాణ సారస్వత పరిషత్తు, దేవులపల్లి రామానుజరావు సాహిత్య పురస్కారాన్ని అందజేయబోతున్నట్లు తెలిసి సంతోషం కలిగింది. ఇలాంటి వారిని గౌరవించుకోవడం అంటే నిజమైన శాస్త్ర పరిజ్ఞానాన్ని, సామాజిక చైతన్యాన్ని, సాహిత్య సౌందర్యాన్ని తగిన రీతిలో సత్కరించుకోవడం లాంటిదే. మరిన్ని గౌరవాలు ఆయన పొందితే అది తెలుగు వారందరికీ నిజమైన గౌరవంగా భావించవచ్చు. ❑

( ఆగస్టు 24న డా.దేవులపల్లి రామానుజరావు పురస్కారం అందుకుంటున్న దేవరాజు గారికి అభినందనలతో)

## నల్ల నేరేడు నేతల ప్రతాప్

**(14వ పేజీ తరువాయి)**

ప్రతాప్ సాహచర్యం వల్ల కొంతవరకైనా తృణమూల స్థాయిని చేరుకుందనుకుంటాను.

అన్నం గిన్నె కవిత్వ సంకలనం స్వల్ప వ్యవధిలో ఏడెనిమిది పునర్ముద్రణలు పొందినపుడు, శ్రీశ్రీ మహాప్రస్థానం, తిలక్ అమృతం కురిసిన రాత్రి తర్వాత ఇన్ని ముద్రణలు పొందిన కవిత్వం లేదు అని నేను అన్నాను. అతిశయోక్తిలా ఉన్నా ఇది ఒక వాస్తవం. ఈ వాస్తవం వల్ల ప్రతాప్ స్థాయి శ్రీశ్రీతో, తిలక్‌తో సమానం అవుతుందని కానీ, కాదని కానీ నేననను. ప్రతాప్ అన్నం గిన్నె కవిత్వం దళితవాడల్లోకి వెళ్లింది. పుస్తక ప్రతుల్ని ఒకొక్కరూ పదుల సంఖ్యలో కొనుక్కుని తమ వారికి పంచుకున్నారు. కొన్ని చోట్ల చందాలు వేసుకుని పుస్తకాన్ని పునర్ముద్రించవలసిందిగా ఒత్తిడి తెచ్చి మరీ ప్రతులు పొందారు. అందులోని కవిత్వం పెద్ద పెద్ద కటౌట్లకు ఎక్కింది. ' ఆ విగ్రహాన్ని చూస్తే అన్నం గిన్నెను చూసినట్లుంటుంది – అన్నం గిన్నెలో ఆ విగ్రహమే కనిపిస్తుంది' అన్న వాక్యం అన్నం గిన్నెల్లోకి కవిత్వమై ప్రవహించింది. ఇది వాస్తవం.

నేను గాంధీని అభిమానిస్తాను. ప్రతాప్ అంబేద్కర్ వాది. నేను గాంధీని శ్లాఘిస్తూ కవిత్వం రాస్తే గాంధీ అంబేద్కర్‌ల మధ్య పోలిక తెస్తూ అంబేద్కర్ ఎట్లా గొప్పవాడో చెబుతూ కవిత్వం రాసి నాకే చూపించాడు. గాంధీ అంబేద్కర్‌ల మధ్య శతృత్వం చూపిస్తారు కొందరు. నేనంగీకరించను. అది నిజమైతే ప్రతాప్‌కూ, నాకూ స్నేహం ఎట్లా కుదురుతుందీ అనేది నా తర్కం.

ప్రతాప్ అందగాడు. అగ్రవర్ణ అహంకారాల మీద చెణుకులు విసిరి ముసిముసి నవ్వులు నవ్వుతున్నపుడు చూడాలి ఆ అందాన్ని. ప్రతాప్ నిగనిగలాడే అల్ల నేరేడు పండు. కొరికితే చిక్కని వంగపూరంగు లాంటి ఎర్ర జీరల ఊదా రంగు బయటపడే పండు. ఎంత ముగ్గినా వగరు వదలని పండు. అది పూర్తిగా ముగ్గక ముందే రాలిపోయింది. ❑

# వైజ్ఞానిక స్పృహ కోసం ఒక రోజు - 20 ఆగస్టు

**డాక్టర్ దేవరాజు మహారాజు**
సుప్రసిద్ధ సాహితీవేత్త, సైన్సు ప్రొఫెసర్



ప్రతి సంవత్సరం ఆగస్టు 20న మనదేశంలో 'నేషనల్ సైంటిఫిక్ టెంపర్ డే' ను జరుపుకుంటున్నాం. హేతువాది డాక్టర్ నరేంద్ర దభోల్కర్‌ను సనాతనవాదులు అన్యాయంగా 20 ఆగస్టు 2013న హత్య చేసినందుకు గుర్తుగా ఆయన జ్ఞాపకార్థం జరుపుకుంటున్నాం. డాక్టర్ నరేంద్ర అచ్యుత్ దభోల్కర్ కేవలం ఒక ఫిజీషియన్ మాత్రమే కాదు. ఒక రచయిత, ఒక సామాజిక కార్యకర్త కూడా! వైజ్ఞానిక దృక్పథాన్ని సమాజంలో వ్యాపింప జేయడానికి స్థిరచిత్తుడై మహారాష్ట్ర అంధశ్రద్ధ నిర్మూలన సమితిని 1989లో ప్రారంభించి, నిరంతరం కృషి చేస్తూ వచ్చిన మహోన్నతుడు. సమాజంలో అంధ విశ్వాసాల్ని తొలగించడానికి, జనంలో తిరుగుతూ జనాన్ని చైతన్యపరచడం నచ్చనివారు ఒక పథకం ప్రకారం ఆయనను మార్నింగ్ వాక్‌లో మట్టుబెట్టారు. అంధవిశ్వాసాలకు వ్యతిరేకంగా చట్టం తీసుకురావాలని ఆయన చాలా కాలం పట్టుబడుతూ వచ్చారు. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచారు. అది కొన్ని రాజకీయ పార్టీలకు నచ్చలేదు. భారతీయ జనతా పార్టీ, శివసేన పార్టీలు తీవ్రంగా ఆయన డిమాండ్‌ను వ్యతిరేకించాయి. ఎందుకంటే దాని వల్ల తమ సంస్కృతీ సంప్రదాయాలు దెబ్బ తింటాయని వారు భావించారు. సంస్కృతి, సంప్రదాయాల పేర గత కాలపు అవివేకాన్ని, అజ్ఞానాన్ని బతికించాలని చూసే వారికి వైజ్ఞానిక అవగాహన ఎలా ఉంటుందీ? ఎదుటివారికి ఇంకింత జ్ఞానం ఉంటే బాగుంటుందని మనం అనుకుంటూ ఉంటాం గానీ, వారికి ఇంగిత జ్ఞానవే ఉండదు - అలాంటప్పుడు, ఏం చేయగలం? పైగా పేరుకుపోయిన మూర్ఖత్వంతో రాజ్యాంగానికి వ్యతిరేకంగా వ్యవహరించడాన్ని ఎవరు హర్షిస్తారూ?

వైజ్ఞానిక స్పృహతో, మానవీయ విలువలు నిలుపుకుంటూ మసలుకోవడం ప్రతి భారతీయుడి కర్తవ్యమని రాజ్యాంగంలోని ప్రకరణ 15ఎ(హెచ్) ఉంది కదా? దానికి తగినట్టుగానే ఏ సైన్సు కార్యకర్త అయినా వ్యవహరిస్తాడు. మరి, ఇలా దుర్మార్గంగా చంపివేయడమేమిటి? 2013 నుండి ఈ రోజు వరకు దభోల్కర్ హంతకులెవరో ప్రభుత్వాలు పసిగట్టలేకపోయాయి. అంటే ఏమిటీ? ఏలిన వారి అండదండలతోనే దుండగులు ఆ పని చేశారని ఎంత తెలివిలేని వాడికైనా అర్థమౌతుంది! పైగా మరో గొప్ప విషయమేమంటే, దభోల్కర్ మరణం తర్వాత ఆయన పోరాడిన అంధవిశ్వాసాల వ్యతిరేక ఆర్డినెన్స్ (ANTI SUPERSTITION & BLACK MAGIC ORDINANCE) 29 సవరణలతో చివరికి 18 డిసెంబర్ 2013న మహారాష్ట్ర కేబినెట్ ఆమోదించింది. అయితే అది చట్టం కావాలంటే పార్లమెంట్ ఆమోదించాలి. డా. నరేంద్ర దభోల్కర్ చనిపోక ముందు 6 ఆగస్టు 2014న - 'ప్రగతిశీల భావాలు గల వారికి గడ్డుకాలం వచ్చిందని, అధికారంలో ఉన్న మంత్రులు సరిగా వ్యవహరించడం లేదని, అందుకే అంధ విశ్వాస వ్యతిరేక చట్టంపై అసెంబ్లీ చర్చ జరగడం లేదని' - ఆయన తన అసంతృప్తిని మీడియా ముందు వ్యక్తం చేశారు. ఆ తర్వాత కొద్ది రోజులకే ఆయన హత్య చేయబడ్డారు. హత్య జరిగిన మరునాడే మహారాష్ట్ర కేబినెట్ సమావేశమై ఆర్డినెన్స్‌పై ఆమోదముద్ర వేసింది. అంతే- అది అక్కడే, అలాగే ఉంది.

### ప్రజాబలం గొప్పది

డాక్టర్ నరేంద్ర దభోల్కర్, తర్వాత గోవింద్ పన్సారే, ప్రొఫెసర్ యం.యం. కల్బుర్గి, జర్నలిస్ట్ గౌరీ లంకేశ్‌లు వరుసగా హత్యలకు గురయ్యారు. అంటే ఏమిటి? ఎదిరించే వాళ్ళని బెదిరించే వాళ్ళు చంపేస్తూ రాజ్యాలేలుతుంటారనా? ఇన్ని హత్యల తర్వాత కూడా భావప్రకటనా స్వేచ్ఛ ఈ దేశంలో ఇంకా ఘోరంగా హత్య చేయబడుతోంది. మరి సామాన్యులేం చేయాలి? మరింత ధైర్యంగా ఉండాలి. మరింత హేతుబద్ధంగా ఆలోచించడం ప్రారంభించాలి. రాజ్యాంగ వ్యతిరేక చర్యలు ఎవరు చేసినా ఎత్తి చూపుతూనే ఉండాలి. ఎందుకంటే అధికారంలో ఉన్నవారి బలం కంటే ఎప్పుడైనా ప్రజాబలమే గొప్పది అనే విషయం గుర్తుంచు కోవాలి. ఈ అత్యాధునిక సమాజాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ మళ్ళీ పాత రాతి యుగంలోకి పోనివ్వద్దు.

పన్నెండేళ్ళు డాక్టర్‌గా ప్రజలకు సేవ చేసి దబోల్కర్ 1980లో సామాజిక సేవ వైపు దృష్టి మరల్చారు. అఖిల భారత అంధ శ్రద్ధ నిర్మూలన సమితి (ఏబీఏఎన్ఎస్)కు అనుబంధంగా మహారాష్ట్ర అంధశ్రద్ధ నిర్మూలన సమితి (ఎంఏఎన్ఎస్) కార్యక్రమాలు రూపొందించారు. తమకు తాము దేవుళ్ళమని ప్రకటించుకునే దొంగ బాబాల భరతం పట్టారు. సతార జిల్లాలో 'పరివర్తన్' అనే సేవా సంస్థను ప్రారంభించారు. మరాఠీ పత్రిక 'సాధన'కు సంపాదకత్వం వహించారు. ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రేషనలిస్ట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా పని చేశారు. 1990-2010 మధ్య కాలంలో దళితుల పట్ల వివక్ష ఉండకూడదని కుల నిర్మూలన సంఘాలతో కలిసి పని చేశారు. సామాజిక న్యాయం దొరకని వారి పక్షాన ఎప్పుడూ నిలబడ్డారు. అంధ విశ్వాసాల నిర్మూలనలో భాగంగా జనంలో మమేకమై మూడు వేలకు పైగా ఉపన్యాసాలిచ్చారు. ఆయన ఉపన్యాసం జనానికి కొత్త ఊపిర్లు ఊదేది. వినాలనుకునే వారికి ఆయన ఉపన్యాసాలు కొన్ని యూట్యూబ్‌లో దొరుకుతాయి.

## మార్నింగ్ వాక్ లో మట్టుబెట్టారు

ఆయన నిస్వార్థ సేవను గుర్తించాల్సింది పోయి, నేరుగా మనిషినే మాయం చేశారు. దబోల్కర్ స్వంత పట్టణమైన పుణెలో ఆయన మార్నింగ్ వాక్‌లో ఉండగా ఇద్దరు దుండగులు మోటార్ సైకిల్‌పై వచ్చి కాల్పులు జరిపారు. ఒకటి తలలో, మరొకటి ఛాతిలో బుల్లెట్లు దూసుకుపోయి, ఆయన అక్కడికక్కడే కన్ను మూశారు. దగ్గర్లో పార్క్ చేసి ఉంచిన మోటార్ సైకిల్ తీసుకొని, దుండగులు నింపాదిగా పారిపొయ్యారు. సి.సి. కెమెరాల్లో కొన్ని దృశ్యాలు నమోదయ్యాయి. హత్య జరిగిన తర్వాత అక్కడికి చేరుకున్న పోలీసులకు దబోల్కర్ జేబులోని ఐడెంటిటీ (గుర్తింపు) కార్డు దొరికింది. అందువల్ల ఆయనను వెంటనే గుర్తించడం జరిగింది. శక్తివంతమైన మారణాయుధాలు సమకూర్చుకొని ఇరుగుపొరుగు దేశాల్ని భయపెట్టగల మన ప్రభుత్వం ఒక హత్య చేసిన ఇద్దరు దుండగుల్ని మాత్రం ఏళ్ళు గడిచినా పట్టుకోలేక పోతోంది! అంటే ఏమిటీ? దేశంలో స్వేచ్ఛాలోచన ఇలాగే పట్టపగలు హత్య చేయబడుతుంది అని చెప్పడానికి సంకేతమా?

## భారత కబాడీ జట్టు కెప్టెన్

01 నవంబర్ 1945న పుణెలో జన్మించిన నరేంద్ర దబోల్కర్ చదువుకునే రోజుల్లో మంచి కబాడీ ఆటగాడు. బంగ్లాదేశ్‌తో పోటీ పడినప్పుడు భారత కబాడి జట్టుకు కెప్టెన్. మిరాజ్‌లోని ప్రభుత్వ వైద్యకళాశాల నుండి యం.బి.బి.యస్ డిగ్రీ తీసుకుని పేదలకు వైద్యసేవలందించారు. ఒక హేతువాదిగా అతి సాధారణ జీవితం గడిపారు. తన పిల్లలకు కూడా ముహూర్తాలు, సంప్రదాయాలు లేని పెళ్ళిళ్లు చేశారు. ఏ సమయంలోనైనా, ఏ విషయంలోనైనా ముహూర్తాలు చూడకుండా ఎందరికో ఆదర్శంగా నిలిచారు. మరణానంతరం భారత ప్రభుత్వం ఆయనకు పద్మశ్రీ ప్రకటించింది. ఆ పద్మా అవార్డు వల్ల ప్రభుత్వానికే ఏమైనా మేలు జరిగిందేమో కానీ నరేంద్ర దబోల్కర్‌కు ఒరిగిందేమీ లేదు. ఎందుకంటే ఆయన అంతకు ముందే - అంతకు వెయ్యిరెట్లు మించి... జనం గుండెల్లో స్థానం సంపాదించుకున్నారు. ఆయన ప్రాణత్యాగం వృధాపోలేదు. 1983లోనే ఆయనకు బెదిరింపులు వచ్చాయి. చిన్నపాటి దాడులు జరిగాయి. పోలీసు రక్షణ కోరమని చాలామంది స్నేహితులు, అభిమానులు సూచించారు. కానీ ఆయన వారి సూచనను స్వీకరించలేదు. పైగా "నా ప్రజల మధ్య నాకు సెక్యూరిటీ ఎందుకూ?" అని ప్రశ్నించారు. తన చుట్టూ ఉన్న ప్రజల మీద ఆయనకు అంత విశ్వాసం - "అయినా నేను ఎవరికో కొమ్ము కాయడం లేదు కదా? రాజ్యాంగబద్ధంగా నడుచుకుంటూ మొత్తం సమాజం ప్రగతి పథాన నడవడానికి కృషి చేస్తున్నాను ఇందులో ఎవరికీ అభ్యంతరాలు ఉండాల్సిన పని లేదు" అని ప్రకటించారు.

## జాతీయ వైజ్ఞానిక స్పృహ దినం

దబోల్కర్ హత్య తర్వాత దేశంలోని వివిధ ప్రాంతాల్లో చురుకుగా పని చేస్తున్న నలభై సైన్స్ సంఘాలు ఆల్ ఇండియా పీపుల్స్ సైన్స్ నెట్ వర్క్ (ఏఐపీఎస్ఎన్) కింద ఏకమై పని చేస్తున్నాయి. నరేంద్ర దబోల్కర్ స్మృతిలో 20 ఆగస్టు ప్రతి సంవత్సరం ''జాతీయ వైజ్ఞానిక స్పృహ దినం''గా జరుపుకోవాలని నిర్ణయించాయి. అందుకే గత ఐదేళ్ళుగా దేశవ్యాప్తంగా ఈ రోజును జరుపుకుంటున్నాం. అందరం కలిసికట్టుగా ఎలా పని చేయాలి? జనంలో గడ్డకట్టుకుని ఉన్న మూఢత్వాన్ని ఎలా ఛేదించాలి? అని ఆలోచించుకోవడానికి ఇది ఒక అవకాశం. భవిష్యత్ పథకాలు, ప్రణాళికలు సిద్ధం చేసుకోవడానికి, ముఖ్యంగా భావస్వేచ్ఛ కోసం, అంధ విశ్వాసాల నిర్మూలన కోసం ప్రాణాలు వదిలిన అమర వీరుల త్యాగాల్ని

☞ మిగతా 31వ పేజీలో

# నూతన ప్రపంచానికి దారిదీపం క్యూబా



**సోనియా సురభి గుప్త**
ప్రొఫెసర్, లాటిన్ అమెరికన్ స్టడీస్,
జామియా మిలియా ఇస్లామియా విశ్వవిద్యాలయం

అనువాదం : **కొండూరి వీరయ్య**

సోషలిస్టు పంథాను ఎంచుకున్న క్యూబాను అస్థిరపర్చటానికి అమెరికా మరోసారి తన సామ్రాజ్యవాద జోక్యానికి పాల్పడుతోంది. క్యూబా ప్రజలు, ప్రభుత్వం, కమ్యూనిస్టు పార్టీ ఈ ప్రయత్నాలను తిప్పి కొట్టాయి. జూలై 26వ తేదీన మంకాడా గారిసన్‌పై కాస్ట్రో దళాల దాడికి 68వ వార్షికోత్సవం. ఈ సందర్భంగా యావత్ ప్రపంచం క్యూబాకు సంఘీభావంగా నిలిచింది. భారతదేశంలో కూడా జాతీయ క్యూబా సంఘీభావ కమిటీ, దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థి యువజన, మహిళా, కార్మిక సంఘాలు, నిజాయితీతో పని చేసే పాత్రికేయులు క్యూబాకు సంఘీభావంగా నిలిచారు.

### క్యూబా వ్యతిరేకత పెంచటంలో పావులుగా మారిన సామాజిక మాధ్యమాలు

అమెరికా ప్రభుత్వాలు 1960 దశకం నుండీ క్యూబాపై ఆర్థిక, వాణిజ్య, ద్రవ్య సంబంధమైన ఆంక్షలు విధిస్తూ వచ్చాయి. క్యూబాలాగా మరే దేశమూ ఇంత దీర్ఘకాలం ఇంత కఠినమైన ఆంక్షలకు బలికాలేదు. ఈ ఆంక్షల కారణంగా క్యూబా ప్రజలు చెప్పనలవి కాని కష్టనష్టాలకు గురయ్యారు. అమెరికా ఆంక్షలకు వ్యతిరేకంగా క్యూబా ప్రజలు స్వయంప్రతిపత్తి, స్వావలంబన, సార్వభౌమత్వాలను కాపాడుకుంటూ వస్తున్నారు. ఇప్పటి వరకూ అమలు జరుగుతున్న ఆంక్షలకు అదనంగా ట్రంప్ ప్రభుత్వం మరో 244 ఆంక్షలు విధించింది. కోవిడ్ మహమ్మారి కూడా ఈ ఆంక్షలు సడలించాలన్న ఇంగితాన్ని అమెరికాకు కలిగించ లేకపోయింది.

క్యూబా ఆర్థిక వ్యవస్థ కోవిడ్ మహమ్మారి ధాటికి కుదేలైంది. ప్రత్యేకించి క్యూబాకు ఆదాయవనరుగా ఉన్న పర్యాటక రంగం తీవ్రంగా దెబ్బతిన్నది. ఇన్ని ఆంక్షలు, ప్రతికూల పరిస్థితులు ఉన్నప్పటికీ మొత్తం లాటిన్ అమెరికాలో వ్యాక్సిన్ తయారు చేయగలిగిన ఏకైక దేశంగా ఉంది క్యూబా. అబ్దాలా, సోబెరానా వాక్సిన్‌లను క్యూబా ఈ ప్రతికూల పరిస్థితుల్లో సైతం అభివృద్ధి చేసింది. ఇదిలా ఉండగా దేశంలో కుదేలవుతున్న ఆర్థిక పరిస్థితిని నిరసిస్తూ కొందరు క్యూబా ప్రజలు తమ అసంతృప్తి అన్ని రకరకాలుగా వ్యక్తం చేయసాగారు. జూలై 11న వివిధ నగరాల్లో ఆహార కొరతకు నిరసన వ్యక్తం చేస్తూ కొందరు క్యూబా ప్రజలు ప్రదర్శనలు చేశారు. ప్రత్యేకించి మతాన్జాస్‌లో పేట్రేగుతున్న కోవిడ్ పట్ల ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిరసనలను ఓ మేరకు అర్థం చేసుకోవచ్చు. అందుకే క్యూబా ప్రభుత్వం నిరసనకారులతో ప్రత్యక్షంగా చర్చలకు వెళ్లింది. ఏకంగా దేశాధ్యక్షుడే చర్చలకు వెళ్లారు. హవానా, ఇతర నగరాల్లో వందల మంది తాము ఎదుర్కొంటున్న వాస్తవిక సమస్యల గురించి అధ్యక్షునికి వివరించారు. కానీ జూలై 11న దేశవ్యాప్తంగా జరిగిన నిరసనలు భిన్నమైనవి. క్యూబా ప్రభుత్వాన్ని అస్థిరపర్చే లక్ష్యంతో సాగిన నిరసన ప్రదర్శనలు ఇవి. ఈ నిరసనలకు అమెరికా అధ్యక్ష భవనం వెన్నుదన్నుగా ఉందని చెప్పటానికి వెనకాడాల్సిన పని లేదు. క్యూబా సోషలిస్టు ప్రభుత్వాన్ని అస్థిరపర్చేందుకు ప్రాణాలు తీసే కోవిడ్‌ను కూడా పావుగా వాడుకోగలమని అమెరికా మరోసారి చాటి చెప్పింది.

ప్రజల్లో ప్రభుత్వం పట్ల ఉన్న వ్యతిరేకత ఏ మోతాదులో ఉందో తెలుసుకోవటానికి జూలై 11 నిరసనలను అమెరికా ఓ సందర్భంగా వాడుకోవటానికి సిద్ధపడింది. ఈ నిరసనలు దేశవ్యాప్త తిరుగుబాటు రూపం తీసుకుంటాయా లేదా అన్నది అమెరికా పరిశీలిస్తున్న కోణం. యథా ప్రకారం తప్పుడు వార్తల ఆధారంగా కథనాలు తయారయ్యాయి. బ్యూనస్ ఎయిర్స్‌లో అమెరికా ఫుట్‌బాల్ కప్ ఉత్సవాలను, ఈజిప్ట్‌లో పదేళ్ల నాటి నిరసనలను క్యూబాలో జరుగుతున్న నిరసనలుగా ప్రచారం చేస్తూ అమెరికా నుండి తప్పుడు వార్తా స్రవంతి మొదలైంది. కాసులకు లొంగిపోయిన కాకారాయుళ్లు సోషలిస్టు ప్రభుత్వం పట్ల ప్రజాగ్రహంగా దీన్ని రంగుమార్చి వాట్సాప్ యూనివర్సిటీ సిలబస్ చేశారు. క్యూబా ప్రజలు ఎప్పటిలాగానే అర్థవంతంగా స్పందించారు. సోషలిస్టు ప్రభుత్వానికి మద్దతుగా వేలాదిమంది వీధుల్లోకి వచ్చారు. హింసాత్మక చర్యలకు సిద్ధపడాలన్న అమెరికా పిలుపుకు స్పందించిన చెదురుమదురు నిరసనకారులను కట్టడి చేశారు. ప్రజాతంత్ర పద్ధతిలో ప్రభుత్వాన్ని ప్రశ్నించవచ్చన్న విషయాన్ని స్పష్టం చేశారు. అమెరికా సరిహద్దులోని మియామి

కేంద్రంగా ఉన్న మాఫియా వికృత వ్యూహం విఫలమైంది. నిరసనకారులపై క్యూబా ప్రభుత్వం అణచివేతకు పాల్పడుతుందని దీన్ని అంతర్జాతీయ మానవహక్కుల సమస్య చేసి అమెరికా సైనిక జోక్యానికి రంగం సిద్ధం చేయవచ్చన్నది ఈ వికృత వ్యూహం. వీరి అంచనాలకు భిన్నంగా క్యూబా ప్రభుత్వం నిరసనకారులతో శాంతియుత చర్చలకు ఆహ్వానం పలికింది.

### అమెరికా జోక్యం

లాటిన్ అమెరికా దేశాల అంతర్గత వ్యవహారంలో అమెరికా జోక్యానికి సుదీర్ఘ చరిత్రే ఉంది. స్పెయిన్ వలసలుగా ఉన్న లాటిన్ అమెరికా దేశాలను, అవి స్వాతంత్ర్యం పొందిన నాటి నుండీ అమెరికా తన పెరటిదొడ్డిగా భావిస్తూ వచ్చింది. ప్యూర్టోరికో, ఫిలిప్పీన్స్‌ల తర్వాత స్పెయిన్ వలస పాలన నుండి 1898లో స్వాతంత్ర్యం పొందిన చివరి దేశం క్యూబా. స్వతంత్ర దేశంగా క్యూబా అవతరించిన వెంటనే ఈ చిన్న దీవిని కబ్జా చేయటానికి అమెరికా చేయని ప్రయత్నం లేదు. అమెరికా, స్పెయిన్‌లకు జరిగిన యుద్ధంలో స్పెయిన్‌ని ఓడించి క్యూబాపై అమెరికా తన అధికారాన్ని ఖాయం చేసుకుంది. అమెరికా తరపున నియంతగా పాలిస్తున్న బాటిస్టా కబంధ హస్తాల నుండి క్యూబాను విముక్తి చేయటానికి కాస్ట్రో నాయకత్వంలో 1953 జూలై 26న శాంటియాగో డి క్యూబా నగరంలోని మంకాడా కారాగారంపై దాడి జరిగింది. ఈ తొలి ప్రయత్నంలో కాస్ట్రో దళాలు విజయం సాధించలేకపోయాయి. అయితే మంకాడా కారాగారంపై జరిగిన దాడి క్యూబా కార్మికవర్గ చైతన్యాన్ని పతాక స్థాయికి చేర్చింది. 1959లో బాటిస్టాకు వ్యతిరేకంగా సాగిన విప్లవంలో కార్మికవర్గం విముక్తి శక్తుల పక్షాన నిలిచింది.

1959 విప్లవం విజయం సాధించటం క్యూబా చరిత్రలో నూతన అధ్యాయానికి నాంది పలికింది. ఇటువంటి చిన్న దేశంలో విజయవంతమైన ఈ విప్లవం లాగా ప్రపంచాన్ని ప్రభావితం చేసిన మరో సంఘటన 20వ శతాబ్ది ప్రపంచ చరిత్రలోనే లేదంటే అతిశయోక్తి కాదు. మూడో ప్రపంచ దేశాల్లో సాగిన వలస వ్యతిరేక ఉద్యమాల నుండి, 1968లో లాటిన్ అమెరికాను ఆవహించిన రాడికల్ రాజకీయాల నుండి, వామపక్ష రాజకీయాల నుండి క్యూబాను వేరు చేయలేం. ఇటువంటి రాజకీయాల కొనసాగింపులో భాగంగానే తాజాగా పెరులో పెడ్రో కాస్టిల్లో దేశాధ్యక్షునిగా ఎన్నికయ్యాడు.

లాటిన్ అమెరికాను వామపక్ష రాజకీయాలకు ప్రయోగశాలగా మార్చటంలో క్యూబా కీలక పాత్రధారిగా ఉండటమే అమెరికా ప్రభుత్వం, దానికి అండగా ఉన్న యజమానులు సోషలిస్టు ప్రభుత్వాన్ని కూలదోయాలని కక్ష కట్టడానికి కారణం. క్యూబా భూభాగమైన గౌంటనామో కేంద్రంగా అమెరికా అక్రమ చర్యలకు పాల్పడుతోంది. ఈ ప్రాంతాన్ని సైనిక స్థావరంగా మార్చుకుంది. వేలాదిమంది హైతీవాసులు, క్యూబా పౌరులు, తాజాగా ముస్లింలను ఖైదు చేసింది ఇక్కడే. ఈ దుశ్చర్య అమెరికా రాజ్యాంగానికి కూడా విరుద్ధమైనది. గత ఆరు దశాబ్దాలుగా అమెరికా క్యూబాపై ప్రత్యక్షంగా పరోక్షంగా అనేక అమానవీయ చర్యలకు పాల్పడుతోంది. ఉదాహరణకు 2014లో యుఎస్ ఎయిడ్ సంస్థ క్యూబా పాప్ సంగీత బృందాలకు ఆర్థిక సహాయం చేసి వాళ్ల ద్వారా యువతలో అశాంతి రాజేయటానికి ప్రయత్నం చేసింది. 1962 నాటి పిగ్స్ జలసంధి దాడియత్నం లాగానే ఇప్పటి వరకూ క్యూబాపై ఆధిపత్యం సాగించేందుకు అమెరికా చేసిన అన్ని ప్రయత్నాలూ విఫలమయ్యాయి.

ఈ మధ్యకాలంలో హైతీ అధ్యక్షుడిని హత్య చేసిన కొలంబియా సైనికుడికి తామే శిక్షణ ఇచ్చామని అమెరికా రక్షణ శాఖ ప్రకటించింది. కానీ ఈ వాస్తవాన్ని ప్రజలకు చేరవేయటానికి కాకారాయుళ్లు ఎన్నడూ ప్రయత్నం చేయలేదు. అన్నింటికీ మించి క్యూబాలో కోవిడ్ పీడిత ప్రజలకు ఆహారం, ఇతర సరుకులు అందచేసే సాకుతో క్యూబాలో ఓ ప్రత్యేక ప్రాంతంలో అమెరికా ప్రవేశానికి అవకాశాలు కల్పించాలని అధ్యక్షుడు జో బైడెన్ ప్రతిపాదించాడు. ఇంతకన్నా దగా ఏముంటుంది? క్యూబాకు అందే అన్ని రకాల సహాయ సహకారాలపై ఆంక్షలు విధించి ప్రజల కడుపుకొట్టిన అమెరికా నేడు మానవతా కోణంలో జోక్యం చేసుకోవటానికి ప్రత్యేక అవకాశాలు కోరుతోంది. క్యూబా ప్రజలు సోషలిజమే తమ భవిష్యత్తు అని నమ్మినందుకుగాను వాళ్ల ప్రాణాలతో చెలగాటమాడటానికి అమెరికా చేతుల్లో కోవిడ్ కూడా పావుగా మారింది. అమెరికాకు ఏ మాత్రం మానవత్వం ఉన్నా క్యూబాపై ఆంక్షలు రద్దు చేసి తన మానవత్వాన్ని నిరూపించు కోవాలి. ఓ చిన్న ఉదాహరణగా చెప్పాలంటే కోవిడ్ మహమ్మారి కాలంలో క్యూబాలోని ఆసుపత్రులకు స్విట్జర్లాండ్ ఉచితంగా ఇస్తామన్న వెంటిలేటర్లు కూడా రానీయకుండా అమెరికా ఆంక్షలు అడ్డుపడ్డాయి. అటువంటి అమెరికా మానవతా కారణాల

గురించి మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించటమే. ఐక్యరాజ్యసమితిలో 184 దేశాలు ఆమోదించిన తీర్మానాన్ని అంగీకరించటానికి సిద్ధంగా లేని అమెరికా... క్యూబా ప్రభుత్వం ప్రజల డిమాండ్లకు స్పందించాలని చెప్పటం దాని గురివింద నైజానికి పరాకాష్ట.

అమెరికా జోక్యానికి వ్యతిరేకంగా క్యూబా అధ్యక్షుడు మిగుయెల్ డియాజ్ కానెల్ తన విప్లవ కర్తవ్యాన్ని ముందుకు తీసుకెళ్తున్నాడు. ఏ రూపంలోనూ బయటి శక్తుల జోక్యానికి అవకాశం ఇచ్చేది లేదని స్పష్టం చేస్తున్నాడు. జూలై 17, 2021న హవానాలో జరిగిన ఓ సభలో మాట్లాడుతూ కానెల్ "గత కొద్ది వారాలుగా అమెరికా నుంచి ఆర్థిక సహకారం పొందిన కొన్ని మీడియా సంస్థలు ప్రజలకు మత్తుమందు పంచటంలో మునిగి పోయాయి. ఫ్లోరిడాలోని రాజకీయ యంత్రాంగం వీరికి వత్తాసుగా ఉంది. వాళ్ల లక్ష్యం ఒక్కటే. క్యూబాలో అస్థిరత సృష్టించటం. ఇటువంటి ప్రయత్నానికి కోవిడ్ నేపథ్యాన్ని సాధనంగా వాడుకుంటున్నారు. ఇప్పటివరకూ సాగుతున్న ఆంక్షలకు అదనంగా ట్రంప్ ప్రభుత్వం విధించిన 243 ఆంక్షలను ఈ ప్రభుత్వం అమలు చేస్తోంది. తాజాగా క్యూబా ప్రజలపై సాంప్రదాయేతర యుద్ధ వ్యూహానికి అమెరికా తెరతీసింది. తిరుగుబాటు రెచ్చగొట్టడానికి బాహాటంగానే ప్రయత్నం జరుగుతోంది. పోలీసులపై దాడులకు ప్రేరేపిస్తున్నారు. వెన్నుపోట్లు ప్రోత్సహిస్తున్నారు." అని హెచ్చరించాడు.

అమెరికా ఎన్ని ఆంక్షలు విధించినా వైద్య, విద్య, సామాజిక భద్రత, క్రీడా, సంగీతం, సాంస్కృతిక రంగాల్లో క్యూబా తన ప్రజలకు పెట్టుబడిదారీ దేశాలకు మించిన నాణ్యమైన సేవలందిస్తోంది. జూలై 11 నిరసనల తర్వాత ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన క్యూబా గాయకుడు సిల్వియో రోడ్రిగుయెజ్ "ఇన్ని ఆంక్షలున్నా మా దేశానికి కావల్సిన వ్యాక్సిన్ మేము తయారుచేసుకోగలిగామంటే మా బతుకు మమ్ములను బతకనిస్తే మరెన్ని అద్భుతాలు సాధించగలమో వేరే చెప్పాలా?" అని ప్రశ్నించాడు. అందుకే మెక్సికో అధ్యక్షుడు లోపేజ్ ఒబ్రడోర్ కోవిడ్ కాలంలో ప్రపంచానికి అందించిన సేవలకు గాను క్యూబాను, క్యూబా ప్రజలను ప్రపంచ మాతృమూర్తిగా ప్రకటించాలని యునెస్కోకు విజ్ఞప్తి చేశాడు. నిజమే. క్యూబా విప్లవ ప్రభుత్వం నూతన ప్రపంచ నిర్మాణానికి దారిదీపం. ఈ దీపం ఆరిపోకుండా కాపాడుకోవటం మనందరి కర్తవ్యం. ❑

## వైజ్ఞానిక స్పృహ కోసం ఒక రోజు - 20 ఆగస్టు

**(28వ పేజీ తరువాయి)**

మననం చేసుకోవడానికి ఈ రోజు జరుపుకుంటున్నాం. ప్రజల ఆలోచనల్లో ఆరోగ్యకరమైన మార్పు తీసుకురావడానికి, అంధ విశ్వాసాల్ని అంతం చేయడానికి ఇలాంటి రోజులు ఉండాలి. వీటి ప్రాధాన్యతను జనానికి విడమరిచి చెప్పాలి. ఆచారాల పేరిట మూఢనమ్మకాల వెంట పరుగులు పెడుతున్న జనాన్ని ఆపి, మనిషి కేంద్రంగా మానవీయ విలువలకు ప్రాధాన్యమిస్తూ జీవించడం నేర్పాలి!

### నెహ్రూ స్మరణీయుడు


ఒక రకంగా తొలి భారత ప్రధాని జవహర్ లాల్ నెహ్రూని కూడా ఈ రోజు స్మరించుకోవాలి. ఎందుకంటే, 'సైంటిఫిక్ టెంపర్' అనే పదాన్ని మొదటగా ఉపయోగించింది ఆయనే! తన 'డిస్కవరీ ఆఫ్ ఇండియా' అనే గ్రంథంలో 'సైంటిఫిక్ టెంపర్' అంటే ఏమిటో వివరించారు. ఏదైనాగాని, పరీక్షకు నిలువని దానిని, రుజువుకాని దానిని నమ్మకుండా ఉండగలగడమే సైంటిఫిక్ టెంపర్ (వైజ్ఞానిక స్పృహ) అని ఆయన చెప్పారు. గత కాలపు మెట్టవేదాంతం మీద, అల్లుకున్న కథల మీద నమ్మకం ఉంచుకోవడం కాదనీ, కార్యకారణ సంబంధాన్ని తెలుసుకోవడమే సైంటిఫిక్ టెంపర్ అని తేల్చి చెప్పారు. ఒక రకంగా ఈ పదం, ఆ ఆలోచన భారతదేశానిదే. ఈ దేశంలో విలసిల్లిన చార్వాక దర్శనం, బుద్ధ దర్శనాల సారాంశాల్ని ఆధునీకరించి పండిట్ నెహ్రూ నిర్వచించి ఉంటారు. కానీ ప్రస్తుత ప్రభుత్వానికి నెహ్రూజీ అంటే పడదు. ఆయన చెప్పిన సైంటిఫిక్ టెంపర్ అంటే ఏమిటో తెలియదు. దేశవ్యాప్తంగా ఆయన నెలకొల్పిన వైజ్ఞానిక సంస్థలకు ప్రతి యేటా విడుదల చేయాల్సిన నిధులు కూడా విడుదల చేయరు. ఇలాంటి సమయంలో దేశంలోని 136 కోట్ల జనం ఏం చేయాలి? చేతులు ముడుచుకుని కూర్చోవాలా? లేక వైజ్ఞానిక స్పృహ గలవారికి అధికారం కట్టబెట్టాలా? ❑



# మార్క్స్ ఔచిత్యం

వెన్నెలకంటి రామారావు

రెండు శతాబ్దాల క్రితం జన్మించిన వ్యక్తి గురించి ప్రపంచం ఇంత ఆసక్తి ఎందుకు చూపుతోంది? 1883 నుంచి లండన్‌లోని హైగేట్ స్మశానవాటికలో శాశ్వత నిద్రలో ఉన్న ఆ తాత్వికుని ఆలోచనలు నేటి సంక్షుభిత ప్రపంచానికి ఎలా మార్గదర్శకత్వాన్ని వహించగలవు? ఒక మేధావి జీవిత కాల సైద్ధాంతిక కృషికి స్థల, కాలాల మితి ఖచ్చితంగా ఉన్నప్పటికీ, ఆయన వెలికితీసిన వస్తుగత నియమాలకు చారిత్రక అఖండత ఉంటుంది. అలాగే హైగేట్ స్మశాన వాటికలో శాశ్వతలో ఉన్న కార్ల్‌మార్క్స్ అనే వ్యక్తి అలాంటి చారిత్రక అఖండత కలిగిన మేధావిగా విస్తృత ఆమోదం ఉంది. మార్క్స్ ఆలోచనలు ఇదివరకెన్నడూ లేనంత ప్రాసంగికతను నేడు సంతరించుకున్నాయనడంలో అతిశయోక్తి లేదు. మార్క్సిస్ట సిద్ధాంతం గురించి తెలుసుకోవాలని ఆసక్తి చూపుతున్న వారి సంఖ్య ప్రపంచవ్యాప్తంగా పెరుగుతుండడమే అందుకు సాక్ష్యం. 2008 నాటి నుంచి ఈనాటికి కోలుకోలేని ప్రపంచ ఆర్థిక పతనం మార్క్స్ అంచనాలకు కాలం చెల్లిపోలేదన్న సత్యాన్ని తెలియచేస్తోంది. యూరో సంక్షోభంతో గ్రీస్, స్పెయిన్, ఇటలీ దేశాల ఆర్థిక వ్యవస్థలు మాంద్యంలో కూరుకుపోయి, మొత్తం ఈయూ ఆర్థిక వ్యవస్థ అతలాకుతలమైంది. 1990లలో సోవియట్ రష్యా సోషలిస్టు స్వప్నం కుప్పకూలిన నాటి నుంచి మార్క్స్ సిద్ధాంతాల్ని తీవ్రంగా విమర్శిస్తున్న సంప్రదాయక ఆర్థిక వేత్తలకు నేటి సంక్షోభానికి కారణాలు, వాటి పరిష్కారాలు గురించి తలలు బద్దలు కొట్టుకుంటున్నారు. ఈ పరిణామాల రీత్యా మార్క్సిజం కాలం చెల్లిందని తీవ్ర విమర్శలు గుప్పించిన ఆ ఆర్థిక వేత్తలు 'తమ మాటల్ని తామే మింగవలసిన' పరిస్థితిలోకి వెళ్ళారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ప్రబలంగా కొనసాగుతున్న నేటి ఆర్థిక విధానం తన వినాశనానికి అవసరమైన బీజాలు తానే కలిగి ఉందని; తాత్కాలికంగా వికాసం కొనసాగినా మరింత తీవ్రమైన స్థితిలో సార్వత్రిక సంక్షోభం అగ్ని పర్వతం వెదజల్లే లావాలా ఎగసి పడుతూనే ఉంటుందన్న మార్క్సిస్టు అవగాహనను కొందరు యథాస్థితి సమర్థక ఆర్థికవేత్తలు కూడా అంగీకరించని తప్పని పరిస్థితి.



## మార్క్సిజం అధ్యయనంపై పెరిగిన ఆసక్తి

సంక్షోభాల పరిష్కారానికి మార్కెట్ సర్వశక్తిమంతమైనదనీ, సర్వరోగనివారిణి అనీ, సరఫరా, గిరాకీ అనే అంశాలు మాంత్రికంగా స్వయం చలిత సమతుల్యత సాధిస్తుండడం వల్ల, 1929 నాటి ఆర్థిక వినాశనం, మహా సంక్షోభం తిరిగి తలెత్తే అవకాశం లేదని యథాస్థితివాద ఆర్థికవేత్తలు ఇంతవరకూ వాదిస్తూ వచ్చారు. అధికోత్పత్తి సంక్షోభం అనే మార్క్స్ సూత్రీకరణ తప్పు అని చరిత్ర చెత్తకుప్ప మీదకు విసిరేందుకు ప్రయత్నించిన మేధావులకు, ప్రస్తుత సంక్షోభాన్ని అర్థం చేసుకునేందుకు అంతకంటే మెరుగైన సిద్ధాంతమేదీ కనపడడం లేదు. రెండు దశాబ్దాల క్రితం రాసిన అసంఖ్యాక పుస్తకాలు సాధారణంగా నేడు చారిత్రక ఆసక్తిని మాత్రమే కలిగి ఉంటాయి. అయితే అందుకు భిన్నంగా జర్మనీలో 'దాస్ కాపిటల్'కు మంచి గిరాకీ ఏర్పడింది. జపాన్‌లోను 'పెట్టుబడి' గ్రంథం అమ్మకాలు విపరీతంగా పెరిగాయి. ఈ సంక్షోభ పరిష్కారానికి నేడు మార్క్సిస్టు సిద్ధాంతాన్ని పరిగణనలోకి తీసుకోక తప్పని స్థితి ఏర్పడింది. 'అర్థశాస్త్రం తప్పేముంది? దీంతో (2008 ఆర్థిక సంక్షోభం) ప్రధాన స్రవంతి ఆర్థికవేత్తల సిద్ధాంతాలకు ప్రాసంగికత లేకుండా పోతోంది. గత మూడు దశాబ్దాలుగా స్థూల ఆర్థికశాస్త్ర సిద్ధాంతాలు నిరుపయోగమైనవిగా, ప్రమాదకరమైనవిగా తయారయ్యాయి.' అని 2009 లండన్‌లో ఎకానమిస్ట్ పత్రిక నిర్వహించిన సదస్సులో నోబెల్ పురస్కార గ్రహీత పాల్ క్రుగ్‌మన్ సంచలనాత్మక ప్రకటన చేశారు. అదే సమయంలో 'L'Osservatore Romano' అనే వాటికన్ అధికార పత్రిక మార్క్స్ సూత్రీకరించిన ఆదాయ అసమానతల విశ్లేషణను ప్రశంసిస్తూ ఒక కథనాన్ని ప్రచురించింది. 'నేడు ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మార్క్స్ అంచనాతో సరిపోయే విధంగా అసాధారణ

పోలికలు కలిగి ఉంది' అని 'బ్లూమ్‌బర్గ్ వ్యూ'లో 'ప్రపంచ ఆర్థిక వ్యవస్థను సంరక్షించేందుకు కార్ల్ మార్క్స్‌కు ఒక అవకాశం ఇవ్వండి' అనే వ్యాసంలో స్విస్ బ్యాంక్ (యూబీఎస్) సీనియర్ ఎకానమిక్ అనాలిస్ట్ రాశారు. ఇలా ప్రధాన స్రవంతి ఆర్థికవేత్తలెందరో సమకాలీన ప్రపంచ ఆర్థిక మాంద్యాన్ని అర్థం చేసుకునేందుకు మార్క్సిస్టు రాజకీయార్థిక శాస్త్రాన్ని అధ్యయనం చేస్తున్నట్లు ఎన్నో కథనాలు వెల్లడైనాయి. వస్తుగత సామాజిక చలననియమాల సూత్రీకరణ రూపంలోని చారిత్రక అఖండత, ప్రాసంగికత సూచించే విప్లవాత్మక పార్శ్వాన్ని, సమకాలీన సామాజిక వాస్తవికతపై చేసిన వ్యాఖ్యానాల రూపంలోని స్థితిస్థాపక పార్శ్వాన్ని విడి విడిగా గుర్తించగలిగితేనే మార్క్స్ ప్రతిపాదించిన సిద్ధాంత సారాన్ని సవ్యంగా గ్రహించగలం. డార్విన్ 'జీవ పరిణామ సిద్ధాంతం' జీవశాస్త్రంలో ఎంతటి విప్లవాత్మకమైనదో మార్క్స్ 'సామాజిక పరిణామ' సిద్ధాంతమూ సామాజిక శాస్త్రాలలో అంతటి మహోన్నతమైనది.

## మూడు మూలాధారాలు, మూడు అంశీభూతాలు :

పెట్టుబడిదారీ విధానం ఆవిర్భావంతో యూరప్ సమాజంలో బ్రహ్మాండమైన భావ వికాసం సంభవించింది. యూరప్‌లోని వివిధ దేశాల సామాజికార్థిక పురోగతిపై ఆధారపడి ఆ భావ వికాసం సాగింది. 1. ఆర్థికంగా అభివృద్ధి చెంది భూగోళ వ్యాప్తంగా వలసలున్న బ్రిటన్‌లో రాజకీయార్థిక శాస్త్రం; 2. పెట్టుబడిదారీ విధాన అభివృద్ధితో పాటు ఫ్యూడల్ వర్గాల నుంచి రాజకీయ అధికారాన్ని బూర్జువా వర్గం హస్తగతం చేసుకునే క్రమంలో తీవ్ర వర్గ పోరాటాలు జరిగిన ఫ్రాన్స్‌లో సోషలిస్టు సిద్ధాంతాలు; 3. పెట్టుబడిదారీ విధాన అభివృద్ధిలో సాపేక్షికంగా వెనుకబడ్డ జర్మనీ దేశంలో తత్వశాస్త్రం తదితర అముక్త శాస్త్రాలు (గణితం, తర్కం వగైరా) అభివృద్ధి చెందాయి. ఈ మేధా నేపథ్యం నుంచి భౌతిక వాద గతితర్క (గతితార్కిక, చారిత్రక భౌతికవాదం) తత్వశాస్త్రాన్ని, వర్గపోరాట సిద్ధాంతం పునాదిగా శాస్త్రీయ సోషలిజాన్ని, పెట్టుబడి గ్రంథంలో పెట్టుబడిదారీ విధానానికి చెందిన అదనపు విలువ దోపిడి + భూసార దోపిడి – అనే ద్విముఖ దోపిడీలను వివరించే సిద్ధాంతాన్ని, ప్రకృతికి, సమాజానికి మధ్య ఆదానప్రదానాలకు గండి (metabolic rift between nature and society) భావనలను మార్క్స్ ప్రతిపాదించారు. 1871లో 72 రోజులపాటు ఏర్పడిన 'ప్యారిస్ కమ్యూన్' (కార్మికవర్గ నియంతృత్వ రాజ్యం) పర్యవసానంగా అప్పటి దాకా అనేక సోషలిస్టు సిద్ధాంతాలలో ఒకటిగా ఉన్న మార్క్సిజం, ఆ తర్వాత ఏకైక శాస్త్రీయ సోషలిస్టు సిద్ధాంతంగా ప్రపంచం ముందు నిలిచింది. మార్క్స్ ఆత్మశోధన కోసం 1846లో రాసిన 'జర్మన్ ఐడియాలజీ' (జర్మన్ మార్మికత లేదా జర్మన్ తప్పుడు భావజాలం) అనే గ్రంథంలో తనను తాను ఒక భౌతికవాద గతితార్కిక తత్వవేత్తగా ఆయన ప్రతిష్ఠించు కున్నారు. ఆ తర్వాత 1848లలో రాసిన 'కమ్యూనిస్టు ప్రణాళిక'లో వర్గపోరాటం చోదక శక్తిగా సాగే సామాజిక చారిత్రక ప్రస్థానాన్ని, దాని గమనం, గమ్యాన్ని సంక్షిప్తంగా, అద్భుతంగా ఆవిష్కరించారు. ప్రణాళికలో రాసిన విషయాలు 1848 నాటి పరిస్థితుల కంటే సమకాలీన పరిస్థితులనే సజీవంగా ప్రతిఫలిస్తున్నట్లు కనిపించడం విశేషం.

## చారిత్రక చోదక శక్తి - కార్మిక వర్గ పాత్ర :

మార్క్సిజంలో కీలకమైన మానవ సమాజ చారిత్రక గమనానికి ప్రధాన చోదక శక్తి ఉత్పత్తి శక్తులు (మనుషులు, వ్యవసాయక, పారిశ్రామిక ఉత్పత్తి సాధనాలు, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం+నైపుణ్యాలు) ఉత్పత్తి సంబంధాల (ఉత్పత్తి చేసే క్రమంలో యావత్ సమాజంలోని మనుషుల మధ్య ఏర్పడిన సంబంధాలు = ఆస్తి సంబంధాలు + శ్రమ (మారక) సంబంధాలు + పంపిణీ సంబంధాలు) మధ్య వైరుధ్యం అనే సూత్రం పైన, సోషలిస్టు విప్లవానికి కార్మిక వర్గం చారిత్రక నాయకత్వ పాత్ర వహిస్తుందన్న ప్రతిపాదనపైన ప్రధాన స్రవంతి సామాజిక వేత్తలు ఇప్పటిదాకా తప్పుబట్టారు. అయితే బ్రహ్మాండమైన ఉత్పత్తి శక్తుల అవతరణతో ఉత్పత్తి కార్యకలాపం పెద్ద ఎత్తున సాగుతున్నప్పటికీ అంతర్జాతీయ సమాజంలో సుడులు తిరిగే నిరుద్యోగం, నిరర్థకంగా ఉన్న మానవ వనరులు ఒక చారిత్రక సవాలుగా మారాయి. సరుకుల ఉత్పత్తి అవసరాలకు మించి ఎన్నో రెట్లు అదనంగా ఉన్నప్పటికీ కొనుగోలు శక్తి కోల్పోయిన సమూహాల కారణంగా ఆయా సమాజాలలో ఆర్థిక మాంద్య పరిస్థితులు గంభీరంగా నెలకొన్నాయి. ప్రపంచ సంపదలు ఎన్నో రెట్లు పెరిగినప్పటికీ దారిద్ర్య మహా జన సముద్రాల మధ్య కొద్దిమంది సంపన్నులతో కూడిన సంపద ద్వీపాలు ఏర్పడినట్లు ఆర్థిక అధ్యయనాలు తెలియజేస్తున్నాయి. ఈ పరిస్థితుల నేపథ్యంలో ప్రపంచ స్థాయి ఉత్పత్తి శక్తుల అభివృద్ధికి, అసమాన మానవ సంబంధాలకు మధ్య సయోధ్య కుదరక సమాజాలలో సంక్షోభాలు ఏర్పడుతున్నాయి. ఈ వైరుధ్యాల పరిష్కారం ఉనికిలో ఉన్న వ్యవస్థ మార్పు పైనే ఆధారపడి ఉంటుంది. పరిశ్రమలను మించిపోయిన పరిమాణంలో సేవల రంగాలు ఒక బుడగలా ప్రకోపించినట్లు కనపడుతుండడం వల్ల సేవా రంగ శ్రామికులే వ్యవస్థకు కీలకమని మేధావులు అంచనా వేయడం సహజం. అయితే సేవా రంగం అనేది పారిశ్రామిక రంగ ప్రయోజనాలను అనుకూలింప చేయడం కోసమేనన్నది సత్యం. అందువల్ల పారిశ్రామిక రంగానికి మించి సేవా రంగం విస్తరించిన అది కేవలం వాపు మాత్రమే. సేవా రంగం ఆదాయ సమీకరణలు పారిశ్రామిక రంగ ఉత్పాదక శ్రమ

రంగం నుంచి వచ్చి చేరే అదనపు విలువ ద్వారా మాత్రమే నిర్ణయించ బడుతాయి. ఈ నేపథ్యంలో సేవారంగ శ్రామిక వర్గం ఎంత గణనీయమైన స్థాయిలో ఉన్నప్పటికీ, పారిశ్రామిక రంగంలోని కార్మిక వర్గమే ఆర్థిక వ్యవస్థకు అంతస్సారంగా ఉంటారు. అందువల్ల ఇప్పటికీ కార్మిక వర్గమే చారిత్రకంగా నాయకత్వ పాత్ర పోషిస్తుందనే మార్క్స్ ప్రతిపాదన సరైనదే. నేటి ప్రపంచార్థిక సంక్షోభం దాన్ని మరింత ధ్రువీకరిస్తోంది..

### కంప్యూటర్ యుగాన్ని ఊహించిన మార్క్స్ :

కంప్యూటర్లు, రోబోల వంటి మేధా శ్రమ ఆధారిత శ్రమ సాధనాల వినియోగంలో వున్నప్పుడు మార్క్స్ అదనపు విలువ సిద్ధాంతం కాలం చెల్లిపోయిందని కొందరి వాదన. ప్రకృతికి, మనిషికి మధ్య యంత్రాల వ్యవస్థ (system of machines) స్థానంలో, క్రమాల వ్యవస్థ (system of process) వస్తుందని మార్క్స్ ఆవిష్కరించారు. అలాంటి పరిణామానికి ప్రత్యక్ష సాక్ష్యాలే కంప్యూటర్లు, రోబోలు ఆధారంగా జరిగే ఉత్పత్తి క్రమమని గుర్తించాలి. ఆ క్రమం పెరిగే కొద్దీ సాపేక్ష అదనపు జనాభా (నిరుద్యోగులుగా మారే కార్మిక వర్గం) పెరుగుతుంది. ఈ పరిస్థితి సామాజిక ఉత్పత్తి సంబంధాల మౌలిక మార్పు కోసం జరిగే ప్రయత్నాలకు ఉత్ప్రేరకంగా పనిచేస్తుంది. అది మార్క్స్ చెప్పిన ఉత్పత్తి శక్తులకు, ఉత్పత్తి సంబంధాలకు మధ్య వైరుధ్యాన్ని తీవ్రతరం చేసి, విప్లవానికి దారి తీస్తుంది. 'యంత్రాల వ్యవస్థ' స్థానంలో 'క్రమాల వ్యవస్థ' ఏర్పడడం సోషలిస్టు, కమ్యూనిస్టు సమాజాలకు ముందు షరతుగా ఉంటుంది. మనిషికి ప్రకృతికి మధ్య 'క్రమాల వ్యవస్థ' ప్రబలంగా రూపొందే కొద్దీ సమాజంలో సగటు మనిషి 'స్వేచ్ఛాకాలం' (free time) లభ్యత క్రమంగా పెరుగుతుంది. Free time పెరిగే కొద్దీ మార్క్స్ అంచనా వేసినట్లు పరిపూర్ణ మానవులు ఉన్న కమ్యూనిస్టు సమాజానికి ఆ పరిణామాలు ఒక ధ్రువీకరణగా నిలుస్తాయి. కంప్యూటర్లు, రోబోలతో సాగే ఉత్పత్తి క్రమం మార్క్స్ రాజకీయార్థ శాస్త్ర సూత్రీకరణలను మరింతగా నిరూపిస్తున్నాయి. బహుళజాతి కంపెనీల గురించి ఊహకందని ఆ రోజుల్లోనే పెట్టుబడి సమీకరణ (accumulation of capital) = (concentration-సాంద్రీకరణ + centralization - కేంద్రీకరణ) పర్యవసానంగా బ్రహ్మాండమైన ఉత్పత్తి శక్తుల పునాదిగా భారీ పారిశ్రామిక (corporate) సంస్థలు ఆవిర్భవిస్తాయన్న మార్క్స్ అంచనా నేడు బహుళజాతి సంస్థల రూపంలో సాకారమైంది.

### ప్రపంచ ఆర్థిక వ్యవస్థ - ప్రపంచీకరణ

ప్రణాళికలోని చారిత్రక అంచనాలు ఈనాడు అత్యంత స్పష్టంగా, సంపూర్ణంగా ఆవిష్కృతమైన విషయాన్ని బహుశా మార్క్స్ కూడా అంత గాఢంగా స్వప్నించి ఉండడు. 'జాతీయ సంకుచితత్వం, అల్పబుద్ధి స్వభావం క్రమక్రమంగా అసాధ్యంగా తయారయ్యాయి. ప్రతి దేశం అది పెద్దదైనా, అత్యంత శక్తిమంతమైనదైనా కావచ్చు- మొత్తంగా ప్రపంచ మార్కెట్‌కు లొంగిపోతుండడం అనేది ప్రజల, దేశాల భవిష్యత్‌ను నిర్ణయిస్తుంది.' అని 170 ఏళ్ల క్రితం మార్క్స్ అంచనా ఎన్నడూ లేని విధంగా నేడు మరింతగా స్పష్టంగా కనపిస్తుంది.

పెట్టుబడిదారీ విధానంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అవతరించిందని, అది భూగోళంపై గల అన్ని దేశాలను తనలో అంతర్భాగం చేసుకుంటుదని ప్రపంచీకరణ ప్రాథమిక క్రమాన్ని మార్క్స్ విశ్లేషించాడు. ఇది కేవలం ఒక చారిత్రక సందర్భంలో మార్క్స్ చేసిన వ్యాఖ్య లేదా అంచనా మాత్రమే కాదు. అంతకంటే ముఖ్యంగా ఇది ఒక వస్తుగత చారిత్రక చలననియమాన్ని మార్క్స్ సూత్రీకరించడంగా అర్థం చేసుకోవాలి. ఆయన చారిత్రక వ్యాఖ్యానాలకు స్థల, కాలాల పరిమితులంటాయి గానీ, ఆయన కనుగొన్న చారిత్రక చలన నియమాలకు అఖండ స్వభావం ఉంటుంది. మార్క్స్ సమకాలీన చారిత్రక ఘటనలను వ్యాఖ్యానించిన చరిత్రకారుడు మాత్రమే కాదు, వస్తుగత సామాజిక చారిత్రక చలన నియమాలను సూత్రీకరించిన సామాజిక శాస్త్రవేత్తగా అర్థం చేసుకోగలిగితేనే ఆయన సిద్ధాంతంలోని స్థితి స్థాపక పార్శ్వం, విప్లవాత్మక పార్శ్వం అవగతమవుతుంది. ఆయన సిద్ధాంతానికున్న ప్రాసంగికత అర్థమవుతుంది.

### వడ్డీభుక్త రాజ్యం - సంక్షోభం

సమకాలీన ప్రపంచ ఆర్థిక కార్యకలాపం పారిశ్రామిక ఉత్పత్తి రంగం నుంచి సేవల రంగానికి, ఫైనాన్స్ పెట్టుబడి రంగానికి పెద్దఎత్తున తరలిపోయింది. సేవలు, ఫైనాన్స్ రంగాలు రెండూ ఎప్పుడూ పారిశ్రామిక రంగం సృష్టించే సంపదపైనే ఆధారపడి ఉంటుంది. అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాల్లో ఉక్కు, బొగ్గు, నౌకా నిర్మాణం, కార్ల తయారీ తదితర పారిశ్రామిక రంగాల్లో లక్షలాది మంది కార్మికులు ఉద్యోగాలు కోల్పోతున్నారు. అదే సమయంలో భారత్, చైనా వంటి వర్ధమాన దేశాల్లోనూ ప్రథమ ఉత్పత్తి రంగం (వ్యవసాయం, మైనింగ్, చేపల వేట తదితరాలు), ద్వితీయ ఉత్పత్తి రంగం (వస్తూత్పత్తి, సరకుల తయారీ తదితరాలు) నుంచి పెట్టుబడులు సర్వీసు రంగాల (బ్యాంకింగ్, సాఫ్ట్‌వేర్, విద్య, వైద్యం వంటి) కు పెద్ద ఎత్తున తరలి వెళ్ళాయి. ప్రపంచ వ్యాప్తంగా సర్వీసు రంగం మహా బుడగలా వ్యాపించింది. సర్వీసు రంగంలో పనిచేసే శ్రామిక జనావళి సంప్రదాయక అర్థంలో

కార్మికులుగా ఉండరు. దాంతో కంప్యూటీకరణ, రోబోల వంటి శాస్త్ర సాంకేతికలు పెరిగిన నేపథ్యంలో కార్మికులు క్రమంగా మైనారిటీలుగాను, ప్రాధాన్యరహిత వర్గంగాను మారిపోయారు. సర్వీసు రంగం ఎంత పెరిగినా, దాని పునాది పారిశ్రామిక రంగంపైనే ఆధారపడే జరుగుతుందన్న ఆర్థిక నియమం అర్థం కాని కొందరు మేధావులు కార్మిక రంగం చారిత్రక పాత్ర కోల్పోయిందని సూత్రీకరిస్తున్నారు. సేవా రంగం పెరగడంతో సమాజంలో ఉత్పాదక శ్రమ రంగం కంటే అనుత్పాదక శ్రమ రంగం పెరిగిపోతుంది. దాంతో ప్రపంచ ఆర్థికవ్యవస్థలో ఉత్పాదక శ్రమ రంగంలో అంటే ప్రథమ, ద్వితీయ ఆర్థిక రంగాల్లో పని చేస్తున్న శ్రామికుల కంటే అనుత్పాదక శ్రమ రంగంలో అంటే తృతీయ ఆర్థిక రంగమైన సేవా రంగంలో పనిచేస్తున్న శ్రామికులు ప్రధాన పాత్ర పోషిస్తున్నట్లు కనబడుతారు. ప్రథమ, ద్వితీయ ఆర్థిక రంగాల కంటే తృతీయ ఆర్థికం పెరిగితే ఆ ఆర్థిక వ్యవస్థ వడ్డీ భుక్త (rentier) ఆర్థికవ్యవస్థగా మారుతుందని మార్క్స్ విశ్లేషించారు. వడ్డీ భుక్త ఆర్థిక వ్యవస్థలు క్రమంగా సామాజిక ఆర్థిక సంక్షోభాల్లో కూరుకుపోతాయని ఆయన సూత్రీకరించారు. పెట్టుబడిదారీ విధానం ద్రవ్యపెట్టుబడి ఎగుమతి చేసే దశకు చేరడంతో పెట్టుబడిదారీ దేశాలు మార్క్స్ చెప్పినట్లు వడ్డీ భుక్త రాజ్యాలుగా మారాయి. దాంతోపాటు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలోని పెట్టుబడిదారీ విధానం సైతం నేడు వడ్డీ భుక్త ఆర్థిక విధానంగా రూపాంతరం చెందింది. దాంతో సంక్షోభం ఒక దేశానికే పరిమితం కాకుండా ప్రపంచ ఆర్థిక సంక్షోభంగా అవతరించింది. సేవా రంగం పెరుగుదల గురించిన దూరదృష్టితో కూడిన మార్క్స్ అంచనా నేటి పరిస్థితికి చక్కగా అద్దం పట్టినట్లవుతుంది.

## ఉత్తరార్ధ, దక్షిణార్ధ గోళాల ఆర్థిక వ్యవస్థలు

ఫ్యూడలిజంలో విడి విడిగా, ఒంటరిగా ఉన్న ప్రపంచంలోని వివిధ దేశాల ఆర్థిక వ్యవస్థలన్నీ పెట్టుబడిదారీ విధాన కేంద్రంగా ఒకే ఎంటీటీ (సత్వం)గా ఉన్న ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఆవిర్భవించింది. మొదటి మానవ నాగరికతలు వికాసం జీవనాధారాలు (జీవ వైవిధ్యం, నదులు, అడవులు వగైరా) మెండుగా ఉన్న దక్షిణార్ధ గోళాల్లో ఏర్పడగా, రెండవ దశ నాగరికతలు పారిశ్రామిక ఉత్పత్తికి అవసరమైన ఖనిజాలు వగైరాలు మెండుగా ఉన్న ఉత్తరార్ధ గోళ దేశాల్లో ఏర్పడ్డాయి. ఉత్తరార్ధగోళంలోని పారిశ్రామిక దేశాలు, దక్షిణార్ధ గోళంలోని వ్యవసాయక దేశాలు అంశీభూతాలుగా (components) కలిగిన ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మౌలిక స్వభావం పెట్టుబడిదారీ విధానంగా విశ్వజనీనతను సంతరించుకుంది. దాంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కేంద్రంలో శుద్ధ పెట్టుబడిదారీ విధానం ఆవిర్భవించగా, దాని పొలిమేర ప్రాంతా (దేశాలు) ల్లోని పూర్వ పెట్టుబడిదారీ వ్యవస్థలు (semi-pre capitalist systems) అర్థ వలస, అర్థ పెట్టుబడిదారీ పూర్వ వ్యవస్థలుగా (semi-precapitalist formations) రూపాంతరం చెందాయి. ఆసియా ఉత్పత్తి విధానం, ఆఫ్రికా, లాటిన్ అమెరికా ఖండాలలోని బర్బర, అర్ధ బర్బర సమాజాల్లో గుణాత్మక మార్పులు లేకుండా చారిత్రకంగా కదంతాల్ (ముందుకు పోకుండా ఉన్నచోటనే కదులుతున్న స్థితి) స్థితిలో (Historical marking time)లో ఉన్న ఆర్థిక వ్యవస్థలు, నిదానంగా మందగమనంతో పురోగమిస్తున్న ఆర్థికవ్యవస్థలు గ్లోబల్ పెట్టుబడిదారీ విధానం తాకిడికి రూపాంతరం చెంది, పరివర్తనాత్మక ఆర్థిక వ్యవస్థలుగా పరిణామం చెందాయి. పెట్టుబడిదారీ సమాజాన్ని అధ్యయనం చేయడం నుంచి మార్క్సిజం ఆవిర్భవించినప్పటికీ, అది మానవ సమాజ పరిణామ క్రమాన్ని, మానవ సమాజ అంతర్గత చలన సూత్రాలను, సాధారణ చలన నియమాలను ఆవిష్కరించింది. భారత సామాజిక – ఆర్థిక వ్యవస్థను వలస, అర్థ భూస్వామ్య– అర్ధ బర్బర వ్యవస్థ (semi Feudal-semi barbarian system)గా ఒక సందర్భంలో మార్క్స్ సూత్రీకరించారు. సరకు ఉత్పత్తి, ఎగుమతుల మీద ఆధారపడిన పెట్టుబడిదారీ విధానం క్రమంగా రెంటియర్ రాజ్యాలు (వడ్డీభుక్త రాజ్యాలు)గా మారాయి. వడ్డీభుక్త రాజ్యాలు సరకుల ఉత్పత్తిపై కాకుండా, డబ్బు (ద్రవ్యం) రూపంలోని పెట్టుబడి లేదా దాని వడ్డీ పరిమాణాలపై ఆధారపడి ప్రధానంగా నడిచాయి. అలాంటి వడ్డీ భుక్త రాజ్యాలు ఆర్థిక సంక్షోభంలోకి పీకల్లోతు కూరుకుపోతాయనే చారిత్రక నియమాన్ని మార్క్స్ కనుగొన్నారు.

## దక్షిణార్ధ గోళంలో బ్యూరాక్రటిక్ పెట్టుబడిదారీ విధానం

ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఒక వడ్డీభుక్త రాజ్యంగా ఆవిర్భవించింది. దాంతో ద్రవ్యపెట్టుబడి ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కేంద్రబిందువు అయింది. ఈ వడ్డీ భుక్త రాజ్యంలో ఏర్పడే ఆర్థిక సంక్షోభం ఇంకెంత మాత్రమూ జాతీయ సరిహద్దుల్లో కాక, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ స్థాయిలో సార్వత్రిక ఆర్థిక సంక్షోభంగా సర్వత్రా అలుముకుంది. ఈ సార్వత్రిక ఆర్థిక సంక్షోభం కూడా దశలు దశలుగా తీవ్రతరం కాసాగింది. సార్వత్రిక సంక్షోభం తొలి విడత తీవ్రత మొదటి ప్రపంచ యుద్ధానికి దారితీయగా, మలి విడత తీవ్రత రెండవ ప్రపంచ యుద్ధానికి దారితీసింది. రెండు సంక్షోభాలు ఉత్తరార్ధ గోళంలో యూరప్ కేంద్రంగా సంభవించినప్పటికీ తొలి విడత సంక్షోభ పరిష్కరంగా యూరప్ లోని సోవియట్ రష్యాలో సోషలిస్టు విప్లవం విజయవంతం అయింది. రెండవ విడత సంక్షోభ పరిష్కరంగా కొన్ని యూరోపియన్ దేశాలలోనే కాకుండా, ప్రధానంగా దక్షిణార్ధగోళ

వ్యవసాయక దేశాలలో సోషలిస్టు విప్లవానికి మార్గం సుగమం చేసి నూతన ప్రజాస్వామిక విప్లవాలు వచ్చాయి. ప్రపంచ ఆర్థికవ్యవస్థ కేంద్రంలోని అభివృద్ధి చెందిన పారిశ్రామిక (సామ్రాజ్యవాద) రాజ్యాలలో సార్వత్రిక తిరుగుబాటు అంటే మొదటగా రాజ్యాధికార కేంద్రాలైన పట్టణాలు, రాజధాని నగరాలలో ప్రజా తిరుగుబాటును నడిపి, అధికారం హస్తగతం చేసుకున్న తర్వాత గ్రామీణ ప్రాంతాలను విముక్తి చేసే పద్ధతి కొనసాగింది. అదే దక్షిణార్ధగోళ వ్యవసాయక దేశాల్లో దేశ వ్యాప్తంగా ఉత్పత్తి సంబంధాల అసమాంతరంగా అభివృద్ధి చెందాయి. గ్లోబల్ పెట్టుబడిదారీ విధాన అంచుల్లోని ముడి సరుకుల మార్కెట్లు, శ్రమశక్తి మార్కెట్లుగా ఉన్న ప్రపంచ ఆర్థిక వ్యవస్థ పొలిమేర ప్రాంతాల్లో ప్రజల చైతన్యస్థాయిల్లోను, ప్రాంతీయ అసమానతల్లోనూ విపరీతమైన తారతమ్యతలు ఉన్నాయి. అందువల్ల బాగా వెనుకబడిన, సుదూర గ్రామీణ ప్రాంతాలను మొదటగా విముక్తి చేసి, ఆ తర్వాత క్రమంగా పట్టణ ప్రాంతాలను రాజధానిని చుట్టుముట్టి దేశాన్ని విముక్తి చేసే దీర్ఘకాల సాయుధ పోరాట పద్ధతి ఉనికిలోకి వచ్చింది. ప్రపంచ ద్రవ్యపెట్టుబడితో స్థానిక పెట్టుబడిదారీ పూర్వ వ్యవస్థలు సంశ్లేషితమై (synsthesize) కొత్త తరహా మిశ్రమ ఆర్థిక వ్యవస్థలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థ పొలిమేర ప్రాంతాల్లో ఉనికిలోకి వచ్చాయి. భారత్‌లో అర్ధవలస, అర్ధ భూస్వామ్య స్వభావం గల బ్యూరాక్రటిక్ పెట్టుబడిదారీ విధానం ఏర్పడింది. సామ్రాజ్యవాద పెట్టుబడి (బహుళజాతి సంస్థలు, పెట్టుబడిదారీ దేశాలు, వాటి నిధులతో ఏర్పడిన అంతర్జాతీయ ద్రవ్యసంస్థలు) పొలిమేర దేశాల్లోని ప్రభుత్వ పెట్టుబడి; దళారీస్వభావం గల బడా కార్పొరేట్ సంస్థల పెట్టుబడి; వ్యవసాయ మిగులుతో సంశ్లేషితమై (synsthesize) ఒక మిశ్రమ పెట్టుబడి పునాదిగా పొలిమేర దేశాల్లో విలక్షణమైన పెట్టుబడిదారీ విధానం ఆవిష్కృతమైంది. ఇలాంటి పెట్టుబడిని 'బ్యూరాక్రటిక్ పెట్టుబడి'గా పరిగణించవచ్చు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ పొలిమేర దేశాల్లోని గ్లోబల్ పెట్టుబడిదారీ విధానం ప్రత్యేకించి ఇలాంటి 'బ్యూరాక్రటిక్ పెట్టుబడి' రూపంలో కొనసాగుతుంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కేంద్రంలో సామ్రాజ్యవాద రూపంలోను, పొలిమేర వ్యవసాయ ప్రధాన దేశాల్లో బ్యూరాక్రటిక్ పెట్టుబడిగానూ గ్లోబల్ పెట్టుబడిదారీ విధానం కొనసాగుతుంది.

## మార్క్సిజం అన్వయ వైవిధ్యత

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలోని కేంద్రం, పొలిమేర ప్రాంతల్లోని విలక్షణ స్వభావానికి అనుగుణంగా స్థానిక రాజకీయాలు, మార్క్సిజం అమలులో వైవిధ్యం నెలకొనింది. కేంద్ర ప్రాంతంలోని పెట్టుబడిదారీ సమాజంలోని అంతర్గత వైరుధ్యం పరిష్కారం నేరుగా సోషలిస్టు విప్లవ స్వభావాన్ని కలిగి ఉంది. పెట్టుబడిదారీ పూర్వ వ్యవస్థల అవశేషాలతో కూడుకొని ఉన్న ప్రపంచ ఆర్థిక వ్యవస్థ పొలిమేర ప్రాంతంలోని బ్యూరాక్రటిక్ పెట్టుబడిదారీ విధానంలోని అంతర్గత వైరుధ్యాల పరిష్కారం నేరుగా సోషలిస్టు విప్లవం ద్వారా కాక, కమ్యూనిస్టు శక్తుల నాయకత్వంలో మధ్యంతరంగా నూతన ప్రజాస్వామిక విప్లవం, ఆ తర్వాత సోషలిస్టు విప్లవం అనే రెండు దశల విప్లవాల ద్వారా సంభవం అవుతుంది. మార్క్సిజం అన్వయం ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఉత్తరార్ధ గోళ కేంద్ర ప్రాంతంలో సోషలిస్టు విప్లవ పంథాలో సాగితే, దక్షిణార్ధ గోళ పొలిమేర ప్రాంతం నూతన ప్రజాస్వామిక విప్లవం రూపంలో జరిగింది. శతజయంతి ఉత్సవాలు జరుపుకుంటున్న 1917 రష్యా సోషలిస్టు విప్లవం, 1949లో చైనా నూతన ప్రజాస్వామిక విప్లవం, యూరోప్, ఆసియా దేశాల్లోని విప్లవాలు, అర్ధ శతజయంతి ఉత్సవాలు జరుపుకుంటున్న 1967లో చైనా సాంస్కృతికవిప్లవం, భారత్‌లో 1967లో నక్సల్‌బరీ తిరుగుబాటు, ప్రస్తుతం కొనసాగుతున్న విప్లవోద్యమాలు మార్క్సిజం అన్వయ వైవిధ్యతలకు ప్రత్యక్ష తార్కాణాలుగా నిలుస్తాయి. అదనపు విలువ దోపిడీ పునాదిగా ఏర్పడే మారక విలువల రూపంలోని ఆర్థిక సంక్షోభం + భూసారం, పునరుద్ధరించలేని ఖనిజాల దోపిడీ పునాదిగా ఏర్పడే ఉపయోగ విలువల రూపంలోని పర్యావరణ సంక్షోభం కలిసి 'యుగ సంక్షోభం'తో మానవ సమాజాలు అతలాకుతలమవుతున్నాయి. గ్రుండ్రెస్సు, పెట్టుబడి గ్రంథాలలో భూసారం దోపిడి వంటి ఉపయోగ విలువల రూపంలోని సంక్షోభాన్ని గురించి మార్క్స్ ప్రస్తావించారు. అయితే మార్క్స్ రాసిన పర్యావరణ సంక్షోభ భావనలను లెనిన్, మావోలు సైతం అభివృద్ధిపరచకుండా నిర్లక్ష్యం చేసారు. దాంతో ప్రపంచ వ్యాప్తంగా కమ్యూనిస్టు ఉద్యమాలు 'యుగ సంక్షోభ' భావనను సజావుగా గుర్తించడంలో విఫలమయ్యాయి. చారిత్రక వ్యవస్థల పరిణామ క్రమం (ఆదిమ, బానిస యాజమాన్య, ఫ్యూడల్, పెట్టుబడిదారీ వ్యవస్థల క్రమ పరిణామం) లోని ప్రతి దశలోనూ ఆర్థిక + పర్యావరణ సంక్షోభాలు ఏకకాలంలో 'యుగ సంక్షోభాలు' గా సంభవించి సామాజిక వ్యవస్థల విప్లవాత్మక మార్పులకు దోహదం చేసాయి. 'యుగ సంక్షోభం' రూపంలోని విప్లవ యుగ చారిత్రక స్వభావాన్ని గుర్తించి, దాని పరిష్కారం కోసం ప్రజల్ని సంఘటితం చేయవలసిన తరుణమిది. అందుకు మార్క్సిజాన్ని సవ్యంగా అధ్యయనం చేయాలి. మార్క్స్ చేసిన చారిత్రక వ్యాఖ్యానాల వల్లెవేతకు పరిమితం కాకుండా అయన వెలికితీసిన వస్తుగత సామాజిక చలన నియమాలను అవగతం చేసుకొని సృజనాత్మక అన్వయానికి కృషి చేయాలి. ❑

# అభ్యుదయ సాహిత్య వేదిక పెనుగొండ వ్యాస సంపుటి 'దీపిక'



తక్కోలు మాచిరెడ్డి

పునరుద్ధరణవాదులు దేశాన్ని శాసించే స్థితికి వచ్చిన ప్రస్తుత సందర్భంలో అరసం, విరసం, సాహితీ స్రవంతి, జనసాహితి కలిసి దీన్ని ఎదుర్కొనాల్సిన అగత్యం ఉంది. మరి ఈ ఉద్దేశంతోనేమో సాహితీస్రవంతికి చెందిన వరప్రసాద్‌తో పుస్తకం వెనుకట్ట మీద అభిప్రాయం ప్రచురించారు పెనుగొండ. ఇది ఆహ్వానించగ్గదే. పెనుగొండ లక్ష్మీనారాయణ అభ్యుదయ రచయితల సంఘం అరసం జాతీయ కార్యదర్శి. కాని ఆయన తనను అరసం కార్యకర్తగానే భావించుకుంటారు. అది ఆయన వినయశీలతకు నిదర్శనం. ఆయన రాసిన వ్యాససంపుటిలో 36 సాహితీ వ్యాసాలున్నాయి. కొన్ని ప్రసంగాలకు వ్యాసరూపం ఇవ్వడం జరిగింది. అటువంటి వ్యాసరూపమే 'సజీవ స్రవంతి అభ్యుదయ కవిత్వం.' ఇదో సోదాహరణ ప్రసంగం. సిరికి స్వామి నాయుడు పేద రైతును గురించి అన్నాడు ఇలా..చేసిన అప్పులు తీర్చలేక/నేల చూపులు చూస్తూ నడివీధిలో అతడు తల దించుకుంటే/ ఒక దేశం తలదించుకున్నట్టు ఉంది. 'దీపిక' రెండవ అధ్యాయం దళిత జీవన చిత్రణకు కేటాయించారు పెనుగొండ. ఇందులో భాగంగా రామనపల్లెలో జరిగిన ఘటనపై గజ్జెల మల్లారెడ్డి చెప్పిన కవితను ఉటంకించారు.




జరిగిందేమిటంటే, కడప దగ్గర రామనపల్లెలో దళితుల గుడిసెలను అగ్రవర్ణాల వారు తగులబెట్టించారు. ఆ పేదల గుడిసెలు తగులబడుతుంటే, చూసి, ఆవేశంతో, ఆవేదనతో ఆశువుగా గజ్జెల మల్లారెడ్డి చెప్పిన గేయంలోని కొన్ని పంక్తుల్ని ఉటంకించారు

*పూరిగుడిసెలకు అగ్గిపెడితే మేడలు, మిద్దెలు మిగలవురా*
*కష్టజీవి ముక్కంటి మంటలో కాలిబూడిదైపోవురా*
*తరతరాల మీ దోపిడీ మీదను తిరుగుబాటు చెలరేగునురా*
*వెట్టిచాకిరీ దౌర్జన్యాలు ఇకపై చెల్లవు చెల్లవురా!*

మా ఆహ్వానంపై కడపకు విచ్చేసి పెనుగొండ చేసిన ప్రసంగానికి అక్షర రూపం ఈ వ్యాసం. ప్రసంగం చివరిలో మార్క్స్, అంబేద్కర్ సిద్ధాంతాలు రెండూ విమోచన మార్గాలుగా గుర్తిద్దామని పిలుపు ఇస్తూ లాల్ నీల్ జెండాలు ఏకం కావాలి అంటారు పెనుగొండ. కరోనాతో 54 వ యేటనే అకాల మరణం పాలైన 'విశాలాంధ్ర' దినపత్రిక సంపాదకులు ముత్యాల ప్రసాద్‌ను 'నిజమైన పాత్రికేయ ముత్యం' అంటూ ప్రశంసించారు పెనుగొండ. గురజాడ రచనలకు సంపాదకత్వం వహించి ప్రచురించారు సెట్టి ఈశ్వరరావు గారు. 'కన్యాశుల్కం' నాటకాన్ని నవలికగా మలిచారు. కొన్ని ఈశ్వరరావు రచనల్ని, ప్రచురణకై 'విశాలాంధ్ర' కు పంపారు పెనుగొండ లక్ష్మీనారాయణ. అరసం మహాశక్తి రాంభట్ల కృష్ణమూర్తిని ఓ విజ్ఞాన సర్వస్వం అని పేర్కొంటూ, ప్రాథమిక స్థాయిలో చదువు ఆగిపోయినా, స్వయంకృషితో ఆంగ్లం, తెలుగు, సంస్కృతం, ఉర్దూ భాషల్ని అభ్యసించి పాండిత్యాన్ని సంపాదించాడని తెలియజేశారు రచయిత. 1948లో 'విశాలాంధ్ర' మాసపత్రికలో ప్రచురితమైన కడలూరు జైలు నుండి తుమ్మల వెంకట్రామయ్య రాసిన గేయం 'చెల్లీ' నేపథ్యాన్ని పెనుగొండ వివరించారు ఇలా.. తుమ్మల చెల్లెలు జగదాంబ. ఆమె భర్త గోగినేని తాతయ్య రైతు కూలీ సంఘనేత, పార్టీ కార్యకర్త. కృష్ణాజిల్లా దివిసీమ నాగాయలంక వద్ద గల తలగడదీవి కొత్తపాలెం గ్రామంలో ఏర్పాటైన పోలీసు క్యాంపులో తాతయ్యను ఆ పోరాటానికి సహకరిస్తున్నాడని చెట్టుకు కట్టి కాల్చి చంపారు. ఈ వార్తను విన్న తుమ్మల తన చెల్లిని సంబోధిస్తూ రాసిన ఆర్ద్రగీతం 'చెల్లీ'.

ఒక వీరుడు మరణిస్తే/వేలకొలది ప్రభవింతురు! ఒక నెత్తుటిబొట్టులోనే/ప్రళయాగ్నులు ప్రజ్వరిల్లు! అని సోమసుందర్ భరోసా యిస్తూ 'వజ్రాయుధం' అందించాడు 1949లో. ఇది వెలువడిన వెంటనే నిషేధానికి గురైంది. అజ్ఞాత జీవితం గడిపాడు కవి సోమసుందర్. నైజాం తెలంగాణాలో రజాకార్ల అకృత్యాలకు బలైపోయిన మహిళల దుస్థితిపై 'కృష్ణాపత్రిక' లో ప్రచురితమైన వార్తా కథనానికి చలించి ఆరుద్ర 'త్వమేవాహం' కావ్యం రాశాడు. మృత్యువు ఒక వ్యక్తితో నువ్వే నేను త్వమేవాహం అంటుంది.

సమాజంలోని ఘటనల్ని గడియారంతో పోల్చుతూ ప్రతీకాత్మకంగా వర్ణిస్తాడు ఆరుద్ర. గడియారంలోని గంటల ముల్లు ధనిక స్వామ్యానికి ప్రతీక. నిముషాల ముల్లు మధ్యతరగతి వారి మానసిక స్థితికి ప్రతీక. సెకన్ల ముల్లు కష్టజీవులకు ప్రతీక. ఒక స్టాపువాచీని విప్లవానికి కొలబద్దగా/అలారంను మనల్ని జాగ్రత్తపరిచే సాధనంగా కాలాన్ని నిర్వచించిన దీర్ఘకావ్యం 'త్వమేవాహం' అంటూ వివరించారు పెనుగొండ.

గంగినేని వెంకటేశ్వరరావు రచించిన 'ఉదయిని' కవితా సంపుటిని ఆంధ్ర అరసం 1950 అక్టోబరులో ప్రచురించింది. గంగినేనిని పోలీసుక్యాంపులో చిత్ర హింసలు పెట్టారు. 'ఉదయిని' ని సమర్పిస్తూ అంటాడు అనామకంగా, అమాయకంగా అడవులలో ఆత్మార్పణ చేసిన విశాలాంధ్ర వీరులారా! మీ గౌరవ చిహ్నంగా మీ కాళ్లముందు తలదించుతున్నా! మీ స్మృతి చిహ్నంగా మీ చేతుల్లో 'ఉదయిని' ఉంచుతున్నా! అంటూ అమరవీరులకు అంకితం చేశాడు ఈ కవితా సంపుటిని. ఇకపోతే, నాటక సాహిత్యానికి వస్తే సుంకర సత్యనారాయణ రాసిన 'మా భూమి', వాసిరెడ్డి భాస్కరరావు రచించిన 'ముందడుగు' నాటకాలు ప్రసిద్ధం. 'మా భూమి' నాటకాన్ని ఆనాటి మద్రాసు ప్రభుత్వం నిషేధించింది. అది తెలంగాణ రైతుగాథ. ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి రాసిన 'మరో చర్చ'ను సమీక్షిస్తూ ఓ వ్యాసం ఉంది. ఈ సంపుటిలో తెలుగు సాహిత్య విమర్శపై సాధికార విశ్లేషణ అనే శీర్షికతో మార్క్సీయ విమర్శకుడు కా॥బి.సూర్యసాగర్ రాసిన 'శ్రుతి' ని విశ్లేషిస్తూ రాచపాళెం "సూర్యసాగర్ కమ్యూనిస్టు పార్టీ రాజకీయ ధోరణుల మీద కూడా చాలా విమర్శలు పెట్టారు. కొన్ని సందర్భాలలో ఇటు పార్లమెంటరీ కమ్యూనిస్టులను, అటు విప్లవ పార్టీలనూ విమర్శించి తనదైన ఒక మార్గాన్ని సరైనదిగా చెప్పకనే చెప్పుకొంటూ వచ్చారు. దీనిని నిశితంగా పరిశీలించాల్సి ఉంది అని అన్నట్లు సందర్భోచితంగా ఉటంకించారు పెనుగొండ.

'సామాజిక, సాహిత్య ఉద్యమజీవి ఎస్వీ' అనేశీర్షికన ఎస్.వి. సత్యనారాయణను గురించి రాస్తూ, ఆయన తెలుగులో ఉద్యమ గీతాల అనే పరిశోధన గ్రంథం, 'తెలంగాణా సాయుధ పోరాట సాహిత్యం', 'జీవితం ఒక ఉద్యమం' అనే కవితా సంపుటి లాంటి అనేక రచనలు చేశారని తెలియజేశారు పెనుగొండ. అరసంలో అనేక హోదాలలో ఇద్దరూ కలిసి పని చేశారని తెలియజేస్తూ, 'జీవితం ఒక ఉద్యమం'లోని ఆత్మీయగీతం' తన గురించేనని కొన్ని పంక్తులు ఉటంకించారు. ఎస్వీ రాశాడు: 'అతడొక మౌన కృషీవలుడు/నిర్విరామ పథికుడు/అతనొక అభ్యుదయ సాహిత్యోద్యమ కార్యకర్త/అరుదుగా అద్భుతమైన కవితలల్లే కార్యకర్త/ఆధునిక కథా సరిత్సాగరంలో/ఆణిముత్యాల నేరుకుంటూ ఉంటాడు.

'దీపిక' లో కథలు రాయడం ఎలా? అనే శీర్షికన ఓ వ్యాసం ఉంది. ఈ అంశంపై వివిధ రచయితల అభిప్రాయాన్ని ఉటంకించిన పెనుగొండ లక్ష్మీనారాయణ కథానికా రచన గురించి శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మ తన 'కథ ఎట్లా ఉండాలి?' అనే అంశం మీద రాసిన కథాంశం ప్రస్తావిస్తూ ఈ వాక్యాలు ఉటంకించారు. ఆమె అంటారు "మనోహరమైన ఒక గులాబీ పువ్వు యొక్క ఆకృతి, రంగు, మృదుత్వము, పరిమళము, మకరందము మనలనెట్లా ఆకర్షిస్తూ ఉంటాయో, అలాగే కథా కుసుమం కూడా కల్పన అనే ఆకృతి, వర్ణన అనే రంగూ, శైలి అనే మృదుత్వము, రసమనే పరిమళము, నీతి అనే మకరందము కలిగి ఆకర్షవంతమైనవిగా ఉండాలి. ఇందులో ఏది లోపించినా కథా కుసుమం రాణించదు.

కథా సంకలనాల విషయానికొస్తే, సుప్రసిద్ధ కథా రచయిత చాసో (చాగంటి సోమయాజులు) మార్చి 1985లో సంకలనం చేసిన 'కళింగ కథానికలు' మొదటి ప్రాంతీయ సంకలనం అయినా, ఇందులో కళింగ ప్రాంతానికి చెందిన కథలు కనపడవు. కాని రచయితలందరూ ఆ ప్రాంతానికి చెందిన వారే. 1992 ఆగస్టులో 'సీమకథలు' అనే సంకలనాన్ని సింగమనేని నారాయణ సంపాదకత్వంలో విశాలాంధ్ర ప్రచురణాలయం ప్రచురించింది. నిర్దిష్ట ప్రాంతీయ స్వభావం గల కథలివి. రాయలసీమ జీవితాన్ని విమర్శనాత్మక వాస్తవికతావాద దృష్టితో రాసిన కథలివి. అనంతపురం జిల్లా రచయితల సంఘం వారు 'ఇనుప గజ్జెల తల్లి' అనే శీర్షికతో సింగమనేని నారాయణ, శాంతినారాయణ అనంతపురం కరువు కథల సంపుటిని వెలువరించారు.

మరో అధ్యాయంలో విరసం ప్రచురణల్ని పేర్కొన్నారు పెనుగొండ. 'దీపిక'లో అంతిమవ్యాసం మనం సాధించాల్సిన సాంస్కృతిక విధానం. ఒక సాంస్కృతిక విశ్వవిద్యాలయాన్ని స్థాపించాలని సూచిస్తూ, ఒక అనువాద అకాడమీని నడపాలని కోరారు. పెనుగొండ లక్ష్మీనారాయణ విస్తృత అధ్యయనం, అరసాన్ని గురించిన సాధికార సమాచారం, సంస్కృతికీ, అనువాదానికి సంబంధించిన అమూల్య సూచనలు 'దీపిక' ప్రత్యేకతలు. వరప్రసాద్ అన్నట్లు రచయితలకు, ఔత్సాహికులకు, ముఖ్యంగా సాహిత్య పరిశోధకులకు ఈ దీపిక నిజంగానే కరదీపిక. ❑